
ప్రజలే ప్రభువులు

# జనబలం

ఏప్రిల్ 2022 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-








## లోక్‌సత్తా కంటే ఆప్ భిన్నంగా ఏం చేసింది?

## శ్రీలంక సంక్షోభం మనకో హెచ్చరిక

## ప్రజలు , ప్రభుత్వోద్యోగ వ్యవస్థ మధ్య యుద్ధమే పరిష్కారమా?




## కావాల్సింది కొత్త మెడికల్ కాలేజీలు కాదు.. ప్రజలందరికీ 'జేబు ఖర్చులేని నాణ్యమైన వైద్యం'

# ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం



పంజాబ్‌లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఘనవిజయం, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ రెండోసారి అధికారంలోకి రావటం ఆషామాషీ కాదు. ప్రజలు చూపిన ఓటింగ్ పరిణతికి తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అద్దం పడుతున్నాయి. కులం, మతం, ప్రాంతం వంటి ఆదిమ భావోద్వేగాలనే ఇంకా నమ్ముకుని లెక్కలేసుకున్నవారి అంచనాలను తోసిపుచ్చుతూ.. మెరుగైన పాలన అందించిన వారికి, పద్ధతి ప్రకారం పార్టీని నడుపుతున్నవారికి ప్రజలు అవకాశమిచ్చారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచి పరిణామం.

'ఆప్' ఢిల్లీలో విజయం సాధించటానికి అనుకూలించిన ప్రత్యేక పరిస్థితులు పంజాబ్‌లో తక్కువ. ఢిల్లీలోలా రాజకీయ శూన్యత వంటి అంశాలున్నా, ప్రధానంగా ఆప్ ట్రాక్ రికార్డు గెలుపుకి దోహదం చేసింది. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలలో గణనీయ కృషి చేసింది. నేను స్వయంగా వెళ్లి పరిశీలించాను. విద్యలో ఇంకా చేయవలసింది ఉంది గానీ, ఆరోగ్య రంగంలో చెప్పుకోదగిన ప్రగతి సాధించారు. విద్య, ఆరోగ్యాలను అధికార రాజకీయానికి కేంద్రబిందువు చేయటం, చేసింది చెప్పుకుని ఓట్లు అడగటం ప్రజల్ని స్పందింపచేసింది. అలాగే మన వద్ద ఎప్పుడో వచ్చిన పథకాలే అయినా, ఉత్తరప్రదేశ్‌లో వాటిని సమర్థవంతంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేసింది. అభివృద్ధి దిశగా మౌలిక వసతుల్ని ప్రోత్సహించింది. ఈ పనుల్ని ప్రతిపక్ష ఎస్పీ నేత అఖిలేష్ హయాంలో కూడా చేసినా, చట్టబద్ధపాలన మెరుగ్గా ఉండటంతో యోగి ప్రభుత్వం వైపే ప్రజలు మొగ్గు చూపారు.

కొత్త రాజకీయానికి ఇరవై స్థాయిలో ఉన్న అవకాశాల్ని ఆప్ అరవై దాకా పెంచింది. ఢిల్లీలో అవకాశంలేని అంశాలను పంజాబ్‌లో అమలు చేసే అవకాశం ఆప్‌కి ఉంది. పూర్తిస్థాయి రాష్ట్రమైన పంజాబ్‌లో ఆప్ పాలనా సంస్కరణల్ని అమలు చేస్తే ఇతర రాష్ట్రాలూ అనుకరిస్తాయి. ఢిల్లీ ఎన్నికల దగ్గర్నుంచీ ఆప్‌కి మద్దతిస్తూనే వస్తున్నాం. లోక్‌సత్తా వలంటీర్లు ఆప్ తరపున ఎన్నికల్లో పనిచేస్తున్నారు. పలుచోట్ల లోక్‌సత్తా నేతలే ఆప్ నాయకులుగా ఉన్నారు. తెలుగునాట కూడా ఆప్ సంస్థాగత నిర్మాణంతో ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతుంటే నిధుల సమీకరణలో సహకారం అందించాను. సమాజహితం కోసం చిత్తశుద్ధితో ఎవరు పనిచేసినా వారంతా లోక్‌సత్తా మనుషులే.

# శ్రీలంక సంక్షోభం మనకో హెచ్చరిక

ఆప్ ఇస్తున్న ఉచితాలను మీరెందుకు సమర్థిస్తున్నారని కొందరు అడుగుతున్నారు. నిస్సహాయులకు తప్ప ఎవరికైనా వ్యక్తిగత లబ్ధిని చేకూర్చే, అనుత్పాదకంగా ఉండే ఉచితాలకు నేను వ్యతిరేకం అనటంలో సందేహం లేదు. కానీ ఈవేళ్టి రాజకీయంలో తాయిలాలు లేకుంటే ఏ పార్టీకయినా ఓటమి దాదాపు ఖాయం. అందుకే ఉచితాలను పూర్తిగా తోసిపుచ్చటం కంటే, వాటిని ఒక పరిధి దాటకుండా నియంత్రించటం, సాధ్యమైనంత ఉత్పాదకంగా ఉండేలా చూడటం ఆచరణసాధ్యమనిపించుకుంటుంది. ఉచితాలు మితిమీరితే ఏం జరుగుతుందో శ్రీలంకలో తాజాగా చూస్తున్నాం.

ఇష్టారాజ్య విధానాలు, విచ్చలవిడి జనాకర్షక పందేరాలు, ఖజానా నిర్వహణలో కనీస క్రమశిక్షణ కొరవడటం, కుటుంబ రాజకీయాల వల్లే శ్రీలంక ఆహార, ఆర్థిక సంక్షోభంలోకి జారిపోయింది. ఇది పేదదేశాలన్నిటికీ ఓ హెచ్చరిక. మన దేశంలో కూడా అనేక రాష్ట్రాలు అభివృద్ధిని, ప్రభుత్వం చేయాల్సిన మౌలిక బాధ్యతల్ని విస్మరించి ఎన్నికల్లో గెలుపే పరమావధిగా విచక్షణారహితంగా తాత్కాలిక తాయిలాల్ని పందేరం చేస్తున్నాయి. ఉద్యోగులకు జీతాలివ్వటం, పందేరాలు చేయటం, మద్యం వంటి బలహీన పద్ధతుల్లో ఆదాయాన్ని సమీకరించుకోవటం.. ఇవి మూడే పాలన అన్నట్లుగా పరిస్థితి తయారైంది. దీనివల్ల దేశంలో చట్టబద్ధపాలన, కనీస సౌకర్యాలు, మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం తీవ్ర మూల్యాన్ని చెల్లిస్తున్నాయి. విద్య, ఆరోగ్యంలో మన ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయి, పేద, మధ్యతరగతి వారిపై విపరీత భారం మోపుతూ పేదరికాన్ని కొనసాగిస్తున్నాయి. తీరు మార్చుకోకుంటే, ఒక్కో రాష్ట్రం ఒక్కో శ్రీలంకలా తయారయ్యే ప్రమాదముంది. ప్రభుత్వాల మౌలిక బాధ్యతలకు ఆవల ఇచ్చే సబ్సిడీలు ఒక పరిధి దాటకుండా నియంత్రించేలా ఎఫ్ఆర్‌బీఎం చట్టాన్ని విస్తరించాల్సి ఉంది.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 25 సంచిక 04

ఏప్రిల్ 2022

సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# జన రాజకీయానికి బాసట.. ఆమ్ ఆద్మీ విజయబావుటా!

పంజాబ్ శాసనసభ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన ఘన విజయం దేశ రాజకీయ చర్చను సవ్యమైన దిశలోకి మళ్లించడానికి తోడ్పడిందని చెప్పవచ్చు. సంప్రదాయ రాజకీయ పక్షాలు తమకు అలవాటయిన అన్ని రకాల ఎత్తులను, జిత్తులను ప్రయోగించాయి. కులం, మతం, ప్రాంతం వంటి భావోద్వేగ అంశాలన్నిటినీ తెరపైకి తెచ్చాయి. ప్రజల్ని విభజించడానికి వీలయిన నినాదాలను ఎలుగెత్తి చాటాయి.

నిన్నటివరకూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉన్న దళిత ఓటు బ్యాంకును కైవసం చేసుకునే ఉద్దేశ్యంతో ఎన్నికలకు నాలుగు నెలల ముందు చరణ్‌జిత్ సింగ్ చన్నీని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టింది. పేద, దళిత కుటుంబం నుంచి వచ్చిన చన్నీ వారి కష్టాలను తీర్చుతారని కాంగ్రెస్ హైకమాండ్ ప్రకటించింది. చరణ్‌జిత్‌సింగ్ చన్నీ కూడా తన దళిత అస్థిత్వాన్ని గురించి ఎక్కువ మాట్లాడారు. ఎన్నికల ముందు ఎన్నో ఉచిత పథకాలను ప్రకటించారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబు రైతులు ఏడాదిపాటు సాగించిన ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్ష మద్దతు ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడు నవజ్యోత్‌సింగ్ సిద్ధూ 'పంజాబ్ రోడ్ మ్యాప్' పేరుతో ఏదో ఒక రూపంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికను విడుదల చేశారు. అయితే అధికారంలో ఉంటూ మౌలిక సమస్యలపై దృష్టి సారించక పోవడంతో సిద్ధూ ప్రణాళికకు ఆదరణ లభించలేదు. అధికారం కోసం సిద్ధూ చేస్తున్న ప్రయత్నంగానే భావించారు. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 37శాతం ఓట్లతో 77 స్థానాలతో పటిష్టమైన స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 23శాతం ఓట్లతో 18స్థానాలు మాత్రమే పొందగలిగింది.

సిక్కుల ప్రాతినిధ్య పార్టీగా పంజాబు రాజకీయాల్లో చిరకాలంగా ప్రధానపాత్ర పోషిస్తున్న శిరోమణి అకాలీదళ్ బహుజన్ సమాజ్ పార్టీతో కలసి పోటీ చేసింది. వ్యవసాయ చట్టాలను బలపరిచిన అకాలీదళ్.. రైతుల ఆందోళనను చూసిన తర్వాత తన వైఖరిని మార్చుకున్నది. అంతకుముందు బీజేపీతో తనకున్న బంధాన్ని తెగతెంపులు చేసుకున్నది. కాంగ్రెస్ పార్టీలోని ముఠా తగాదాలను ఆధారంగా చేసుకుని ప్రతికూల ఓటుతో గెలవడానికి ప్రయత్నించింది. అకాలీదళ్‌కు 18.38శాతం ఓట్లు, మూడు సీట్లు మాత్రమే దక్కాయి. బీఎస్పీ 1.7శాతం ఓట్లుతో ఒక స్థానాన్ని పొందింది.

బీజేపీ కూడా తన వంతు విభజనవాద, భావోద్వేగ అంశాల ఆధారంగా పోటీ చేసింది. కాంగ్రెస్ నుండి చీలిపోయి మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ పంజాబ్ లోక్‌కాంగ్రెస్ పేరుతో సొంత పార్టీ స్థాపించి అకాలీ చీలిక వర్గం సంయుక్త శిరోమణి అకాలీదళ్‌తో పొత్తు పెట్టుకున్నారు. 1984 నాటి సిక్కుల ఊచకోత, దేశభద్రత, ఖలిస్థానీ తీవ్రవాదం వంటి అంశాలను ఆ కూటమి ప్రచారం చేసింది. ఆమ్ఆద్మీ పార్టీని ఖలిస్థానీ తీవ్రవాదుల మద్దతు ఉన్న పార్టీగా చిత్రీకరిస్తూ దాడి సాగించింది. 6.6శాతం ఓట్లతో రెండు స్థానాలలో బీజేపీ గెలుపొందింది.

సంప్రదాయ రాజకీయ పార్టీలు కులాన్ని, మతాన్ని, ప్రాంతీయతత్వాన్ని, రకరకాల భావోద్వేగాల్ని రెచ్చగొట్టాయి. ధనబలాన్ని యథేచ్ఛగా వినియోగించాయి. ఉచితాలను, తాయిలాలను ఆశపెట్టాయి. దేశభక్తి, సరిహద్దు భద్రత వంటి అంశాలను ఎన్నికల ప్రచారంలోకి తెచ్చాయి. అయితే పంజాబ్ ప్రజలు వీటన్నింటినీ ముక్తకంఠంతో తిరస్కరించారు.

ఆమ్ఆద్మీపార్టీ 42శాతం ఓట్లతో 92 స్థానాలను గెలిచి పంజాబ్ ఎన్నికల చరిత్రను తిరగరాసింది. విద్య, ఆరోగ్యం, ఉపాధికల్పన, వలసల నివారణ వంటి ప్రజల మౌలిక సమస్యల గురించి మాత్రమే ఆమ్ఆద్మీ పార్టీ మాట్లాడింది. భావోద్వేగాలతో కాకుండా నిత్యజీవిత సమస్యలపై ప్రజలు ఆలోచించేటట్లు చేయడంలో అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆప్ విజయవంతం అయ్యింది. ఉచితాలు, తాయిలాలు జీవితాన్ని మార్చబోవని, విద్య, ఆరోగ్యం బాగుంటేనే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆప్ గట్టిగా ప్రచారం చేసింది. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం విద్యారంగంలో, ఆరోగ్య రంగంలో సాధించిన విజయాలను ఒక రుజువుగా చూపించింది. విద్యుత్, త్రాగునీటి రంగంలో అవినీతిని అరికట్టి తక్కువ ధరలకు అందించిన 'ఢిల్లీ నమూనా'కు పంజాబ్‌లో ఆదరణ లభించింది.

పరిపాలనలో పారదర్శకతనూ, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా అవినీతిని అరికట్టిన ఆప్ ప్రభుత్వ పాలనా విధానం పంజాబ్ ప్రజల్ని ఆకట్టుకున్నది.

రాజకీయాలలో నూతన సంస్కృతి తీసుకురావాల్సిన అవసరాన్ని గురించి ఆప్ విస్తృత ప్రచారం సాగించింది. వ్యక్తులపై నిందా ప్రచారాలకు దూరంగా, హుందాతనంగా సాగిన ఆప్ ప్రచారం అన్ని వర్గాలను ఆకర్షించింది. ఎన్నికల్లో ధనబలాన్ని, కండబలాన్ని, కులపెత్తందారుల ఆధిపత్యాన్ని ఓడించి సామాన్యులకు రాజకీయ అధికారాన్ని అందించాలంటూ ఆప్ చేసిన విజ్ఞప్తి ప్రజల్లోకి చొచ్చుకుపోయింది.

వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన రైతు ఉద్యమంలో పాల్గొన్న కొన్ని సంఘాలు కూటమిగా అభ్యర్థులను నిలిపినా అందులో ఒక్కరు కూడా విజయం సాధించలేదు. రైతు ఉద్యమాన్ని బలపరిచిన కాంగ్రెస్‌కు ఫలితం దక్కలేదు. రైతు ఉద్యమంలో పెద్దగా మమేకం కాకపోయినా ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించిందంటే అందుకు కారణాలు వేరుగా ఉన్నాయని వెల్లడయ్యింది.

కాంగ్రెస్ అకాలీదళ్, బీజేపీ, బీఎస్పీ వంటి సంప్రదాయ రాజకీయ పక్షాల రాజకీయాలపై ప్రజల్లో పేరుకుపోయిన ఏవగింపు ఎన్నికల ఫలితాల్లో వ్యక్తం అయ్యింది. సంప్రదాయ పార్టీలలోని కీలక నేతలు అందరూ ఓడిపోవడం, రాష్ట్ర రాజకీయాల్లో వస్తున్న కొత్త మార్పులకు సంకేతం అని చెప్పాలి. పంజాబ్‌పై పెత్తనం చేస్తున్న సంప్రదాయ ఆధిపత్య వ్యవస్థను ప్రజలు తమ తీర్పుద్వారా బద్దలు కొట్టారు. ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీపై మొబైల్ రిపేరు చేసే సామాన్య యువకుడు విజయం సాధించాడు, " నా తండ్రి వ్యవసాయ కూలీ, మా అమ్మ పారిశుద్ధ్య కార్మికురాలు, నాకు చదువుకునే వీలు లేక మెకానిక్ అయ్యాను. మా బిడ్డల భవిష్యత్ బాగుపడాలంటే విద్య, ఆరోగ్యం ముఖ్యం, అందుకే మార్పు కోసం పోరాడాం' అని లాభ్‌సింగ్ ఉగోకే పేర్కొన్నాడు. ప్రత్యర్థులందరూ కలిసినా అందనంత ఎత్తులో 51శాతం ఓట్లతో లాభ్‌సింగ్ గెలుపొందడం పంజాబ్ రాజకీయాల్లో వచ్చిన మౌలిక మార్పును సూచిస్తోంది. ప్రజల్ని ఒప్పించగలిగితే నూతన రాజకీయ సంస్కృతితో కూడిన ప్రత్యామ్నాయం సాధ్యమేనని పంజాబ్ ఎన్నికలు నిరూపించాయి. ప్రజల మనోగతాన్ని అర్థం చేసుకుని వారి నమ్మకాన్ని నిలుపుకోవాల్సిన బాధ్యత పంజాబ్ ఆమ్ఆద్మీ ప్రభుత్వంపై ఉంది.

డి. సోమసుందర్


## ప్రజలు, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ మధ్య

# యుద్ధమే పరిష్కారమా?

ప్రస్తుత రష్యా యుద్ధం కంటే ముందు మన తెలుగునాట కూడా ఒక యుద్ధ వాతావరణం నెలకొంది. అయితే ఇది దేశాల మధ్య యుద్ధంలాంటిది కాదు. ఇందులో భౌతికదాడులు ఉండవు. హింస, ప్రాణాంతక ఆయుధాల ప్రయోగం ఉండవు. ప్రభుత్వోద్యోగ వ్యవస్థపై ప్రజలకున్న ఆగ్రహావేశాల్ని అవకాశంగా తీసుకుని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి చేయతలపెట్టిన యుద్ధం ఇది.

ప్రభుత్వోద్యోగులంతా అవినీతిపరులో, అసమర్థులో, ప్రజావ్యతిరేకులో కాదు. వారిలో వ్యక్తిగత సామర్థ్యం, త్యాగనిరతి ఉన్నవారు పలువురు ఉన్నారు. ప్రజలు కూడా అలాంటి ఉద్యోగులను ఆరాధిస్తుంటారు. కానీ ఒక వ్యవస్థగా మన ప్రభుత్వోద్యోగులు దేశానికి ఎనలేని నష్టం చేస్తున్నారు. వలసకాలం నాటి తీరుతెన్నులతో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు. ఈ ప్రజాస్వామ్యంలో అసలైన ప్రభువులం తామేనని, తాము కట్టే పన్నుల డబ్బుతోనే ఈ దేశ పాలన నడుస్తుందని, అలాంటి తమను సేవకులైన ఉద్యోగులు ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారని, తమకు హక్కుగా అందించాల్సిన సేవలకు లంచాలు తీసుకుంటూ వేధింపులకు గురిచేస్తున్నారని ప్రజల్లో అంతర్లీన భావన, దాన్నుంచి కోపం ఉన్నాయి. ఒక సగటు ప్రభుత్వోద్యోగికి, సాధారణ పౌరునికి మధ్య ఆదాయంలో, జీవన భద్రతలో విపరీత అంతరం ఉన్నా కూడా.. ఇంకా అదనపు ఆదాయం కావాలని, భావితరాల మీద భారం వేసయినా సరే జీతాన్ని మించిన పెన్షన్ కావాలని ఉద్యోగులు చేస్తున్న డిమాండ్లకు దక్కుతున్న మన్నన, తమ కనీస డిమాండ్లకు దక్కటం లేదన్న ఆవేదన ప్రజల్లో ఉంది. ఈ ఆగ్రహాన్ని అవకాశంగా తీసుకునే.. ఇటీవల పీఆర్‌సీ వగైరా డిమాండ్ల విషయంలో ప్రభుత్వోద్యోగుల డిమాండ్లకు తలొగ్గకుండా ప్రజలు వర్సెస్ ప్రభుత్వోద్యోగ వ్యవస్థగా ఉద్యోగుల ధిక్కారాన్ని మలచేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నించారు. గతంలో జయలలిత, ఎన్.టి రామారావు వంటి ముఖ్యమంత్రులు కూడా ఉద్యోగుల డిమాండ్లకు తలొగ్గకుండా గట్టిగా నిలబడ్డారు. అయితే ఒక పరిధి దాటి వారు గెలవలేకపోయారు. జయలలిత, ఎన్‌టీఆర్ స్థాయిలో కాకపోయినా ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి కూడా ఉద్యోగుల డిమాండ్లు అసంబద్ధంగా ఉన్నాయంటూ కఠిన వైఖరినే ప్రదర్శించే ప్రయత్నం చేశారు. అయితే ఉద్యోగుల సంఘటిత నిరసన ప్రదర్శనలు చూసి వెనక్కి తగ్గారు. దీంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.

నివురుగప్పిన నిప్పులా కొనసాగుతూ మన ప్రజాస్వామ్యాన్ని,




యువతకు సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాల్ని పెరగకుండా చేస్తున్న ప్రభుత్వోద్యోగ వ్యవస్థలోని మౌలిక వైఫల్యాల్ని సరిదిద్దకుంటే వ్యవస్థ, సమాజం ఇంకా భ్రష్టుపట్టి దేశం భారీ మూల్యం చెల్లిస్తుంది. నిజానికి, విజ్ఞత ఉంటే.. ప్రభుత్వోద్యోగ వ్యవస్థతో యుద్ధం అవసరం లేదు. ఇదేమీ దేశం వెలుపలి విషయం కాదు. ఉద్యోగులేమీ పరాయివాళ్లు కాదు. మన సమాజం నుండి వచ్చినవారే, మనలాంటి వారే. వారు సక్రమంగా పనిచేయటానికి కావలసిన వ్యవస్థను నిర్మించుకునేందుకు ఒక రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో, గణతంత్ర వ్యవస్థలో పూర్తి అవకాశాలు మన చేతుల్లోనే ఉన్నాయి. యుద్ధం జరగకుండా ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రజాసేవక వ్యవస్థగా మార్చే నాయకత్వ సామర్థ్యం, ఒడుపు, అవగాహన ఉన్నవారు పాలకులైతే అది రాష్ట్రాలకి, దేశానికి ఎంతో మంచిది. కానీ ఆ పని స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా జరగలేదు. ఇప్పటికీ ఆ పని చేసేందుకు తగినస్థాయి ప్రయత్నం జరగటం లేదు.

ఉద్యోగ వ్యవస్థను సంస్కరించగల నేతలు లేనప్పుడు అనివార్యంగానైనా యుద్ధం చేయటమే మేలు. ఈ యుద్ధం దురాక్రమణ కాదు. ఎవరి హక్కుల్లో కొల్లగొట్టటానికి చేసే యుద్ధం కాదు. ప్రజల న్యాయమైన హక్కుల కోసం, రాజ్యాంగం హామీ పడిన ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేసే యుద్ధం. ఆత్మరక్షణలో భాగంగా చేసే యుద్ధం. ఈ ధర్మయుద్ధంలో భౌతిక యుద్ధాల్లోలా వినాశనం ఉండదు. కానీ ప్రజాస్వామ్యాన్ని

వికసింప చేసి పటిష్ఠం చేసే సృజనాత్మక విధ్వంసం మాత్రం ఉంటుంది.

స్వతంత్రం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంలోనైనా.. తమ బాధ్యతగా ప్రభుత్వోద్యోగ వ్యవస్థను సంస్కరించేందుకు పాలకులు ముందుకొస్తారా? లేకుంటే విసిగివేసారి ప్రజలే ప్రభుత్వోద్యోగ వ్యవస్థ మీద యుద్ధం ప్రకటించాల్సి వస్తుందా?

దేశ జనాభాలో అత్యధిక శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయంలో స్వేచ్ఛామార్కెట్ విధానాలను ప్రవేశపెట్టి రైతులకు ఆదాయాన్ని పెంచాలని దశాబ్దాల క్రితమే వాదించి పోరాడిన రాజనీతిజ్ఞుడు, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తన ముగ్గురు హీరోలలో ఒకరుగా గౌరవించే నాయకుడు శరద్ జోషి ఎప్పుడూ అంటుండేవారట.. ప్రజలకు, ప్రభుత్వోద్యోగ వ్యవస్థకు మధ్య యుద్ధమే ఈ దేశంలో మౌలిక సమస్యలకు పరిష్కారం అని. చివరికి అదే నిజమవుతుందా?
యుద్ధమే ప్రజలకు శరణ్యమవుతుందా?

**పౌర సేవల్లో ప్రభుత్వోద్యోగ వ్యవస్థ వైఫల్యానికి మూలకారణాలు**

బ్రిటిష్ వలస పాలకుల హయాంలో ప్రభుత్వాధికారుల ముందు నిలబడటానికే గడగడలాడే మనస్తత్వం నుంచి భారతీయులు 1947లో స్వతంత్రం వచ్చాక కూడా బైటపడలేకపోయారు. భౌగోళికంగా, భౌతికంగా స్వతంత్రం వచ్చింది తప్ప మానసికంగా స్వతంత్రం రాలేదు. చుట్టూ ఉన్న సామాజిక, రాజకీయ, ఆర్థిక వివక్షల నుంచి ప్రజలను బయటకులాగి వారికి నిజమైన స్వరాజ్యాన్ని అందించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్ని ప్రక్షాళన చేసి వారికి నాణ్యమైన సేవలను అందించేలా చేయాలన్న ప్రయత్నం స్వతంత్రం వచ్చిన తొలినాళ్ల నుంచి విధానపరంగా జరగలేదు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు, ఉద్యోగులు సహా ప్రభుత్వంలోనివారంతా సేవకులే' అనే తరహా వ్యవస్థ నిర్మాణం జరగలేదు. దీంతో, హక్కుగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి పొందాల్సిన సర్టిఫికెట్లు, విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు వంటి సేవలకు తమ ఓటును తాకట్టు పెట్టి పొందటం తప్ప మార్గంలేని పరిస్థితి కోట్లాది ప్రజలకు ఏర్పడింది. ఈ రకంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల వైఫల్యం.. పాలననే కాకుండా రాజకీయాల్ని కూడా భ్రష్టుపట్టించి సమాజంలోని వివక్షల్ని, ఇతర రుగ్మతల్ని కొనసాగించటానికి ఓ పెద్ద కారణమైంది.

**కాంగ్రెస్ మొదలెట్టింది..**
**డీఎంకే అందిపుచ్చుకుంది, కొనసాగుతూ వస్తోంది..**

బ్రిటిష్ అధికారులు భారతీయ ప్రజల్ని ఎంతగా ఈసడించుకుంటూ ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్నారో గాంధీజీ సహా మన స్వాతంత్ర్యోద్యమ నేతలందరికీ తెలుసుగానీ.. తెల్లదొరలు పోయాక వచ్చే మన దేశ అధికారులు కూడా నల్లదొరల్లా వ్యవహరిస్తారని వారు ఊహించలేదు. స్వతంత్రం వచ్చాక ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పనులు చేసి పెట్టటానికి కాంగ్రెస్ కార్యకర్తలే వారధిలా వ్యవహరించేవారు. అధికారులు, ప్రజలు మనోళ్లే గదా.. అన్న రీతిలో కాంగ్రెస్‌వారు మాట సాయంతోనే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల నుంచి సేవలు అందేలా చేసేవారు. జాతీయోద్యమ ప్రభావం తగ్గిపోయాక పరిస్థితి ఏమిటన్న ఆలోచన చేసి, ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేయకుండా వీరు మధ్యవర్తిత్వ రాజకీయ కార్యకర్తల వ్యవస్థను పెంచుకుంటూ వెళ్లారు. తమిళనాడులో ప్రాంతీయ పార్టీగా ఆవిర్భవించిన డీఎంకే ఈ ధోరణిని ఓ రాజకీయ సంస్కృతిగా మార్చేసింది. ఆ తర్వాత అన్ని పార్టీలూ అదే బాట పట్టాయి. నేటి దాకా అదే ప్రధాన స్రవంతి రాజకీయంగా కొనసాగుతోంది.

**రాజకీయ పార్టీలూ మూల్యం చెల్లిస్తున్నాయి**

ఈ రకంగా ప్రజలకు పోలీస్ స్టేషన్లు సహా ప్రభుత్వ కార్యాలయాల్లో రోజువారీ పనులు లంచాలు, వేధింపులు లేకుండా జరగకపోవటానికి సంస్థాగత ఏర్పాటు చేయకపోవటం వల్ల ఈవేళ రాజకీయ పార్టీలు కూడా ప్రధానంగా రెండు రకాలుగా మూల్యం చెల్లిస్తున్నాయి.

ఎ) ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి పథకాలు కూడా సక్రమంగా అమలు కాకపోవటం బి) డబ్బు రాజకీయం ప్రబలిపోవటం, నేతలు వ్యక్తిగత జీవితాల్ని ఫణంగా పెట్టటం

**ఎ) ప్రభుత్వాలు తీసుకొచ్చిన మంచి పథకాలు కూడా సక్రమంగా అమలు కాకపోవటం:**

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయాల్సిన బాధ్యతల్లో కొన్ని ప్రజల పన్నుల డబ్బుతో చేసే పనులు, నిర్వహణ కాగా.. కొన్ని సేవల రూపంలో అందించేవి ఉంటాయి. రెండు రకాల పనుల్లోనూ అవినీతి, ఆశ్రిత పక్షపాతం లేకుండా నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, జవాబుదారీతనం ఉండితీరాలి. వీటిని ప్రజలకు చేరువ చేయటంలో ఉద్యోగ వ్యవస్థదే ప్రధాన పాత్ర.

ప్రజలకు ప్రభుత్వాలు అందించే కార్యక్రమాల్లో కొన్ని ఏ ప్రభుత్వమున్నా అమలయ్యేవి ఉంటాయి. కొన్ని కొత్తగా వచ్చిన ప్రభుత్వాలు ప్రత్యేకించి అమలు చేసేవి ఉంటాయి. వీటిలో ప్రజలు సాధారణ జీవితాన్ని గడపటానికి, వారు ఎంతో కొంత ఎదగటానికి దోహదం చేసేవి ఉంటాయి. అలాగే ప్రభుత్వాలు రుసుముతో హక్కుగా అందించే సేవలుంటాయి. ఈ పథకాలు, సేవలు సక్రమంగా, లంచాలు లేకుండా, నాణ్యతతో అందితే ప్రభుత్వాలకు కూడా మంచి పేరు వస్తుంది. ఈ క్రమంలోనే.. తాము ఎంతో మంచి విధానాలను ప్రకటిస్తున్నా అమలు విధానం సరిగా లేకపోవటం వల్ల ప్రజలకు చేరటం లేదని పలు సందర్భాల్లో వివిధ పార్టీల నాయకులు వాపోతుంటారు. అన్నీ బాగా చేశాం, అయినా ఓడిపోయాం అని కన్నీళ్లు పెట్టుకున్న నేతలు అనేకమంది. ఇది దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో భాగంగా కొనసాగుతూ వస్తోంది. అయితే ప్రభుత్వాలకు పాలనా సామర్థ్యం ఎందుకు కొరవడుతోంది అన్న చర్చ మాత్రం మన దేశంలో ఇంకా లోతుగా జరగటం లేదు. చివరికి కొవిడ్ మహమ్మారి ఉధృతి సమయంలో కూడా ప్రజలకు

సాయం అందించిన పరిమిత సాయంలో కూడా ఘోరవైఫల్యానికి పాలనా సామర్థ్యం కొరవడటమే ప్రధాన కారణం.

**బి) డబ్బు రాజకీయం ప్రబలిపోవటం, నేతలు వ్యక్తిగత జీవితాల్ని ఫణంగా పెట్టటం**

మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్ల, ఎన్నికల్లో గెలుపు కోసం వచ్చే ప్రజాప్రతినిధులను సతాయించటం సామాన్య ప్రజలకు పరిష్కారంగా తయారైంది. అందుకే, తమ సమస్యల్ని పట్టించుకోకపోయినా, గడపను తాకకపోయినా వచ్చే ఎన్నికల్లో ఓటు వేయటానికి విముఖత చూపుతున్నారు. దీంతో, ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏం చేసినా, చేయకపోయినా వారికి అందుబాటులో ఉండటం, వారి రోజువారీ సమస్యల్ని పరిష్కరించటం, ప్రజల ఇళ్లల్లో ఏ కార్యం జరిగినా వెళ్లి హాజరు వేయించుకుని ఫోటోలు దిగటం, వాటికి ప్రచారం కల్పించుకోవటం చేస్తున్నారు.

ఈ క్రమంలోనే, శాసనసభలో ప్రజల సమస్యల పరిష్కారానికి శాసనాల రూపకల్పనకు పరిమితం కావలసిన ఎమ్మెల్యే ఈవేళ ఆ పనిచేయకుండా ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు పనులు చేసి పెట్టి, అందుకు బదులుగా ఓట్లు వేయించుకోవటానికి ఆసక్తి చూపుతున్నాడు. ప్రజలకు – సర్కారీ ఆఫీసులకు మధ్య బ్రోకర్లుగా వ్యవహరించటానికి వందలాది కార్యకర్తలను కోట్ల రూపాయల ఖర్చుతో పోషిస్తున్నాడు. ఎమ్మెల్యేతోపాటు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే/ఎంపీగా పోటీ చేయాలనుకుంటున్నవారు కూడా ఇదే తరహాలో డబ్బును వెదజల్లుతున్నారు.

తమ పని కాకపోయినా, ఎందుకో తెలియకపోయినా జనంతో మమేకం పేరుతో రాజకీయ నేతలకు పొద్దున లేచిన దగ్గర్నుంచీ వీధుల్లోనే జీవితమైపోయింది. ఇందులో ఏ రకమైన విధానపరమైన అంశమూ లేదు. విధానరాహిత్యం కూడా. ఇలా విధానరాహిత్యంతో, రాజ్యాంగేతర పద్ధతిలో పనిచేస్తేనే వచ్చే ఎన్నికల్లో గెలవగలరు. ప్రతి పార్టీ నేతకూ ఈ విషయం తెలుసు, ప్రతి ఎన్నికల వ్యూహకర్తా ఇదే మాట చెబుతారు. ప్రభుత్వ విధానాల అమలులో కూడా వీలున్నంత మేర ఇదే అవ్యవస్థీకృత, అరాచకపు పద్ధతి. ఆ తర్వాత అమీతుమీలా జరిగే ఎన్నికల్లో ఏ ఒక్క ఓటు తగ్గినా ఓడిపోతామన్న భయంతో అసెంబ్లీ నియోజకవర్గానికి కూడా పదుల కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీనివల్ల డబ్బు రాజకీయం ప్రబలిపోయింది. కోటీశ్వరుల రాజకీయం, రాజకీయాల్లోకొచ్చి కోటీశ్వరులవటం సాధారణమైపోయాయి. ప్రజల మధ్య విభజనలూ పెరిగిపోతున్నాయి. సమర్థులు, సేవాభావం గలవారు రాజకీయాలకు దూరమవుతూ, సామానుల్లో అత్యధికులు జెండా పట్టే కూలీలుగా మిగిలిపోతున్నారు.

ఎంతో ఆలోచించి తమకు మేలుచేసే సమర్థులు, నిజాయతీపరులకు వేయాల్సిన ఓటును ప్రభుత్వ కార్యాలయాల్లో మామూలుగా, హక్కుగా అవ్వాల్సిన పనులకు, తాత్కాలిక తాయిలాలకు అనేకమంది ప్రజానీకం అమ్ముకుంటున్నారు కాబట్టి.. వీరు ఓట్లు ఎలాగూ డబ్బు ఖర్చు పెట్టి, ఆ తర్వాత దోచుకునే పార్టీలకు, అభ్యర్థులకే పడతాయి కాబట్టి– తమ ఓటు వృధా కాకూడదన్న అభిప్రాయంతో కాస్త ఆలోచనాపరులు కూడా సాంప్రదాయ రాజకీయ పార్టీలకే ఓట్లు వేస్తున్నారు. దీంతో పేరుకు ప్రజాస్వామ్యమేగానీ, మనది పూర్తిగా ధనరాజకీయంగా మారింది. ఇది ఒకరకంగా రాజకీయ వ్యవస్థ స్వయంకృతం. పార్టీలు, రాజకీయ నేతలు చేతులారా విషవలయంలో చిక్కుకుపోయారు. తొలినాళ్లలోనే ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రజాసేవల వ్యవస్థగా పకడ్బందీగా చేసి ఉంటే ఈవేళ ఎన్నికలు ఇలా డబ్బు చుట్టూ, తాయిలాల చుట్టూ తిరగాల్సిన అవసరం అంతగా ఉండేది కాదు.

**విధానాలు కూడా దోపిడీకి అనువుగా**

ఎప్పుడైతే ఎన్నికల్లో, ఎన్నికల మధ్య కూడా రాజకీయం డబ్బు మయమైపోయిందో, ఏదోకరకంగా ఆ డబ్బును తిరిగి రాబట్టుకోవటం, అంతకంత సంపాదించటం కూడా రాజకీయంలో భాగంగా మారాయి. కొన్ని మినహాయింపులుండొచ్చుగానీ.. ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఎన్నికల్లోనూ డబ్బు ఖర్చు చేసి గెలిచినవారిలో పలువురు ప్రభుత్వాధికారులతో కుమ్మక్కయి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారనేది పచ్చి వాస్తవం. ఈ క్రమంలో, తమకు ఓట్లేసే వారికి ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించిపెట్టటంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిసి తాము కూడా దోచుకోవటానికి వీలుగా ఎమ్మెల్యేలు, వారి పైనున్నవారు శాసనాల్ని, విధానాల్ని కూడా రూపొందిస్తున్నారు. పలు సందర్భాల్లో విధానాలను దోపిడీకి అనువుగా లొసుగులతోనే తెస్తున్నారు. ప్రభుత్వాల విధానాలు సక్రమంగా ఉంటే, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ వాటిని చెడగొట్టటం ఒకస్థాయిని మించి సాధ్యం కాదు. అలాంటి ముందస్తు రక్షణలు, ఆచరణీయత, స్వయందిద్దుబాటు ఏర్పాట్లు విధానాల్లో కొరవడుతున్నాయి. మొదట్లో నిజాయతీగా ఉన్న ఐఏఎస్‌ల్లో కూడా పలువురు క్రమంగా ఈ లాలూచీలో భాగమవుతున్నారు. ప్రజల సాధికారత, పారదర్శకతలను పెంచే సంస్కరణలకు మోకాలడ్డటాన్ని కూడా వీరి తమ పనిలో భాగం చేసుకున్నారు. ప్రభుత్వాధినేతలకు, చివరికి వారి కుటుంబ సభ్యులకు కూడా సలాములు గులాములు చేస్తూ రాజును మించి రాజభక్తిని ప్రదర్శిస్తున్నారు. ఏలినవారి అభీష్టం మేరకు వ్యవస్థలను బేఖాతరు చేస్తున్నారు, భ్రష్టుపట్టిస్తున్నారు.

ప్రజల కోసం, ఆచరణసాధ్యంగా ఉండటం కోసం కాకుండా తాత్కాలిక ఓటుబ్యాంకు ప్రయోజనాల కోసం, అవినీతి, ఆధిపత్యాల కోసం ఎక్కువగా విధానాలు రూపొందుతుండటంతో, వాటి అమలు కూడా అధ్వాన్నంగా, దోపిడీతో జరుగుతున్నాయి. సేవల్లో నాణ్యత కొరవడుతోంది. ప్రభుత్వం ద్వారా చట్టవిరుద్ధంగానైనా వ్యక్తిగత లబ్ధి పొందేవారు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం చేసే పనులు నాసిరకంగా

కాకుండా నాణ్యమైనవిగా ఉంటాయా? అధికార గణం సాంకేతికతలకు కూడా దొరక్కుండా కొత్త పద్ధతుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారు. కమీషన్లు, పోస్టింగులు, ట్రాన్స్‌ఫర్ల డిఫాల్ట్ రాజకీయం యధేచ్ఛగా కొనసాగుతోంది.

**ప్రభుత్వ రంగంలో జీతభత్యాల తీరు, కఠిన కార్మిక చట్టాల వల్ల భారీ మూల్యం చెల్లిస్తున్న కోట్లాది యువత**


దేశానికి ఆదాయం సమృద్ధిగా ఉంటే ప్రభుత్వ రంగంలో జీతభత్యాల పెంపుకి ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పన్లేదు. కానీ భారత్ వంటి పేద దేశంలో కొద్దిశాతం మాత్రమే ఉన్న ప్రభుత్వోద్యోగులకు, మిగిలిన అత్యధిక శాతం జనాభాకి ఆదాయం దగ్గర్నుంచి అన్ని రకాలుగా విపరీతమైన అంతరం ఉంది. ఉద్యోగుల కోసం వెచ్చించే నిధులు కూడా ఎంతో ఎక్కువ. జీతానికి తగిన సేవలూ అందటం లేదు. పన్నులు, వనరుల రూపంలో ప్రభుత్వాలకు చేరే ప్రజాధనంలో ఎక్కువ శాతం ప్రభుత్వోద్యోగులకే పోతుంటే, ప్రభుత్వ మౌలిక బాధ్యతలైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు వంటి మిగిలిన రంగాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయి. దానివల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మన దేశంలో ఉపాధి పొందుతున్నవారిలో 85-90 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ప్రభుత్వ ధనాన్ని హేతుబద్ధంగా వినియోగించి, కార్మిక చట్టాల్సి సరళతరం చేసి ఉపాధి అవకాశాల్ని పెంచుతూ అసంఘటిత రంగాన్ని సంఘటితంగా మార్చే ప్రయత్నం పెద్దఎత్తున చేయకుండా, ఉన్న కొద్దిపాటి సంఘటిత రంగానికే కేటాయింపుల్ని పెంచుతూ పోతే, ఈ దేశ యువత భారీ మూల్యం చెల్లిస్తారు. మన జనాభాలో దాదాపు 70 శాతం యువతే ఉన్నారు. రాబోయే కాలంలో 90 శాతం వారిదే. యువతకు సంఘటిత రంగంలో పెద్దఎత్తున ఉపాధి లభించే ఏర్పాట్లు చేయకుండా, ప్రభుత్వోద్యోగులకు జీవన భద్రతతో కూడిన జీతభత్యాలు - సామాన్యులకు ఉపాధి హామీ పథకం అనే ధోరణినే కొనసాగిస్తే.. అది క్షమార్హంకాని తప్పిదమవుతుంది.

**తక్షణ పరిష్కారంగా పౌర సేవల చట్టాన్ని అమలు చేయాలి**

ఇది సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కంటే శక్తిమంతమైనది. మెజారిటీ ప్రజలు ప్రభుత్వోద్యోగుల ముందు ఆత్మన్యూనతతో ఉండటం, సేవల కోసం దేబిరించటం ఎంతో తీవ్రమైన, మౌలిక సమస్య కాబట్టే, శాశ్వత పరిష్కారాల్లో భాగం కాబట్టే.. లోక్‌సత్తా ఎప్పుడో 1998లోనే 'స్వరాజ్యం' పేరుతో పౌర హక్కుల పత్రాలతో కూడిన పుస్తకాన్ని, ఆ తర్వాత పౌర సేవల చట్టం బిల్లుని కూడా రూపొందించి ప్రజలు, ప్రభుత్వం, పార్టీల ముందుంచింది.

**హక్కుగా పౌర సేవలు**

సాంకేతిక వినియోగాన్ని విస్తృతం చేయటం, ప్రత్యక్ష నగదు బదిలీతోపాటు సర్కారీ ఆఫీసుల్లో ఆన్‌లైన్ సేవలకు కూడా వర్తింప చేస్తూ హక్కుగా 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్) చట్టాన్ని తక్షణం అమలు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి




పనికీ నిర్దిష్టమైన గడువు పెట్టి ఆ సిటిజన్స్ చార్టర్ల బోర్డును అందరికీ కనపడేలా ఏర్పాటు చేయాలి. ఆ గడువులోగా పని చేసి పెట్టకపోతే రోజుకు కనీసం రూ.250ల పరిహారం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు చెల్లించాలి. ఈ చట్టానికి దేశంలోనే తొలిసారిగా లోక్‌సత్తా నాంది పలకటంతోపాటు 2001లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మూడు మునిసిపాలిటీల్లో ప్రయోగాత్మకంగా అమలుచేయించగలిగింది. 2012లో పార్లమెంటరీ కమిటీ అభ్యర్థన మేరకు లోక్‌సత్తాయే 'పౌర సేవల' చట్టం ముసాయిదాను తయారుచేసి ఇచ్చింది. జాతీయ స్థాయిలోనే కాకుండా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు కూడా ఈ ముసాయిదాను కొన్ని మార్పులతో పంపింది. తమ చేతిలో ఉన్న పనిని కూడా ప్రభుత్వాలు చేయకపోవటం వల్ల ఇప్పటికీ సాధారణ పౌర సేవలు ప్రజలకు పెద్ద లక్ష్యాలుగానే మిగిలిపోతున్నాయి. హక్కుగా పౌర సేవల చట్టాన్ని జాతీయ స్థాయిలో, అన్ని రాష్ట్రాల్లో (ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఏదోకస్థాయిలో అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాల్లో అమలు చేస్తామని చట్టం తెచ్చినా అమలు కాగితాలు దాటలేదు) పూర్తిస్థాయిలో అమల్లోకి తేవాలి.

**అధికారాల విభజన స్పష్టంగా చేయాలి**

శాసనసభ్యులు ప్రభుత్వ వ్యవస్థలో జోక్యం చేసుకోకుండా అధికార విభజనను సుస్పష్టంగా చేయాలి. దీనివల్ల ప్రజలకు రోజువారీ సేవలు నాణ్యంగా, లంచాలు లేకుండా వాటంతటవే అందుతాయి. డబ్బు ఖర్చు పెట్టి గెలిచిన ప్రతిపక్ష సభ్యులు ఆ డబ్బును వసూలు చేసుకోవటం కోసం అధికార పార్టీలోకి ఫిరాయించి ప్రభుత్వ శాఖల్లో జోక్యం చేసుకునే దిగజారుడు రాజకీయ ధోరణులకు కూడా కళ్లెం పడుతుంది. సేవా భావం, సామర్థ్యం గల సామాన్యులు రాజకీయాల్లోకి వచ్చి నాయకులుగా ఎదగగలుగుతారు, ప్రజాస్వామ్యం పటిష్టమవుతుంది.

ముందుచూపు లేకపోవటం వల్ల శాసన వ్యవస్థకు–ప్రభుత్వాధికార వ్యవస్థకు మధ్య పెరిగిన అపవిత్ర సంబంధాన్ని అధికారాల విభజనతో నియంత్రించేందుకు ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి సంస్కరణలను ప్రవేశపెట్టాలి.

**ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక,**

**ఎమ్మెల్యే రాజ్యం నుంచి స్థానిక ప్రభుత్వాలకు విముక్తి**

ఎమ్మెల్యే రాజ్యం, కొంతమేర ఎంపీ రాజ్యం ఇంతగా వేళ్లూనుకున్నాక, ప్రజాప్రతినిధులకు–ప్రభుత్వోద్యోగులకు మధ్య లాలూచీ ఒప్పందం ఇంతగా పెరిగిపోయాక దీన్ని అదుపు చేయటం అంత తేలిక కాదు. ఎంత బలమైన ముఖ్యమంత్రయినా, ఎమ్మెల్యేల మీద ఆధారపడి ఉన్నందున వారి అవినీతిపై చర్యలకు సాహసం చేయటం అంత తేలిక కాదు. అందుకే ముఖ్యమంత్రుల ఎన్నికను ఎమ్మెల్యేల ద్వారా కాకుండా ప్రత్యక్షంగా ప్రజల నుంచే చేస్తే ఎమ్మెల్యేరాజ్యాన్ని కట్టడి చేయటానికి బలమైన పునాది ఏర్పడుతుంది. ప్రత్యక్షంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరముండదు, మరోవైపు ముఖ్యమంత్రి మితిమీరకుండా శాసనసభలో ఎమ్మెల్యేలు కట్టడి చేస్తుంటారు.. ఈ పరస్పర నియంత్రణ వల్ల రాజ్యాంగం ఆశించిన అధికారాల విభజన సక్రమంగా ఉండి, ప్రభుత్వ కార్యాలయాల్లో చట్టవిరుద్ధ రాజకీయ జోక్యం తగ్గుతుంది. దీనివల్ల ప్రజలకు సేవలందించటంలో కీలకమైన స్థానిక ప్రభుత్వాలు కూడా బలపడే అవకాశం ఉంటుంది. ఎమ్మెల్యేల ఒత్తిడి ఉండదు కాబట్టి.. స్థానిక ప్రభుత్వాలకు నేరుగా రాష్ట్ర బడ్జెట్ నుంచే నిధుల్నిచ్చి పర్యవేక్షణ వరకే రాష్ట్ర ప్రభుత్వం పరిమితమైతే ప్రజలకు మరింత మెరుగ్గా ప్రభుత్వ సేవలు అందుతాయి.

**జమిలి ఎన్నికల ప్రయత్నం ఊపందుకుంది కాబట్టి.. ఈ మార్పుల్ని కూడా తేవాలి**

లోక్‌సభ, అసెంబ్లీలకు దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదనను కూడా ప్రభుత్వం గట్టిగా చేస్తోంది కాబట్టి.. పౌర సేవల చట్టం, స్థానిక ప్రభుత్వాల సాధికారతతో మూడంచెల ఫెడరల్ వ్యవస్థ, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికకు మోదీ ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి. ఈ మార్పులు లేకుండా కేవలం జమిలి ఎన్నికల వల్ల దేశానికి ఒరిగేదేమీ లేదు.

**విధానాల అమలులో అవినీతిని కట్టడి చేయటం..**

**ఉద్యోగుల పనితీరులో నైపుణ్యాల్ని పెంచటం**

ఈ సంస్కరణల కోసం ప్రయత్నం చేస్తూనే, ప్రభుత్వ కార్యాలయాల్ని ప్రక్షాళన చేయటంపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలి.

ఉద్యోగులను జవాబుదారీతనం, రాజ్యాంగ నిబద్ధత గల ప్రజాసేవకులుగా తయారుచేసేందుకు కేవలం ప్రభుత్వోద్యోగ వ్యవస్థ కోణంలో కొన్ని నిర్దిష్ట పరిష్కారాల్ని అమలు చేయాలి. వీటిలో చాలావరకు వెంటనే చేయగలిగిన పనులు.

లోక్‌సత్తా పలుమార్లు ప్రధాని దృష్టికి తెచ్చిన అంశాల్లో అవినీతిపరులైన ఉన్నధికారులను సస్పెండ్ చేయటమనేది ఒకటి. ఈ విషయంలో మాత్రం రెండోసారి ఎన్నికయ్యాక మోదీ ప్రభుత్వం కొన్ని చెప్పుకోదగిన చర్యలు తీసుకుంది. కానీ చేయాల్సిన ప్రక్షాళనతో పోలిస్తే ఇది చాలా స్వల్పం. పోలీసు సహా అన్ని విభాగాల్లో ప్రభుత్వ సేవల్ని అవాంఛనీయ రాజకీయ జోక్యం లేకుండా ప్రజలకు హక్కుగా అందించేందుకు ఏర్పాట్లు, సంస్కరణలు చేస్తూనే, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ విధానాల అమలులోనూ అవినీతిరహితంగా, నిపుణతతో పనిచేసే చర్యల కోసం కృషి చేయాలి.

ఉద్యోగుల ఖాళీల గుర్తింపులో, నియామకాల్లో, పదోన్నతుల్లో ప్రపంచస్థాయి పోటీ ప్రమాణాలను అమలు చేయాలి. ఎలా పనిచేసినా జీవితాంతం జీతం, పింఛను వస్తాయన్న నిర్లక్ష్యపూరిత ధోరణి లేకుండా ప్రతిభ, ప్రజాసేవ గీటురాళ్లుగా ఉద్యోగులకు ప్రతిఫలాల్ని అందించేలా నిబంధనల్ని మార్చాలి. సమాజంలోని నిపుణులకు కూడా ప్రభుత్వోద్యోగ వ్యవస్థలో స్థానం కల్పించాలి. రాజకీయ నిరుద్యోగులను ప్రభుత్వ రంగ సంస్థలకు చైర్మన్లుగా, సారథులుగా నియమించే ధోరణులకు స్వస్తి పలకాలి. జవాబుదారీతనంతో నూతన అవసరాలకనుగుణంగా అర్హులను నియమించాలి. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ వ్యవస్థకి, ప్రైవేటు ఉద్యోగ వ్యవస్థకి మధ్య అంతరాన్ని తగ్గిస్తూ పోటీని పెంచాలి.

**రాజకీయ సంకల్పం సక్రమంగా ఉంటే ఉద్యోగులూ సహకరిస్తారు**

రాజకీయ వ్యవస్థ సక్రమంగా ఆదర్శప్రాయంగా వ్యవహరిస్తుంటే, ఒక పద్ధతి ప్రకారం చట్టాల్ని చేస్తే ఉద్యోగుల్లో కూడా ఎక్కువమంది ముందుకొచ్చి ప్రక్షాళనకు సహకరిస్తారు.

ఉద్యోగంలో చేరేటప్పుడు అత్యధికులు సేవా భావంతోనే ఉంటారు. ప్రజల కోసం కష్టపడి పనిచేస్తూ పేరు తెచ్చుకోవాలనుకుంటారు. ఆ తర్వాతే ప్రలోభాలకు లోనై జీతంతోపాటు గీతం కోసం వెంపర్లాడే ధోరణులు ప్రబలుతాయి. వారు నిజాయతీగా వ్యవహరించే పరిస్థితుల్ని నెలకొల్పగలిగితే పౌర సేవల చట్టం, ప్రతిభ ఆధారిత ప్రోత్సాహకాలు వంటి వాటికి పూర్తిగా మద్దతిస్తారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా సేవలందించినపుడు కేవలం ఎకరాకు రూ. 2,000తో దాదాపు 2,00,000 ఎకరాలకు సాగునీరు అందించారు. ఇదంతా రైతుల భాగస్వామ్యంతోనే చేశారు. ఒక విజన్‌ని అందించి, రుణాలు, ఇతర క్లియరెన్స్‌లలో వారికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చేయటం, పర్యవేక్షణ వరకే జేపీ పరిమితమయ్యారు. అంతే, స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఒక అద్భుతం ఆవిష్కృతమైంది. రెండున్నరేళ్లలో 453 మైనర్ ఇరిగేషన్ పథకాలు, 2800 ఉపరితల బోరుబావులు, 70 మళ్లింపు పథకాలు రూపు దిద్దుకున్నాయి. ఇప్పటికీ ఆ పథకాలు విజయ వంతంగా నడుస్తున్నాయి. తాము రుణంగా తీసుకున్న మొత్తాన్ని రూపాయి కూడా ఎగ్గొట్టకుండా రైతులంతా నిబద్ధతతో సకాలంలో చెల్లించారు. నీటి పారుదల రంగంలో, ప్రజాసేవలో ఇది ఎంత

# అవినీతి వ్యతిరేక హెల్ప్‌లైన్‌తో పంజాబ్ ముఖ్యమంత్రి ఆగకూడదు




పంజాబ్ కొత్త ముఖ్యమంత్రిగా 'ఆప్' నేత భగవంత్ సింగ్ మాన్ అవినీతి వ్యతిరేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. భగత్‌సింగ్ వర్ధంతి నుండి దీన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. తన వ్యక్తిగత వాట్సాప్ నెంబరునే హెల్ప్‌లైన్‌గా ముఖ్యమంత్రి తెలిపారు. ఇది మంచిదేగానీ, పదవిలోకొచ్చిన కొత్తలో పలువురు ముఖ్యమంత్రులు ఇదేరకంగా చేశారని, చివరికి అవినీతిని అంతం చేయలేక మామూలే అన్నట్లు వదిలేశారని విస్మరించకూడదు. తెలంగాణలో కె.చంద్రశేఖరరావు పదవీ బాధ్యతలు స్వీకరించాక, ఆర్భాటంగా అవినీతి వ్యతిరేక హెల్ప్‌లైన్ మొదలైంది. కానీ ఇప్పుడు ప్రజల ఫిర్యాదులనే కాదు, ముఖ్యమంత్రి చుట్టూనే ఉంటూ తిమింగలాల్లా అవినీతికి పాల్పడుతున్నా పట్టించుకునేవారు లేరు. చివరికి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వందల మంది ఉన్నతాధికారులపై చర్యలు లేకుండా ముఖ్యమంత్రే రక్షిస్తున్నారన్న బలమైన ఆరోపణలున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టాక వైఎస్ జగన్మోహన్ రెడ్డి 'స్పందన' అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి హడావుడి చేశారు. ప్రజల నుండి ఫిర్యాదులు తీసుకుని, ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారో తెలియచేస్తూ రసీదులివ్వాలని ఆదేశించారు. వాటిని రచ్చబండలో తానే తనిఖీ చేస్తానని ప్రకటించారు. మూడేళ్లు గడిచాయి. అవినీతి మామూలే అన్నట్లు కొనసాగుతోంది. సమీక్షలు, రచ్చబండలు అప్పుడప్పుడు కాలక్షేపం వార్తలుగా మిగిలిపోయాయి. లంచాల్లేకుండా సేవలందిస్తారంటూ ప్రవేశపెట్టిన వలంటీర్లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థలోని సరకుల్ని దారిమళ్లించి అమ్ముకోవటంలో వారు కూడా కుమ్మక్కవుతున్నారని ఉదంతాలు బయటపడ్డాయి. అవినీతిపై పోరాటంలో ఆప్‌కి మంచి ట్రాక్ రికార్డే ఉన్నప్పటికీ, లోక్‌పాల్ విషయంలోలా కాకుండా ఆచరణాత్మకంగా, నిర్దిష్ట పద్ధతుల్లో పోరాడటం పంజాబ్‌కు అవసరం. ఉద్యోగుల అవినీతి ప్రభావం ప్రజలపై పడకుండా ఉండటానికి వలంటీర్లనో, మరో రకంగానో ఇంకో వ్యవస్థను సృష్టించటం పరిష్కారం కాదు. సామాన్య ప్రజల్ని రోజువారీ అవినీతి నుండి విముక్తి చేసేందుకు సమగ్ర పౌర సేవల చట్టం అమలు చేయటంతోపాటు దర్యాప్తు సంస్థలు, ప్రాసిక్యూషన్‌లకు జవాబుదారీతనంతో స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి. చట్టబద్ధపాలనను నిష్పాక్షికంగా అమలు చేయాలి. స్థానిక ప్రభుత్వాలను బలంగా తీర్చిదిద్దాలి. ఢిల్లీలాగా పంజాబ్ నగరాలు స్వతంత్ర పాలనా వ్యవస్థలతో పనిచేసే ఏర్పాట్లు చేయాలి. ప్రజలకు అవినీతి గురించి తెలియకపోవటం కాదు సమస్య.. వారు పరిష్కారంలో భాగమయ్యే వ్యవస్థీకృత ఏర్పాట్లు కొరవడటం సమస్య. ఆ దిశగా చర్యలు తీసుకుంటే, పంజాబ్ ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శమవుతుంది.

# కలెక్టర్ తయారుచేయించిన 'ఆత్మగౌరవ' పోస్టర్‌కు మంచి స్పందన




ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, పాలకులు, ప్రభుత్వోద్యోగులు, అధికారులు ప్రజాసేవకులేనని ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ అనంతపురం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు గంధం చంద్రుడు తయారుచేయించిన పోస్టర్‌కు ప్రజల్లో మంచి స్పందన లభించింది. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆత్మన్యూనతను వీడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసే సమయంలో ఎలాంటి అభద్రతా భావానికి లోనుకావద్దన్నారు. అధికారులతో మాట్లాడటానికి వచ్చినప్పుడు.. 'చెప్పులు విడవకండి', 'చేతులు కట్టుకుని వంగి నిలబడకండి', 'కన్నీళ్లు పెట్టుకోకండి', 'కాళ్లు మొక్కకండి', 'ధైర్యంగా, స్పష్టంగా మీ సమస్యను చెప్పుకోండి' అంటూ ఆయన వినూత్న రీతిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆ పోస్టర్‌ను ప్రజలకు కనిపించేవిధంగా ప్రదర్శించాలని ఆదేశించారు. కేవలం పోస్టర్లు ప్రదర్శించడంతోనే సరిపెట్టకుండా.. కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, విజ్ఞప్తులను వింటూ వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అప్పట్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితుల్లో ఆత్మన్యూనత భావాన్ని పూర్తిగా తొలగించి, వారిలో ఆత్మగౌరవం నింపేందుకే తాను ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గంధం చంద్రుడు తెలిపారు.

# సీపీఎస్ రద్దుకు పవన్ కళ్యాణ్ కూడా మద్దతు తెలిపిన పరిస్థితి

ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారికి భవిష్యత్తులో అప్పటి ఆర్థిక వృద్ధికి అనుగుణంగా పెన్షన్ చెల్లించటమంటే భావితరాలకు చెందాల్సిన ఆదాయాన్ని తీసుకుంటూ వారి మీద భారం మోపటమే. ఇది సరైన పద్ధతి కాదు, ఉద్యోగులు జీతం నుండి పొదుపు చేసుకునే మొత్తానికి కొంత ప్రభుత్వ సాయం జోడించి వర్తమాన మార్కెట్‌కనుగుణంగానే పెన్షన్ ఉండాలి.. అని సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పింఛను పథకం)ను ప్రవేశపెట్టారు. యూపీయే ప్రభుత్వం ఈ పింఛను విధానాన్ని ప్రవేశపెట్టినా, బీజేపీ సహా అన్ని పార్టీలూ అప్పుడు ఆమోదానికి సహకరించాయి.




కానీ ఇప్పుడు కాంగ్రెస్ సహా పలు పార్టీలు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని రాష్ట్రాల్లో డిమాండ్ చేస్తున్నాయి. రాజస్థాన్ ప్రభుత్వం ఇప్పటికే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పద్ధతిని తీసుకొచ్చి వేల కోట్ల అదనపు భారాన్ని మోస్తోంది, ప్రజల పన్నుల డబ్బును దుర్వినియోగం చేస్తోంది. సంఘటిత శక్తిగా ఉండే ప్రభుత్వోద్యోగులకు నచ్చచెప్పే శక్తిలేక వారి డిమాండ్లకు తలొగ్గటమే అందుకు కారణం. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా సీపీఎస్‌ను తిరగదోడుతోంది. ఈవేళ్టి ఓట్ల కోసం తాత్కాలిక తాయిలాల్ని పరాకాష్టకు తీసుకెళ్లిన ఏపీ ప్రభుత్వం.. సీపీఎస్ విషయంలో కూడా అదే తీరులో రేపు అనేదే లేనట్లు వ్యవహరిస్తోంది. ప్రజాజీవితంలో ఉన్నవారిలో ఒక్క లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ మాత్రమే మొదట్నుంచీ ఒకే వైఖరితో సీపీఎస్‌ను సమర్థిస్తున్నారు. ఆయన వాదనలు విన్నాక పలువురు ఉద్యోగులు కూడా అంగీకరిస్తున్నారు. కానీ ఆ రకంగా హేతుబద్ధ, నిర్మాణాత్మక ధోరణితో ఉద్యోగులకు నచ్చచెప్పకుండా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ప్రజాప్రయోజనాల పట్ల ఎంతో కొంత నిబద్ధతను కనబరిచే జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ కూడా పాత పెన్షన్ విధానాన్ని తిరిగి తేవాలని డిమాండ్ చేయటం ప్రభుత్వోద్యోగ వ్యవస్థను కదిలించటానికి రాజకీయ పార్టీలు ఎంత భయపడుతున్నాయో తెలియచేస్తోంది.

# లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్‌లా తయారైన ప్రభుత్వోద్యోగం

ప్రభుత్వోద్యోగమంటే పని తక్కువ, జీతం ఎక్కువ, గీతం కూడా రావచ్చు, జవాబుదారీతనం పెద్దగా ఉండదు, ఎలా పనిచేసినా జీవితాంతం భద్రత, ఏమైనా తేడా వస్తే సంఘాలతో కలిసి దబాయించవచ్చు.. వంటి ధోరణులుగా స్థిరపడటం వల్ల యువతలో కూడా అత్యధికులు సర్కారీ కొలువుల కోసమే వెంపర్లాడుతున్నారు. అర్హతతో సంబంధం లేకుండా వందల ఉద్యోగాలకు లక్షల మంది పోటీపడుతున్నారు. వయసు పైబడుతున్నా ప్రభుత్వోద్యోగాల కోసం ఎదురుచూస్తూ గడుపుతున్నారు. ప్రభుత్వాలు కూడా ప్రయివేటు ఉద్యోగాలకు, స్వయంఉపాధికి అవకాశాల్ని పెంచేలా నాణ్యమైన విద్య, మౌలిక వసతులు వంటి అంశాలను అమలు చేయటం మీద దృష్టి పెట్టకుండా, రిజర్వేషన్లు వంటి తాత్కాలిక, భావోద్వేగాల అంశాల చుట్టూ తిరుగుతుండటం మానవ వనరుల్ని వృధా చేస్తోంది.

పెద్ద విజయమంటే.. జేపీ ఆ జిల్లాకు కలెక్టర్‌గా పనిచేసిన దశాబ్దాల తర్వాత ఇటీవల 2019లో ఈ రచయిత మిత్రులొకరు ఒంగోలులోని రిమ్స్‌కి వెళితే అక్కడ పనిచేస్తున్న ఓ మహిళ జేపీ కృషిని గురించి ప్రస్తావించారు. 'జేపీగారు ఎంతో ముందుచూపు గలవారు. మా జిల్లా అభివృద్ధికి చాలా చేశారు' అని ఉద్వేగానికి లోనయ్యారు. ఈ మొత్తం ప్రాజెక్ట్‌నూ రైతులు ఎక్కడా, ఎవరికీ ఒక్క రూపాయి లంచం ఇవ్వాల్సిన అవసరం లేకుండానే జేపీ పూర్తి చేశారు. అవినీతికి మారుపేరైన అధికార యంత్రాంగంతోనే రైతులకు కావలసిన పనుల్ని చకచకా చేయించారు. అంటే, కక్ష సాధిస్తున్నట్లో, బెదిరిస్తున్నట్లో కాకుండా సరైన ప్రమాణాలను, పద్ధతులను పాటిస్తే.. ప్రభుత్వోద్యోగ వ్యవస్థను ప్రక్షాళన చేయటం, నిజమైన ప్రజాసేవా వ్యవస్థగా మార్చటం, ఎక్కడికక్కడ పౌరులు, సంస్థలు స్వచ్ఛందంగా భాగస్వాములయ్యేలా చేయటం పూర్తిగా సాధ్యం.

ఈ చర్యల్ని తీసుకోకుండా, ప్రయివేటు రంగం చేయాల్సిన పనుల నుండి బైటపడి ప్రభుత్వం తాను చేయాల్సిన మౌలిక బాధ్యతలను సక్రమంగా నెరవేర్చకుండా చిల్లర మార్పులు, వాటికే భారీ ప్రచారానికి పరిమితమైతే దేశం భారీ మూల్యం చెల్లిస్తుంది. ప్రజలు, ప్రభుత్వోద్యోగ వ్యవస్థ మధ్య యుద్ధమే అంతిమంగా పరిష్కారమవుతుంది.

### ప్రభుత్వోద్యోగుల జీతభత్యాలకు, ప్రజల జీవన ప్రమాణాలకు మధ్య

# సమతూకం సాధించాలి

బి.ఎస్. రాములు,తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తొలి చైర్మన్

1947 నాటికి, నేటికి గత ఏడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ వ్యవస్థ, న్యాయవ్యవస్థ పొందుతున్న సౌకర్యాలు, జీతభత్యాలు, సౌఖ్యాలు, ఉద్యోగ భద్రత, జీవనభద్రత ఎన్నో రెట్లు పెరుగుతూ వచ్చాయి. నాకు తెలిసి 1967లో జూనియర్ అసిస్టెంట్‌కు, ఒక టీచర్‌కు రూ.96 నుంచి రూ.130 మధ్యన జీతం ఉండేది. కాలానుగుణంగా జీవన ప్రమాణాలు ఉండేట్లు జీతభత్యాలు ఇప్పుడెలా ఉన్నాయో తెలిసిందే.

ప్రజలకు - ప్రభుత్వ యంత్రాంగానికి, వివిధ రంగాల్లో కార్మికులకు - ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్య అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సంఘటిత శక్తులుగా, విద్యావంతులుగా, అధికారులుగా ఉన్నవారికి అనుకూలంగా సంపద పంపిణీ చేయబడుతున్నది. అదనపు ఉత్పత్తి, సంపద, సౌకర్యాలు, నూతన ఆవిష్కరణలు, ఆధునికతలు అన్నీ ఇలాంటి కొన్ని వర్గాలకు సింహభాగం అందుతున్నాయి. వారు పొందగా మిగిలినదే ప్రజలకు చెందడం ఒక విషాదకరమైన వాస్తవం. ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం ఒకట్రెండు శాతం గల ప్రభుత్వ యంత్రాంగం జీతభత్యాలకు, పింఛన్లకు, సౌకర్యాలకు కేటాయించడం దీనినే సూచిస్తున్నది. 30 నుంచి 40 శాతం దాకా బడ్జెట్ ఈ కొద్ది శాతానికి పోగా, మిగతా బడ్జెట్‌లో ప్రాజెక్టులకు, పరిశ్రమలకు పోగా ప్రత్యక్షంగా ప్రజలకు విద్య, వైద్య, గృహవసతి, ఉపాధి కల్పన రంగాలకు మిగులుతున్నది చాలా తక్కువ. అందులోనే ప్రజలు అన్నీ సర్దుకోవాల్సి వస్తున్నది. తమ గురించి మాత్రమే ఆలోచించే విద్యావంతులు.. ఉద్యోగులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా, మేధావులుగా, నాయకులుగా ఆలోచించే తన కోసం తాను అనే దశ నుంచి, ప్రజల కోసం తాము అనే దశకు మలుపు తిరిగినప్పుడే ఏ సమాజమైనా బాగుపడుతుంది. అలాకాకుండా, ప్రజల గురించి మాకెందుకు, మా గురించి మాత్రమే ఆలోచించుకుంటాం, డిమాండ్ చేస్తాం అనుకోవడం వల్ల తాత్కాలికంగా ప్రయోజనం పొందవచ్చేమోగానీ, దీర్ఘకాలికంగా అది వారికి కూడా నష్టం కలుగజేస్తుంది. జీతభత్యాలు, సౌకర్యాలు పెరిగి, పెరిగి ప్రభుత్వం విధిలేక ఇక ఉద్యోగులకు బదులుగా, తాత్కాలిక ప్రాతిపదికగా కాంట్రాక్ట్ ఉద్యోగులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసుకోవడం జరుగుతున్నది.

జీతభత్యాలు, పింఛన్ల భారం పెరిగి పెరిగి, పింఛన్ జీతంలోంచి పొదుపు చేసుకునే విధానం ప్రవేశపెట్టబడిందనే విషయం చాలామందికి ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది. జీతభత్యాల పెంపునకు, ప్రజల జీవన ప్రమాణాలకు మధ్య సమన్వయం సాధించాల్సిన అవసరం ఉన్నది.




ప్రజల జీవన ప్రమాణాలు పెరుగకుండా ప్రభుత్వ జీతభత్యాలు, పింఛన్లు, సౌకర్యాలు పెంచడం ప్రభుత్వానికి భారమే కాకుండా, ఉద్యోగుల పట్ల ప్రజల వ్యతిరేకతకు కారణమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకు .. ప్రజల జీవన ప్రమాణాలకు, ఆదాయాలకు మధ్య ఉండాల్సిన నిష్పత్తి గురించి జాతీయస్థాయిలో విస్తారంగా చర్చ జరుగాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రజాస్వామ్యంలో ప్రజల కోసమే ప్రభుత్వం, ప్రజా ప్రయోజనాలే అంతిమ లక్ష్యం.

# అంబేద్కర్ - ప్రభుత్వోద్యోగ వ్యవస్థ - పౌర సేవలు

- డా॥ జయప్రకాష్ నారాయణ్





1956, మార్చి 18న ఆగ్రాలో డా॥ అంబేద్కర్ ఒక చరిత్రాత్మక ప్రసంగాన్నిచ్చారు. "మీకు రాజకీయ హక్కులను సాధించటానికి నేను గత 30 ఏళ్లుగా పోరాడుతున్నాను. పార్లమెంటులో, రాష్ట్రాల అసెంబ్లీల్లో మీకు రిజర్వుడు స్థానాలను సాధించగలిగాను. మీ పిల్లల చదువుకు తగిన ఏర్పాటును చేయగలిగాను. ఇవాళ మనం పురోగమించగలం. విద్య, ఆర్థిక, సామాజిక అసమానతల్ని నిర్మూలించేలా ఈ పోరాటాన్ని సమైక్యంగా కొనసాగించాల్సిన బాధ్యత ఇక మీ భుజాలపై ఉంది" అని ఆయన చెప్పారు.

ప్రభుత్వోద్యోగుల గురించి అంబేద్కర్ ఇలా అన్నారు: "చదువులో మన అణగారిన సమాజంలో కొంత పురోగతి ఉంది. చదువుకోవడం ద్వారా కొంతమంది ఉన్నత పదవులకు చేరుకున్నారు. కానీ ఈ చదువుకున్నవాళ్లు నన్ను మోసం చేశారు. ఉన్నత విద్యను పొందిన తర్వాత వాళ్లు సమాజానికి సేవ చేస్తారని నేను వారి నుంచి ఆశించాను. కానీ ఈవేళ నేను చూస్తున్నది కొంతమంది చిన్న, పెద్ద గుమాస్తాల గుంపుని! తమ బొజ్జల్ని నింపుకోవటంలో తలమునకలైన గుంపు ఇది."

విద్యార్థులు, యువతకు ఆయన పిలుపునిస్తూ, "విద్యార్థులకు నా విజ్ఞప్తి ఇదే. చదువును పొందిన తర్వాత ఏదోక గుమాస్తా పని చేయటానికి బదులు, మీ గ్రామానికి లేదా ప్రాంత ప్రజలకు సేవ చేయండి. దీనివల్ల.. అజ్ఞానం కారణంగా దోపిడీకి, అన్యాయానికి గురవటం ఆగిపోతుంది. సమాజ విముక్తిలోనే మీ విముక్తి ఉంది" అని చెప్పారు.

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఆరేళ్ల తర్వాత బాబాసాహెబ్ ఎంతో లోతైన, నిర్మొహమాటమైన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పరిశీలనకు చాలా ప్రాధాన్యత ఉంది. చట్టబద్ధంగా మినహాయింపు కల్పించిన హక్కులు ముఖ్యమైనవే, కానీ విద్య, ఆర్థిక, సామాజిక అసమానతని తొలగించటానికి నిరంతర పోరాటం అవసరం.. అని ఆయన స్పష్టంగా గుర్తించారు. తాను పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచేలా చేసిన హక్కుల నుంచి లాభం పొందిన కొద్దిమంది, సొంత ఆదాయాలను పోగేసుకోవటంలో తలమునకలై ఉన్నారని అంబేద్కర్ వేలెత్తి చూపారు. జడలు పరచుకొని ఉన్న అసమానతల్ని, సమాజంలోని అవకాశాలకు నోచుకోని కోట్లాదిమందిని వీరు విస్మరించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వోద్యోగం కోసం ఎదురుచూసే యువత సమాజాన్ని విముక్తం చేయలేరని మందలించారు. అజ్ఞానం వల్ల దోపిడీకి, అన్యాయానికి గురికావటాన్ని నిర్మూలించి తీరాలని ఉద్ఘాటించారు.

అప్పటి నుంచి, ఆరు దశాబ్దాలకుపైగా గడిచిపోయాయి. అంబేద్కర్ శంకించినదే భవిష్యవాణి అని రుజువైంది. మనం సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించటానికి, న్యాయాన్ని పొందటానికి చట్టబద్ధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ వాస్తవంలో మాత్రం.. నిజమైన సమానత్వం, అవకాశాలు, న్యాయం మన ప్రజల్లోని అత్యధిక సంఖ్యాకులకు అందటం లేదు. మన రాజ్య వ్యవస్థలు, వాటి పనితీరులోని లోపాల్ని గుర్తించి ఒక క్రమపద్ధతి ప్రకారం సరి చేయటం మాత్రమే ఈవేళ ప్రయోజనకారి పని అవుతుంది.

ఒక వ్యక్తి లేదా కుటుంబం సొంతంగా చేసుకోలేని ఉమ్మడి అవసరాలను తీర్చటానికి రాజ్యవ్యవస్థను మానవ సమాజం నిర్మించింది. రాజ్యవ్యవస్థ సమర్థంగా, నిజాయతీగా పని చేయటం మరి ముఖ్యంగా జనాభాలోని పేదలు, అవకాశాలు అందుకోలేని వర్గాల జీవితాలకు, వారి జీవనోపాధికి కీలకం! కొందరు లోతైన ఆలోచనాపరులు పలు సందర్భాల్లో చెప్పినట్లు.. సమాజంలోని సంపన్నులు, బలవంతులు, బాగా చదువుకున్నవారు, మంచి ఆదాయమున్నవారు, ఉన్నత వర్గీయులు ప్రభుత్వాన్ని, మిగిలిన సమాజాన్ని పట్టించుకోవటం మానేశారు. వాళ్లకు సెక్యూరిటీ గార్డులున్న సొంత గేటెడ్ కమ్యూనిటీలుంటాయి, వాళ్లకు ప్రత్యేక నీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థ ఉంటుంది, వాళ్లకు సొంత విద్యుత్తు జనరేటర్లు ఉంటాయి, స్టోరేజి బ్యాటరీలతో నిరంతర విద్యుత్తు సరఫరా ఉంటుంది, వాళ్లకు ఖరీదైన, ప్రత్యేకమైన ప్రయివేటు స్కూళ్లు, భారీ ఇన్సూరెన్స్ కవరేజీతో ఏ స్థాయి జబ్బుకైనా వైద్యసేవల్ని అందించగలిగే ప్రయివేటు ఆస్పత్రులు ఉంటాయి, వాళ్లకేదైనా సమస్య ఉంటే శక్తిమంతమైన అధికారులను, రాజకీయ నాయకులను తక్షణం కలిసి పరిష్కరించేసుకోగలరు. సంపన్న, శక్తిమంతమైన వారికి సమర్థవంతమైన, నిజాయతీ కలిగిన ప్రభుత్వం అవసరం లేదు. పరిపాలన ఎంత చెత్తగా ఉన్నా బతకటానికి, ఎదగడానికి వాళ్లకు మార్గాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ వైఫల్యం ఒక పరిధి దాటితేగానీ, వారికి తత్వం బోధపడదు. కానీ ప్రభుత్వం ఏ స్థాయిలో విఫలమైనా తీవ్రంగా నష్టపోయేది పుట్టుకతో వివక్ష బాధితులైన పేదలు, అణగారిన వర్గాలు! సమర్థవంతమైన, నిజాయతీతో, మానవీయతతో కూడిన ప్రభుత్వం వీరి మనుగడకు, ఎదుగుదలకు ఎంతో అవసరం.

ఈవేళ్టి భారతదేశంలో అనేక రంగాలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ, పుట్టుకతో అసమానతల్ని కొనసాగించటానికి పెద్దఎత్తున కారణమవుతున్న రాజ్యవ్యవస్థ పనితీరు, దాని సంస్థలకు సంబంధించిన ఐదు కీలక రంగాలపై మాత్రమే నేను ఇక్కడ దృష్టి పెట్టాలనుకుంటున్నాను.

వీటిలో మొదటిది, ప్రజలకు కనీస సేవల్ని ప్రభుత్వం సక్రమంగా, కచ్చితంగా అందించటం! మంచినీరు, మురుగు పారుదల, వరద డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సేవల్ని అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యత. రోజువారీ జీవితానికి ఎంతో అవసరమైన ఈ సేవలను అందించటంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రధానంగా పేదల జీవితాలు దుర్భరంగా మారతాయి, మెరుగైన భవిష్యత్తు కోసం వారు ఎంతో ఆరాటంతో చేసే ప్రయత్నాలకు ఆ మేరకు గండిపడుతుంది. ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపించేది, గుర్తించాల్సినది – ఒక సాధారణ పౌరునికి, ఒక అతి దిగువ స్థాయిలో ఉన్నా సరే ప్రభుత్వోద్యోగికీ మధ్య నెలకొన్న భారీ అంతరం, అసమతుల్యత! మన దేశంలో పనిచేసేవారిలో 90 శాతం మందికి తక్కువ జీతాలు, ఆదాయమే ఉన్నాయి. వీళ్లంతా జీవన భద్రతలేకుండా అసంఘటిత రంగంలో ఉన్నవారు లేదా స్వయంఉపాధి పొందుతున్నవారు. దీనివల్ల, ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి కూడా ఆర్థికంగా వీరి కంటే ఎక్కువ భద్రతను కలిగి ఉంటాడు, మెరుగ్గా చదువుకుని, విషయ పరిజ్ఞానం కలిగి ఉంటాడు, జనాభాలోని అత్యధికుల కంటే ఎక్కువ పలుకుబడి, అధికారం కలిగి ఉంటాడు! లంచాలు,

వేధింపులు, జాప్యాలు లేకుండా సామాన్య పౌరులకు ప్రభుత్వ సేవల్ని సవ్యంగా అందించటంలో స్వతంత్ర భారతదేశ వైఫల్యం వల్ల మన ప్రజలు నిస్సహాయంగా అర్థించేవారుగా మిగిలిపోగా.. ప్రజాసేవకులుగా ఉండాల్సిన ఉద్యోగులు యజమానుల్లా తయారయ్యారు. ఇలా పాత్రలు తారుమారవటం, వలసపాలన నాటి మనస్తత్వం నుంచి బైటపడకపోవటం, లైసెన్స్-కంట్రోల్-పర్మిట్ విధానాలు.. కలగలిసి పేదలకు తీవ్ర నష్టం చేసి దేశాన్ని వెనక్కి గుంజుతూ వచ్చాయి. తమకు హక్కుగా అందాల్సిన మౌలిక సేవలకు దాదాపు 65 శాతం కుటుంబాలు ప్రతి సంవత్సరం లంచాలు చెల్లిస్తున్నాయని సర్వేలు సూచిస్తున్నాయి. వీరంతా బలవంతపు అవినీతి బాధితులు. తమకు అప్పనంగా మేలు చేయమనో, తమ పట్ల పక్షపాతం చూపాలనో వీరు అడగటం లేదు. తమకు హక్కుగా రావాల్సిన సేవలను సక్రమంగా అందించమని అడుగుతున్నారు. కానీ ఆలస్యాలు, వేధింపులు, అవమానాలు, అయోమయాలు, కొన్ని సందర్భాల్లో పూరించలేని నష్టానికి గురై నలిగిపోతున్నారు. పేదల నుంచి లంచాలు వసూలు చేయటం ఒక ఆనవాయితీగా మారిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం కోసం వీరు మధ్యవర్తుల సాయం కోరాల్సి వస్తోంది. స్థానిక రాజకీయ కార్యకర్తలు, పలుకుబడి గలవారి మీద ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా పేదలు రాజకీయ బానిసత్వంలో శాశ్వతంగా మగ్గుతున్నారు. సార్వత్రిక ఓటుహక్కు, ప్రజాస్వామ్యం నానాటికీ బలహీనపడుతున్నాయి.

మౌలిక సేవలను వేగంగా, నిర్దిష్ట కాలపరిమితిలోగా అందించేట్టుగా మనకు సర్వీస్ గ్యారంటీని (హక్కుగా పౌర సేవలకు చట్టబద్ధ ఏర్పాటు) అమల్లోకి తేవాలి. గడువులోగా సేవలను అందించలేకపోతే పరిహారం చెల్లించాలి. యు.కెలో ఈ రకమైన సిటిజన్స్ చార్టర్లను జాన్ మేజర్ ప్రభుత్వం వ్యవస్థీకృతం చేసింది. అనేక దేశాలు దీన్ని అనుసరించాయి. పౌర సేవల్ని సక్రమంగా అందించటానికి భారతదేశంలో ఇప్పటి వరకూ చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగలేదు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమస్యలు పరిష్కారమయ్యే చోట మినహాయించి, మిగిలిన అన్ని సేవల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో, ప్రజలకనెత్తిన అందనంత ఎత్తులో ఉన్న అధికార వ్యవస్థ, అధ్వాన్న పౌర సేవలు అలాగే కొనసాగుతూ ప్రజల్ని పీడిస్తున్నాయి. దీన్ని సరిదిద్దడానికి బదులుగా, భారత ప్రభుత్వం అడ్డగోలుగా తుగ్లక్ తరహాలో స్పందించింది. పౌర సేవల సంక్షోభం పరిష్కారం కాకపోగా వ్యతిరేక ఫలితాలు వచ్చేలా చట్ట సవరణ చేసింది. 2018లో పార్లమెంటు అవినీతి నిరోధక చట్టాన్ని ఏకగ్రీవంగా సవరించింది. వామపక్షాలు, దళిత, అగ్రకులాల అనే తేడా లేకుండా అన్ని పార్టీలూ ఈ సవరణలో ప్రభుత్వానికి మద్దతు పలికాయి. చట్టానికి రెండు దిగ్భ్రమ కలిగించే నిబంధనల్ని జోడించారు. మొదటిది, వేధింపులు లేకుండా సకాలంలో నాణ్యమైన పౌర సేవల్ని అందించే జవాబుదారీతనం కలిగిన నిర్మాణాన్ని ఏర్పాటు చేయటానికి బదులు.. ఓ చిన్నపాటి ధ్రువపత్రం కోసమో, విద్యుత్ మీటర్ కోసమో గతి లేక లంచమిచ్చే నిస్సహాయ బాధిత పౌరుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధించేలా సవరణ చేశారు. కనీస శిక్ష మూడేళ్లు! దేశంలో ఇలా తప్పనిసరి శిక్ష చాలా నేరాలకు లేదుగానీ, నిస్సహాయ పౌరులకు మాత్రం వర్తింపచేశారు. లాలూచీ అవినీతి అయితే, లంచం ఇచ్చేవాడు, లంచం తీసుకునేవాడు ఇద్దరూ తమ అక్రమ లాభం కోసం దేశానికి నష్టం కలిగిస్తే, న్యాయమైన పోటీని అణగదొక్కితే లేదా ఏ రూపంలోనైనా ప్రజాప్రయోజనాలను కాలరాస్తే.. అప్పుడు మాత్రమే లంచం ఇచ్చేవాడు కూడా లంచం తీసుకునేవాడితో సమానంగా నేరస్తుడవుతాడు. చట్టపరంగా అప్పుడు మాత్రమే ఇచ్చేవాడి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ బలవంతపు అవినీతికి బాధితులైన నిస్సహాయ సామాన్యులు తమకు హక్కుగా రావాల్సిన జనన లేదా ఆదాయ ధ్రువపత్రం, భూ రికార్డు లేదా హక్కుల రికార్డు పత్రం, నీటి సరఫరా, లేదా విద్యుత్తు కనెక్షన్‌కు గతి లేక లంచాలిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యానికి, బలవంతపు అవినీతికి బాధితులైనవారికి విధిగా మూడేళ్ల జైలు శిక్ష విధించటం ఎంత క్రూరమైన వైచిత్రి! అటువంటి ధోరణులు పేదరికాన్ని, సామాజిక, ఆర్థిక అసమానతను ఇంకా కొనసాగిస్తాయి. కులపరమైన అణచివేతని, పుట్టుకతో ప్రతికూలతల్ని అధిగమించేలా రాజ్యవ్యవస్థ పేదలు, బలహీనులను బలోపేతం చేస్తుందని బాబాసాహెబ్ ఆశించారు. కానీ దానికి బదులుగా, పేదలను పిండి, వారిని ఇంకా అణగదొక్కే ఒక రాకాసిని మనం సృష్టించాం. చట్టానికి ఇంకో ఘోరమైన సవరణ కూడా చేశారు. గతి లేక లంచం ఇచ్చినవాడిని కఠినంగా శిక్షించటం ఒకపక్కయితే.. లంచం తీసుకునేవాడిని మాత్రం ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా కనీసం విచారణ కూడా చేయకూడదట! గతంలో అధికారుల ప్రాసిక్యూషన్‌కు మాత్రమే ముందస్తు అనుమతి రక్షణ ఉండేది. ఇప్పుడు ఏకంగా ప్రాథమిక విచారణకు కూడా అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. పేద, నిస్సహాయ పౌరునికి, ఆ పౌరునికి సేవకుడైన ప్రభుత్వోద్యోగికి మధ్య నిచ్చెనమెట్ల అంతరం ఎంత అగాథంలా ఉందో తెలియజెప్పటానికి ఇంతకంటే పెద్ద దృష్టాంతం కావాలా? మనకు నిజమైన జవాబుదారీతనం కావాలి, ప్రభుత్వం నుంచి హక్కుగా జరగాల్సిన పనులకు సర్వీస్ గ్యారంటీ ఏర్పాటు కావాలి, బలవంతపు అవినీతికి బాధితులైన సామాన్య ప్రజలను శిక్షించే క్రూరమైన చట్టసవరణల్ని ఉపసంహరించుకోవాలి. ఇవి చేయకుంటే, ప్రభుత్వ యంత్రాంగపు క్రౌర్యానికి, ద్రోహానికి పేదలు బలిపశువులవటం కొనసాగుతూనే ఉంటుంది.

అంబేద్కర్, ఇతర జాతి నిర్మాతల దార్శనికత, ముందుచూపునకు మనం కృతజ్ఞులమై ఉండాలి. వారి వేసిన పునాది వల్లే మనం ఇంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో కూడా ఐక్యతను, స్వేచ్ఛను కాపాడు కోగలిగాం, బహుభాషల మధ్య భాషా సామరస్యతను పెంపొందించు కోగ లిగాం, కొంతమేర మన ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసుకోగలిగాం. కానీ ఇప్పటికీ మనలోని శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వికసింప చేసుకోలేకపోతున్నాం. రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలు.. కులం, పేదరికం కింద నలిగిపోతున్న కోట్లాదిమందికి ఇంకా ఊహకు కూడా అందని విషయాలుగానే మిగిలిపోయాయి.

సమాజంలోని సాంప్రదాయ దృక్పథాలకు - రాజ్యాంగ విలువలు, దార్శనికతకు మధ్య ఎప్పుడూ అంతరం ఉంటుంది. రాజకీయ, పాలన, న్యాయ ప్రక్రియలు, ప్రభుత్వ యంత్రాంగం, పనితీరు.. కుల అణచివేతకు, సమానత్వానిక్మి ప్రతికూలతలకు, అవకాశాలకు, విభజనకు, సామరస్యతకు మధ్య వారధిగా వ్యవహరించాలి! అంబేద్కర్ చేసిన కృషి కొంత ఫలితాన్ని సాధించింది, కానీ ఆయన కలను నెరవేర్చడంలో మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. మనం చేయాల్సింది చాలా ఉంది. ఇందుకు అనుసరణీయమైన, వాస్తవికమైన, ఆచరణసాధ్యమైన, సాధించగల, ఆమోదయోగ్యమైన వ్యవస్థీకృత పాలన, న్యాయ, రాజకీయ సంస్క రణలు అందుబాటులో ఉన్నాయి. మన అనుభవాలు, ఇతర దేశాల్లోని అత్యున్నత పద్ధతులను మదించి తయారుచేసినవి ఇవి. న్యాయం, ఎదిగే అవకాశాలను గనక మనం నమ్ముతూంటే.. పరిష్కారం యథాతథస్థితి కాదు. శక్తిసామర్థ్యాలను వికసింప చేసుకునే అవకాశాలు లేకపోవటం, నివారించదగ్గ బాధలు కొనసాగటం.. ఇవి రెండూ సమాజం చేస్తున్న పెద్దపాపాలని నేను నమ్ముతాను. మన జాతి నిర్మాతల దార్శనికత నుంచి స్ఫూర్తితో, మన అనుభవాలందించిన విజ్ఞత నుండి సృజనాత్మకతతో వ్యవహరించగలిగితే మనం ఆ పాపాల నుండి విముక్తిని సాధించగలం.

**(ఏప్రిల్- భారతరత్న డా॥ బీఆర్ అంబేద్కర్, డా॥ బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతి సందర్భంగా 2019లో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన కీలకోపన్యాసం నుండి)**

# హిజాబ్: వివాదం – విజ్ఞత

హిజాబ్‌పై వివాదం రాజుకోవటం వెనక ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు, కర్ణాటక విధానసభకు వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల రాజకీయం ఉందని కొందరు విశ్వసిస్తున్నారు. హిందూత్వవాద పార్టీ ఎన్నికల ఎత్తుగడ ఇలాగే ఉంటుందని వారు ఉదాహరణలు చెబుతున్నారు. అయ్యుండచ్చు. కానీ ఒకళ్లు ఒక ఫార్ములాతో మనల్ని ఒకసారి ఓడిస్తే అర్థం చేసుకోవచ్చు, రెండోసారి ఓడించినా కొంత అర్థం చేసుకోవచ్చు, కానీ మూడు, నాలుగు, అయిదు.. ఇలా వరసపెట్టి ఓడిస్తుంటే మన చింతనలోనే, వ్యవహారశైలిలోనే లోపం ఉన్నట్లు గుర్తించాలి గదా! లేదా, ఎదుటివారిలోని తప్పు కంటే మనలోని తప్పు ఇంకా పెద్దదై ఉండాలి. అందుకే హిజాబ్‌పై ఎవరి చేతుల్లోనో, ఎవరి కుట్రల వల్లో ఓడిపోయామని భావించేవాళ్లు కొంచెం స్థిమితంగా ఆలోచించాలి. వివేకానికి, ఆలోచనకి పదునుపెట్టాలి. ఆ భావం ఉన్న రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలే కాదు.. వాటి వాదాన్ని నమ్మేవాళ్లు, అవి తమ కోసమే నిలబడ్డారనుకునే ప్రజానీకం కూడా. కొంత లోతుగా పరిశీలన చేయాలి.

ముస్లిం మహిళలు తలకు ధరించే హిజాబ్ వస్త్రధారణపై కర్ణాటకలోని ఒక విద్యాసంస్థలో కొన్ని నెలల క్రితం వివాదం మొదలైంది. యూనిఫాం తప్ప హిజాబ్ ధరించి హాజరుకాకూడదు అని సదరు విద్యాసంస్థ స్పష్టం చేసింది. దీంతో ముస్లిం విద్యార్థినులు అసమ్మతి తెలియచేశారు. ఇది చిలికిచిలికి గాలివాన అయి, ఇతర కొన్ని స్కూళ్లు, కళాశాలలకు వ్యాపించింది. కొందరు హిందూ సంస్థల విద్యార్థులు కాషాయ స్కార్ఫ్‌లను ధరించాలని ప్రదర్శనలు నిర్వహించారు. హిందూవాదుల డిమాండ్లను కూడా కళాశాలలు తోసిపుచ్చాయి. ఇదే సమయంలో, నిబంధన ఉన్న విద్యాసంస్థల్లో యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని కర్ణాటక ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. కానీ ప్రదర్శనల హోరుతో మూడు నాలుగు రోజులు స్కూళ్లను మూసివేయాల్సి వచ్చింది. దీని మీద కొందరు హైకోర్టును ఆశ్రయించగా, ఈ రకమైన ఏ మత ఆహార్యాన్నీ ధరించకూడదని హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వునిచ్చింది. మార్చి 15న తుది తీర్పునిస్తూ, హిజాబ్ ఇస్లాం మత సంప్రదాయంలో భాగం కాదని తేల్చింది. హిజాబ్ లేకుండా యూనిఫాం ధరించాలనే నిబంధనను కొనసాగించటానికి అనుమతినిచ్చింది. దీని మీద సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

అవన్నీ అలా ఉంచితే, రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి,




హిందూ ముస్లిం భేదభావం లేనివారు, స్వతహాగా సంయమనం పాటించేవారు కూడా విచిత్ర వాదనలు చేయటం బాధాకరం. అంశం మెజారిటీ వర్సెస్ మైనారిటీ అయినప్పుడు కచ్చితంగా మైనారిటీల పరిరక్షణ తొలి కర్తవ్యం కావాలి. కానీ పరిస్థితి అది కాదిక్కడ. హిజాబ్ కన్నా అమ్మాయిల చదువు ముఖ్యం. హిందూ మహిళలు బొట్టు పెట్టుకుంటారు, పెళ్లయిన మహిళలు మంగళసూత్రం ధరిస్తారు.. అవి హిందూ మతంలో మొదట్నుంచీ ఉన్నాయా అనే ప్రశ్నల్నీ లేవనెత్తుతున్నారు. హిందూ మతంలో ఉన్నవాళ్లు మంగళసూత్రం, నల్లపూసలు ధరిస్తే రక్షణ ఉంటుంది కాబట్టి మహిళలు వాటిని ధరిస్తారు, ఆ రకంగానే పురుషుల నుండి రక్షణ కోసం హిజాబ్ ధరిస్తున్నారని ఎందుకనుకోకూడదని అడుగుతున్నారు. నచ్చింది ధరించే స్వేచ్ఛ ఎవరికైనా ఉంటుంది. కానీ సమాజానికి ఇబ్బంది కలగకుండా, విద్యాసంస్థలు వంటి చోట్ల నిబంధనలకు ఆటంకం కలగకుండా. సదరు విద్యాసంస్థ వ్యవహారశైలి నచ్చలేదనుకుంటే, మరో సంస్థకి వెళ్లే స్వేచ్ఛ కూడా ఉంది. హిజాబ్ ఒకవేళ మత సంప్రదాయమే అయినా కూడా, ముఖ గుర్తింపు స్పష్టంగా అవసరం ఉండే ప్రదేశాల్లో నిబంధనల్ని విధించే వెసులుబాటును రాజ్యాంగమే కల్పించింది. స్వేచ్ఛకు సహేతుక నియంత్రణలు విధించవచ్చని మన సంవిధానం స్పష్టంగా చెబుతోంది. విద్యాసంస్థ యూనిఫాం ఆ రకమైన నియంత్రణ అవసరమైనదయితే, కచ్చితంగా ఎవరైనా ఆమోదించాల్సిందే. అలాగే.. రక్షణ కావాలంటే చట్టబద్ధపాలన కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలిగానీ, ఛాందస ధోరణుల్ని ప్రోత్సహిస్తే ఎలా? ఇకనైనా మతంలోని మౌలిక విలువల్ని పాటిస్తూ, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, చట్టబద్ధపాలన, స్థానికంగా అధికారాలు వంటి అంశాల కోసం పోరాడటం అన్ని మతాల్లోని వారికీ ప్రయోజనకరం.

(సోర్స్: www.youtube.com/drjpview)

# లోక్‌సత్తా కంటే 'ఆప్' భిన్నంగా ఏం చేసింది?

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు శివ్ ఖేరా రాసిన 'యు కెన్ విన్' పుస్తకం మనలో చాలామందికి తెలుసు. తెలుగు సహా ప్రపంచంలోని పలు భాషల్లో ఇది అందుబాటులో ఉంది. ఇందులో రచయిత టైటిల్‌కి ఒక ట్యాగ్ ఇచ్చారు. 'విజేతలు భిన్నమైన పనులు చేయరు.. భిన్నంగా చేస్తారు' అని. ఈ కోణంలోనే ఒక యువ జర్నలిస్టు ఇటీవల ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను ఒక ప్రశ్న అడిగారు. "లోక్‌సత్తా కంటే ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) భిన్నంగా ఏం చేసింది?".

అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై ఎగ్జిట్ పోల్స్ వెలువడటం కంటే కూడా ముందు జరిగిన ఇంటర్వ్యూ ఇది. ఆ ప్రశ్నకు జేపీ ఇచ్చిన జవాబే ఇప్పుడు పంజాబ్ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా వర్తిస్తుంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా ఈ 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరోలా వచ్చినా కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అవి సెమీఫైనల్స్ కావు. ఇప్పుడు కూడా రానున్న ఎన్నికల్లో జాతీయ స్థాయి ఫలితాలు ఇదే తరహాలో ఉంటాయనుకోనక్కర్లేదు. అసలు ఆ సెమీఫైనల్స్, ఫైనల్స్ అన్నదే వ్యర్థ చర్చ. ఎన్నికలు జరిగేది.. ఎన్నికల మధ్యకాలంలో ప్రజలకు జరిగే పనుల కోసం! అలాంటిది ఒక ఎన్నిక అవగానే మరో ఎన్నికకు సిద్ధమవటం, దాని చుట్టూ చర్చ తిప్పటం పౌరసత్వం కొరవడిన దివాళాకోరు ప్రజాస్వామ్యమవుతుంది. వివిధ రంగాల్లో నాయకత్వ స్థాయిలో ఉన్నవారి దృష్టి కోణం, చర్చ ఎలా ఉన్నా.. ప్రజలు మాత్రం ప్రజాస్వామ్యంలో ఒక గుణాత్మక మార్పు దిశగా ఈ ఎన్నికల్లో మంచి సంకేతాన్నిచ్చారు. ప్రభుత్వాలు చేయాల్సిన వాస్తవ పనుల్ని ఎజెండాగా చూపిన వారికి, వాటిలో కొన్నింటినైనా విశ్వసనీయతతో చేసి చూపినవారికి పట్టం కట్టారు.

ఈ క్రమంలో మొదట చెప్పుకోవాల్సింది పంజాబ్‌లో ఆప్ ఘన విజయం. ప్రభుత్వాలు చేయవలసిన పనుల్లో ముఖ్యమైన విద్య, ఆరోగ్యాన్ని ఆప్ రాజకీయ ఎజెండాగా మార్చింది. నోటి మాటగా, ఊకదంపుడు నినాదాలుగా కాకుండా వాటి కోసం ఢిల్లీలో చిత్తశుద్ధితో పనిచేసింది. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో మంచి ఫలితాలను సాధిస్తోంది. ఈ కృషినే ప్రజల ముందుంచుతూ పంజాబ్‌లో ఆప్ ఓట్లు అడిగింది. కాంగ్రెస్ పార్టీ స్వయంకృతాపరాధాలు, కొత్త వ్యవసాయ చట్టాలపై రైతులకు వివరించకుండా మోదీ పార్టీ నియంతృత్వ ధోరణితో మొండిగా వ్యవహరించటం, అకాలీదళ్ విశ్వసనీయత కోల్పోవటం వంటి కారణాలు ఒక రకమైన రాజకీయ శూన్యతను పంజాబ్‌లో కల్పించాయి. ఫలితంగా ఆప్ మెజారిటీ ఓటర్ల ఎంపికగా మారింది. పంజాబ్‌లో 117 సీట్లకు గాను ఆప్ 92 గెలుచుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో (2017) 23.7% ఓట్లతో 20 సీట్లు




సాధించిన ఆప్, ఈసారి 42% ఓట్లు సాధించింది. 72 స్థానాలు అదనంగా అందిపుచ్చుకుంది. ఈ తరహా విజయాన్ని ఉత్తర, పశ్చిమ రాష్ట్రాల్లోనూ సాధించాలని ఇప్పుడు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలపై గురిపెట్టింది.

పంజాబ్ ఎన్నికల్లో ఆప్ విద్య, ఆరోగ్యంతోపాటు ప్రభుత్వ పాత్రతో సంబంధంలేని కొన్ని అంశాల్లో సైతం సంక్షేమం పేరుతో ఉచితాల్ని ప్రకటించింది. ఉచిత విద్యుత్తు, నగదు వంటివి ఇందులో ఉన్నాయి. కానీ ఢిల్లీ, పంజాబ్ పరిస్థితులు భిన్నమైనవి. ఢిల్లీ ఆదాయాలు ఎక్కువ. జనాభా, విస్తీర్ణం తక్కువ. ఢిల్లీ విస్తీర్ణం 1485 చదరపు కిలోమీటర్లు కాగా, పంజాబ్ విస్తీర్ణం 50,362 చ.కి.మీ. పంజాబ్ జనాభా ఢిల్లీ కంటే దాదాపు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. ఢిల్లీలో ఆప్ ముఖ్యమంత్రి ఒక శక్తిమంతమైన మేయర్‌లాంటి స్థానంలో ఉండగా, పంజాబ్‌లో ఆప్ ముఖ్యమంత్రి పూర్తిస్థాయి రాష్ట్రానికి సారథ్యం వహిస్తున్నారు. ఒకపక్క ఢిల్లీ స్థాయిలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చటం ఓ సవాలు కాగా, మరోపక్క ఢిల్లీ కంటే మెరుగైన పాలనను కూడా పంజాబ్‌లో అందించాల్సి ఉంటుంది. మిగులు ఆదాయం ఉండే ఢిల్లీలోలా, రూ. 2.6 లక్షల కోట్ల అప్పు ఉన్న పంజాబ్‌లో ఉచితాల్ని అమలు చేయటానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది. వినూత్న పద్ధతుల్ని ప్రవేశపెట్టాల్సుంటుంది. చట్టబద్ధపాలన వంటి అంశాల్లో సైతం ప్రమాణాల్ని నెలకొల్పాల్సి ఉంటుంది. పాత రాజకీయ ఉచ్చులో చిక్కుకోకుండా తదేకంగా వీటి కోసమే పనిచేసి పంజాబ్‌ను ఒక కొలిక్కి తెస్తే, ఇతర రాష్ట్రాలూ పంజాబ్ బాటలోకి రాక తప్పదు. అప్పుడు ఆప్ పంజాబ్ విజయం క్రమంగా దేశవ్యాప్తమవుతుంది.

ఇక్కడే లోక్‌సత్తా కంటే ఆప్ భిన్నంగా ఏం చేసింది అన్న ప్రశ్నకు జేపీ ఇచ్చిన సమాధానం ప్రస్తావనార్హం. లోక్‌సత్తా భావజాలం నుండే ఆప్ ఆవిర్భవించింది. బెంగళూరులో 'సాకు' పేరుతో జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం ఇందుకు నాంది (ఫోటో చూడవచ్చు). దీన్నుంచే

అన్నా హజారే అవినీతి వ్యతిరేక పోరు, దానికి జాతీయ మీడియా 24×7 కవరేజీ, దాన్నుంచి అరవింద్ కేజ్రీవాల్‌కి ప్రాచుర్యం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం అన్నా హజారే ఉద్యమం జరిగినప్పుడు కూడా, అన్నాతోపాటు కేజ్రీవాల్, ఇతర పలువురు ఉద్యమకారులు రాజకీయాల్ని వ్యతిరేకించారు. రాజకీయ నేతల్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆ సమయంలో జేపీ పదే పదే వారికి విజ్ఞప్తి చేశారు – 'రాజకీయం పవిత్ర వ్యాసంగం, పార్టీలు లేకుండా ప్రజాస్వామ్య మనుగడ కష్టం' అని. అలాగే అన్నా ఉద్యమం రూపొందించిన లోక్‌పాల్ బిల్లు ఆచరణసాధ్యం కాదని కూడా జేపీ వివరించారు. సీబీఐ సహా అన్నిటినీ కూల్చేస్తే కొత్త వ్యవస్థ రాదని, శిథిలాలు మిగిలి అరాచకం ప్రబలుతుందని స్పష్టం చేశారు. ఆ తర్వాత కేజ్రీవాల్ ఆప్‌ను ప్రకటించి రాజకీయ ప్రవేశం చేయటం, ఢిల్లీలో అధికారంలోకి రావటం జరిగాయి. లోక్‌పాల్ బిల్లు కూడా చాలావరకు జేపీ రూపొందించిన అంశాలతోనే అమల్లోకి వచ్చింది.

ఎన్నికల్లో ఆప్ విజయం సాధించటానికి.. లోక్‌సత్తా కంటే భిన్నంగా చేయటం కన్నా, భిన్నమైన పరిస్థితులు కలిసొచ్చాయి. ఉదాహరణకు, ఢిల్లీలో ప్రజల ఆదాయాలు ఎక్కువ. ముఖ్యమంత్రి ఒక బలమైన మేయర్‌లాగా ప్రజలకు రోజువారీ సేవల విషయంలో జవాబుదారీగా ఉంటారు. కట్టే పన్నులకు, అందే సేవలకు మధ్య సంబంధం ప్రజల కంటికి కనిపిస్తూ ఉంటుంది. ఒక పెద్ద పార్టీ కాంగ్రెస్ అక్కడ వివిధ కారణాల వల్ల అంతర్థానమైంది. అలాగే వలంటీర్‌లు పెద్దఎత్తున పనిచేశారు. ఇవన్నీ ఆప్ విజయానికి ఢిల్లీలో దోహదం చేశాయి. కానీ పంజాబ్‌లో విజయం మాత్రం ఇందుకు భిన్నమైనదనటంలో సందేహం లేదు. పంజాబ్‌లో గ్రామీణ ప్రాంతాలు, తక్కువ ఆదాయాలు వంటి ప్రతికూలతలు ఉన్నాయి. అయితే ఢిల్లీతో పంజాబ్‌కు అనుబంధం, ఢిల్లీ నమూనా పంజాబ్‌ప్రజలకు బాగా తెలియటంతో ఆప్ విజయానికి గట్టి పునాది పడింది. ఢిల్లీకి, పంజాబ్‌కి పరిస్థితుల్లో ఉన్న తేడాని అర్థం చేసుకుని, సవాలుకు తగ్గట్లు ఆప్ వ్యవహరించగలిగితేనే ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి మార్గం సుగమం అవుతుంది. అయితే లోక్‌సత్తాకు ప్రధాన క్షేత్రంగా ఉన్న దక్షిణాదిలో ఇంకా అందుకు అవకాశాలు స్వల్పమనే చెప్పాలి. తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటక, తమిళనాడుల్లో పాతుకుపోయిన పార్టీల రాజకీయంతో విభజన తీవ్రంగా ఉంది. డబ్బు ప్రభావం విపరీతంగా ఉంది. తాయిలాల ఉచితాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఇంత అననుకూలత ఉండబట్టే, లోక్‌సత్తాకు గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం ఓట్లు రాలేదు. గెలిచిన అభ్యర్థి తప్ప, ఒక్క ఓటు తేడాతో ఓడిన అభ్యర్థి కూడా ఇక చేయటానికి ఏమీ ఉండదు అనే మన ఎన్నికల వ్యవస్థ వల్ల పట్టణ ప్రాంతాల్లో కూడా క్రమంగా ఓట్లు తగ్గాయి. అంతెందుకు, బెంగళూరులో లోక్‌సత్తా పార్టీ పోటీ చేసినప్పుడు 16% దాకా ఓట్లు రాగా, ఆ తర్వాత ఆప్ పోటీ చేస్తే 2% కూడా రాలేదు. ఈ రకమైన భిన్న పరిస్థితుల వల్ల లోక్‌సత్తా ఎన్నికల రాజకీయంలో విజయం సాధించలేదు. పంజాబ్‌లో ఆప్ 24% ఓట్ల నుండి 42% ఓట్లకు పెరిగి విజయం సాధించింది. లోక్‌సత్తా 2% ఓట్ల నుండి ఎదిగి తెలుగు రాష్ట్రాల్లో అధికారాన్ని అందుకోవాలంటే ఎంత సమయం పడుతుంది!.. అలా అని ప్రయత్నం విరమించలేదు. లోక్‌సత్తా గణనీయ స్థాయి ఎన్నికల విజయం సాధించకపోయినా కొత్త రాజకీయ భావజాల పునాదిని మాత్రం ఈ దేశంలో ఏర్పరచగలిగింది. అందుకే ఆచరణాత్మకంగా ఆలోచించి, ఎన్నికలకు విరామం ఇచ్చి మరో పంథాలో సంస్కరణల కృషిని కొనసాగిస్తోంది. ఎన్నికల్లో పోటీ ద్వారా మార్పు తీసుకొస్తామంటున్న ఆప్ వంటి పార్టీలకు, కొందరు అభ్యర్థులకు కూడా తన వంతు సహకారం అందిస్తోంది. మార్పు కోసం చిత్తశుద్ధితో కృషి చేసేవారంతా లోక్‌సత్తా మనుషులే. మార్పుకి జరిగే ఆలస్యాన్ని ఎంత తగ్గించగలిగితే మనం అంత విజయం సాధించినవారమవుతాం.

**పంజాబ్‌లో ఆప్ 24% ఓట్ల నుండి 42% ఓట్లకు పెరిగి విజయం సాధించింది. లోక్‌సత్తా 2% ఓట్ల నుండి ఎదిగి తెలుగు రాష్ట్రాల్లో అధికారాన్ని అందుకోవాలంటే ఎంత సమయం పడుతుంది!.. అలా అని ప్రయత్నం విరమించలేదు. లోక్‌సత్తా గణనీయ స్థాయి ఎన్నికల విజయం సాధించకపోయినా కొత్త రాజకీయ భావజాల పునాదిని మాత్రం ఈ దేశంలో ఏర్పరచగలిగింది. అందుకే ఆచరణాత్మకంగా ఆలోచించి, ఎన్నికలకు విరామం ఇచ్చి మరో పంథాలో సంస్కరణల కృషిని కొనసాగిస్తోంది. ఎన్నికల్లో పోటీ ద్వారా మార్పు తీసుకొస్తామంటున్న ఆప్ వంటి పార్టీలకు, కొందరు అభ్యర్థులకు కూడా తన వంతు సహకారం అందిస్తోంది.**

ఇక ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వరుసగా రెండోసారి అధికారంలోకి రావటం గురించి కూడా చెప్పుకోవాల్సి ఉంది. అక్కడ బీజేపీ అందిస్తోన్న రాయితీలు, పథకాలు ఎప్పుడో మూడు దశాబ్దాల క్రితమే తెలుగు రాష్ట్రాల్లో ఇచ్చినవి. కానీ ఆ పథకాల అమలులో విశ్వసనీయతని, పార్టీ నిర్వహణలో ఒక క్రమశిక్షణని ప్రజలు బీజేపీ నాయకత్వంలో చూశారు. దానికితోడు ప్రభుత్వ మౌలిక కర్తవ్యమైన చట్టబద్ధపాలనని ఏదోకరీతిలో బీజేపీ సర్కారు అమలు చేసింది. శాంతి భద్రతల్ని మెరుగుపరచింది. మోదీ ప్రభుత్వం తెచ్చిన సాగు చట్టాల అమలు తీరు ఎలా ఉన్నా, అవి మంచి చట్టాలని తెలిసినా కూడా వాటికి వ్యతిరేకంగా రైతుల్ని రెచ్చగొట్టిన కొందరు ఉద్యమకారులు ఈ ఎన్నికల్లో రైతుల ఆగ్రహ వెల్లువలో బీజేపీ సీట్లు భారీగా గల్లంతవుతాయని ఆశపడ్డారు. కానీ వాస్తవాల ప్రాతిపదిక, నిర్దిష్ట పరిష్కారం లేకుండా కేవలం ఉద్రేకాలతో ఒక బలమైన రాజకీయ పార్టీని గద్దె దించటం, అందునా గెలిచే అవకాశమున్నవారికే ఓట్లు పడే మన ఎన్నికల వ్యవస్థలో అంత తేలిక కాదని రుజువైంది. వీటిని గుర్తించకుండా కులమతాల అంకగణితాలు, వాటాల పంపిణీ వంటి అంశాలకే ప్రాధాన్యం ఇవ్వటంతో ఎస్పీ సహా విపక్షాలు విఫలమయ్యాయి. అంతిమంగా ఉచితాలు కూడా పనిచేయని పరిస్థితి మన దేశంలో వస్తుందనటంలో సందేహం లేదు. ప్రజల సామర్థ్యాన్ని వికసింప చేయటానికి సృజనాత్మకతను ప్రదర్శించటమే రాజకీయ నాయకత్వానికి కొలమానంగా మిగులుతుంది. లక్ష్యాలకి, మార్గాలకి మధ్య తేడాని గుర్తించే పరిణతి రాజకీయాన్ని ఎంత పెంపొందించుకోగలిగితే, మన ప్రజాస్వామ్యం అంత పటిష్ఠమవుతుంది, ప్రజల ఆకాంక్షలు అంత నెరవేరతాయి. ✦

# జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం
# ఆచరణయోగ్యమైన స్వజాతీయ ప్రజాస్వామ్యం

## జుగాడ్ ఓటర్ల విజయ రహస్యం.. జనబలం!

నాణ్యతగల విద్యా మరియూ ఆరోగ్యమూ ఎలా మనందరికీ కావాలనుకుంటామో, అలాగే వాటిని చిత్తశుద్ధితో అమలు చేయగల మీలాటిఓటర్లతో నాణ్యతగల రాజకీయపార్టీకూడా కూడా కావాలి. ఈప్రపంచంలో ఏదీ ఎవరికీ ఉచితంగా రాదని గ్రహించిన వారే జుగాడ్ ఓటర్లు! ఐతే ఒక రెండువేలో, అయిదువేలో లేదా మీస్తోమతుకి తగ్గట్టుఒక కార్యకర్తగా పదివేల రూపాయిలో **మనజీవితంలో ఒకేఒకసారి** విరాళమిచ్చేందుకు సాహసించండి.

### పార్టీ ప్రజాస్వామ్యయుతంగా మన నియంత్రణలో ఉంటుంది.

మనమంతా జుగాడ్ ఓటర్లుగా ప్రతిపాదిత పార్టీ యొక్క హక్కుదారులం. సమిష్టిగా నాయకత్వం వహిస్తాము. సమిష్టిగా మెజారిటీ ఓటు ప్రకారం ఉమ్మడి ఎజెండాతోముందుకుపోదాం. పార్టీకి నిధులు మనమే సమకూర్చుకుని మనకు కావలసిన రీతిలో మనమే ప్రభుత్వాలను నడుపుకుందాం!

### విరాళదాతలు తమకునచ్చిన ఏ పార్టీకయినా ఓటువేసుకోవచ్చు.

మనదేశానికి రాజ్యాంగమెలాగో మనపార్టీకికూడా రాజ్యాంగముంది. (డిసెంబరు 2021జనబలం చూడండి) పార్టీయొక్క మూలసిద్ధాంతము కొరకు సెప్టెంబరు 2020జనబలం చూడండి.

మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో పదివేల రూపాయలు (మాత్రమే) విరాళంగా సమకూర్చి, జుగాడ్ మొదటి ఓటరుగా నమోదయ్యాను. కనీసం పది మంది జుగాడ్ఓటర్ల మద్దతు కోరుతూ నా యొక్క సమీప బంధుమిత్రులను కలిసినప్పుడు ఈ ప్రతిపాదనను వివరించగా, అనూహ్యంగా 25 మంది ఓటర్లు విరాళమిచ్చి మద్దతుప్రకటించడం ముదావహం.

పార్టీలో అంతర్గత-ప్రజాస్వామ్యమే శిలాశాసనంగా, తనను విరాళాలతో సమర్ధించిన జుగాడ్ ఓటర్లకు జవాబుదారీగా వ్యవహరించగల నేర్పుతో, సాటికార్యకర్తలతోమరియూ జుగాడ్ ఓటర్లతో కలిసిమెలిసి పనిచేస్తూ ఆనందించే - మొదటి 24 మందికార్యకర్తలు వచ్చే వరకూ “జుగాడ్ ఓటర్ల ఉద్యమం” అన్నది పార్టీ ఏర్పాటు కోసం కావలసిన ఆర్థికవనరుల సమీకరణకై కృషిచేస్తూ ఉంటుంది. ఈ బృహత్కార్యానికి పదివేల రూపాయల విరాళాలిచ్చే జుగాడ్ ఓటర్లందరూ భావిభారత భాగ్యవిధాతలుగా గుర్తించబడతారు. అనుసంధానకర్తగా నేను నిమిత్తమాత్రుడిని మాత్రమే. జుగాడ్ ఓటర్లది సమిష్టి నాయకత్వం, మనది సమిష్టిబాధ్యత.

స్వచ్ఛందసంస్థలలో పనిచేసేవారూ, మహిళలూ, మేధావులూ, విద్యావంతులూ, డాక్టర్లూ, లాయర్లూ, ప్రభుత్వోద్యోగులూ, జర్నలిస్టులూ, నిరుద్యోగులూ,సినీప్రముఖులూ, కర్షకులూ, కార్మికులూ ఎవరైనాసరే విరాళమిచ్చి (రూ. 2/5/10వేల వరకు మాత్రమే) జుగాడ్ ఓటరుగా నమోదయి ప్రతిపాదితపార్టీలో తమకునచ్చిన బాధ్యతను స్వీకరించవచ్చు.



**ఎం. పార్థసారథి**

**(ఫౌండర్ ప్రెసిడెంట్)**

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10,
హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com

# జగాడ్ ఓటర్లు ప్రశాంత కిశోరాలు...

**నేటి వార్త (31-3-2022)** TNIE 3rd page: కొంత మంది రాజకీయ నాయకులు కల్లుగీత కార్మికులను అవమాన పరుస్తున్న తీరును ఖండిస్తూ,తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ మరియు మద్యపాన నిషేధం మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ గారు మన హైదరాబాదులో 25 కోట్ల రూపాయల పెట్టుబడితో "నీరా కేఫ్" లనుప్రారంభిస్తూ, 15 రకాల వ్యాధులను నిర్మూలించే నీరా అనబడే ఆహార పానీయాన్ని గౌడ్ల ఆత్మగౌరవార్ధం, పర్యాటక విభాగ శాఖద్వారా నీరాను జనాదరణ పానీయంగామారుస్తామని తెలియజేసారు.

(జనబలం ఆగస్టు 21 లో ప్రచురితమైన 'జుగాడ్ ఓటర్ల పార్టీ యొక్క రూపురేఖలు' మంత్రివర్యులు వారు చదివినట్లు ఉన్నారు. అందులో మనప్రతిపాదన ఒకసారిచదవండి: పార్టీలు మద్యాన్ని ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మలచి, మద్యంధరలు విపరీతంగా పెంచి, ఓటర్లను "తాగుబోతులు" గా అభివర్ణిస్తూ, వారినిఅవమానిస్తూనే నిలువు దోపిడీ చేస్తూ, "మద్యపాన-నియంత్రణ" ముసుగులో మహిళలఓట్లను కొల్లగొడుతున్నాయి. రాజ్యాంగవిరుద్ధమైన ఇటువంటి కార్యకలాపాలుచట్టబద్ధ పరిపాలనద్వారానే బహిరంగంగా జరుగుతున్నాయి. ఎంతోమంది స్త్రీలూ పురుషులూ మక్కువగా సేవించే తేలికపాటి బీరు లో ఆల్కహాల్ 5 శాతం లోపునఉంటే, కఠిన మద్యంలో ఆల్కహాల్ 40 శాతం పైన ఉంటుంది. అందుచేత బీరుని ఆహారపానీయంగా క్రోడీకరించి, ప్రస్తుతం 150 రూపాయిలకు అమ్ముతున్నసీసాబీరుని, ప్రభుత్వం డ్యూటీల పేరిట చేస్తున్న లూటీని నియంత్రించి, 30 రూపాయిలకు సూపర్ మార్కెట్ల ద్వారా GST విధానంద్వారా అందించవచ్చు.)

ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ సంపూర్ణంగా మద్యపాన నియంత్రణ అనే అంశాన్ని సంపూర్ణంగా మహిళల చేతుల్లో పెట్టిన రోజు ప్రజల ఆరోగ్యం కూడా బాగుపడేఅవకాశం ఎక్కువ.

అలాగే గౌరవనీయులైన డాక్టర్ జేపీగారి "అందరికీ ఆరోగ్యం" అందించే సమగ్ర, ఆచరణసాధ్య నమూనాను ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ జుగాడ్ ఓటర్లు అమలుచేసుకుని చూపిస్తే వారికేవిధమైన అభ్యంతరమూ ఉండదు. జస్టిస్ చంద్రకుమార్ గారి సౌజన్యంతో కొన్ని న్యాయ సంస్కరణలూ, JD లక్ష్మీనారాయణ గారి సౌజన్యంతో లా & ఆర్డర్ పోలీసు విభాగంలో మార్పులూ, ప్రొఫెసర్ నాగేశ్వర్ గారి సౌజన్యంతో కొన్ని ఆర్ధిక సంస్కరణలూ , ప్రొఫెసర్ కోదండరాం గారి ఆధ్వర్యంలో విద్యాసంస్కరణలూ, మెరుగైన సమాజం కోసం అహరహమూ కృషిచేస్తున్న TV9, ఇలా ఎన్నో సంస్థలూ, మేధావుల్లోవున్న జ్ఞాన సంపదను వారి అనుమతితోవినియోగించుకోవచ్చు.

**Please contact: M.Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:**

శుభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలతో !

M.Parthasarathy (A Jugaad Voter and Karyakarta)

భావిభారత భాగ్య విధాతలు: (1) K.Subrahmanyam (2) Col.P.V.Ramanarao (3) U.Subba Rao (4) C.K.Murthy (5) Syed Ansari (6) Smt.D.Kasturi (7) K.Srinivas Murthy

Advt.

# దళితబంధుకీ రొటీన్ రాజకీయ కేటాయింపే

## -రూ.2,56,958.51 కోట్లతో తెలంగాణ 2022-23 బడ్జెట్-



అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న పూర్తిస్థాయి బడ్జెట్ కావటం వల్లనేమో తెలంగాణ ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి ప్రవేశపెట్టిన పద్దు ప్రారంభ వ్యాఖ్యల నుండి రాజకీయ కోణంలో ఉన్నట్లు కనిపించింది. గతేడాది బడ్జెట్ సవరించిన అంచనాలు, పన్నేతర రాబడి అవకాశాలు వాస్తవాలకు బారెడు దూరంలో ఉన్నా కూడా భారీ బడ్జెట్‌ను చూపటం కోసం అంకెలను చూపే ప్రయత్నం చేసినట్లని పిస్తుంది. అలాగే అన్ని జనాకర్షక పథకాలనూ కొనసాగిస్తున్నట్లు కనిపిస్తూనే వాటికి కోతలు వేసి భారీ కేటాయింపులతో దళిత బంధుపై రాజకీయ బెట్టింగ్ చేశారనుకోవటం మితిమీరిన వ్యాఖ్య కాబోదు. ఇంత కేటాయింపూ దళితబంధును రీడిజైన్ చేయాలన్న సూచనను పట్టించుకోకుండా రొటీన్ రాజకీయం తీరులోనే చేయటం కీలకంగా గమనించాల్సిన ఇంకో అంశం.

తెలంగాణ తాజా వార్షిక బడ్జెట్‌ను రూ.2,56,958.51 కోట్లతో ఆర్థిక మంత్రి హరీష్‌రావు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. గతేడాది కంటే ఇది 11.32% ఎక్కువ. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల (రూ.2,10,082.61 కోట్లు) కంటే 22.31 శాతం అధికం.

**బడ్జెట్ ముఖ్యాంశాలు:**

- దళితబంధు పథకం అమలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో హుజూరాబాద్ మినహా (ఇక్కడ ఇప్పటికే దాదాపు 35 వేల దళిత కుటుంబాలు ఎంపికయ్యాయి) ఇతర నియోజకవర్గాల్లో ఒక్కోచోట 1500 చొప్పున 1.77 లక్షల దళిత కుటుంబాలకు లబ్ధి జరగనుంది. పథకం కింద.. ఎలాంటి పూచీకత్తు అవసరం లేకుండా, ఇష్టమైన పని ఎంపిక చేసుకుని ఉపాధి పొందేందుకు ప్రభుత్వం గ్రాంటు రూపంలో రూ.10 లక్షలు ఇస్తోంది. వచ్చే ఏడాదికి 2 లక్షల మందికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించింది.
- ఇంధన శాఖకు మొత్తం బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.12,198 కోట్లు కేటాయించింది. ఇందులో వ్యవసాయానికి, ఇతర వర్గాలకు ఉచితంగా లేదా తక్కువ ఛార్జీలకు విద్యుత్ సరఫరా కోసం రాయితీ కింద విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు రూ.10,500 కోట్లను ఇవ్వనుంది. 2021-22లో రాయితీ కింద 10,625 కోట్లు ఇవ్వగా, వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.125 కోట్లు తగ్గించనుంది. విద్యుత్ కేంద్రాలు, పంపిణీ, సరఫరా వ్యవస్థల నిర్మాణాలకు గతంలో జాతీయ విద్యుత్ ఆర్థిక సంస్థ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ సంస్థల నుండి రాష్ట్ర విద్యుత్ సంస్థలు రుణాలు తీసుకున్నాయి. ఈ బకాయిల కిస్తీ చెల్లింపులకు బడ్జెట్‌లో రూ.1574 కోట్లు కేటాయించింది. రాయితీ పద్దు కింద రూ.10,928 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని డిస్కంలు గతంలో అంచనా వేశాయి. బడ్జెట్‌లో రూ.10,500 కోట్లే కేటాయించటంతో ప్రభుత్వాన్ని మళ్లీ అడిగే అవకాశముంది. ఏటా బడ్జెట్ కేటాయింపులను మించి ప్రభుత్వం అదనంగా సర్దుబాటు చేస్తోంది.
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు కలిపి

### శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

| | |
|---|---|
| + ఆర్థిక శాఖ | - 43,088 |
| + పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి | - 29,586 |
| + వ్యవసాయం, సహకారం | 24,254 |
| + నీటిపారుదల | 22,691 |
| + రవాణా, రోడ్లు భవనాలు | 23,191 |
| + షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి | 20,624 |
| + సెకండరీ ఎడ్యుకేషన్, సెక్రటేరియట్ డిపార్ట్‌మెంట్ | 13,727 |
| + విద్యుత్ | 12,209 |
| + వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ | 11,237 |
| + పురపాలన, పట్టణాభివృద్ధి | 10,903 |
| + హోం | 9,135 |
| + వెనకబడిన తరగతుల సంక్షేమం | 5,697 |
| + రెవెన్యూ | 3,547 |
| + గిరిజన సంక్షేమం | 3,415 |
| + పరిశ్రమలు, వాణిజ్యం | 3,135 |
| + ప్రణాళిక విభాగం | 3,111 |
| + ఆహార పౌర సరఫరాల సంస్థ | 2,899 |
| + పశు సంవర్ధక, మత్స్య | 2,768 |
| + ఉన్నత విద్య | 2,357 |
| + మహిళా శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు | 1976 |
| + మైనారిటీ సంక్షేమం | 1728 |
| + పర్యావరణం, అటవీ, సాంకేతిక | 1419 |
| + న్యాయ | 1413 |
| + యువత, పర్యాటక, సాంస్కృతిక | 1026 |
| + సాధారణ పరిపాలన | 600 |
| + కార్మిక, ఉపాధి కల్పన | 511 |
| + ఐటీ కమ్యూనికేషన్లు | 360 |
| + లెజిస్లేచర్ | 157 |

బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.29,271 కోట్లు కేటాయించింది. పల్లెప్రగతి కోసం రూ.3,330 కోట్లు ఇచ్చింది. మండల పరిషత్‌లకు రూ.500 కోట్లు గ్రాంట్లు, గ్రామ పంచాయతీలకు నెలకు రూ.227.50 కోట్లు చొప్పున ప్రకటించింది. పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం నుండి రూ.1054.07 కోట్లు అందుతాయి. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల బడ్జెట్‌లో అత్యధికంగా ఆసరా పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.11,728 కోట్లు కేటాయించింది.

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు కేటాయించే నిధులు తగ్గించింది. 2021-22లో

### ప్రధాన పథకాలకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

| | |
|---|---|
| + తెలంగాణ దళితబంధు | 17,700 |
| + రైతుబంధు | 14,800 |
| + రెండు పడక గదుల ఇళ్లు బీఎల్‌సీతో కలిపి | 12,000 |
| + ఆసరా | 11,728 |
| + విద్యుత్ రాయితీ | 10,500 |
| + ఉపకార వేతనాలు, డైట్ | 4,688 |
| + పల్లె ప్రగతి | 3,330 |
| + బియ్యం రాయితీ | 2,787 |
| + కల్యాణలక్ష్మి/షాదీముబారక్ | 2,750 |
| + పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు | 2,519 |
| + ఆర్టీసీ | 1500 |
| + రైతుబీమా | 1466 |
| + పట్టణ ప్రగతి | 1394 |
| + ఆరోగ్యశ్రీ/ఈహెచ్ఎస్ | 1343 |
| + ఆయిల్ పాం సాగు | 1000 |
| + గొర్రెలు, మేకల అభివృద్ధి | 1000 |
| + మిషన్ భగీరథ-అర్బన్ | 800 |
| + కాళేశ్వరం టూరిజం సర్క్యూట్ | 750 |
| + సుంకేశుల ఇంటేక్ ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్‌పీ) | 725 |
| + జిల్లా పోలీసు కార్యాలయాలు, కొత్త ఠాణాలకు భవనాలు, వరంగల్ కమిషనరేట్ | 648 |
| + గిరిజన గ్రామ పంచాయతీల భవనాలకు | 600 |
| + కేసీఆర్ కిట్ | 443 |

రూ.2,500 కోట్లు కేటాయించగా, వచ్చే ఏడాదికి రూ.1,250 కోట్లకు పరిమితం చేసింది.

- ఉపాధి హామీ పథకానికి రూ.1460 కోట్లు కేటాయించారు. పీఎంకేఎస్‌వైకి రూ.100 కోట్లు ఇచ్చారు. రూర్బన్ పథకానికి రూ.10 కోట్లు, గ్రామీణ జీవనోపాధి మిషన్‌కు రూ.210 కోట్లు, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల యోజనకు రూ.150 కోట్లు అందిస్తారు. స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్‌కు రూ.350 కోట్లు కేటాయించారు.
- రెండు పడకల ఇళ్ల నిర్మాణ కొత్త పథకానికి సర్కారు రూ.12,000 కోట్లు ప్రతిపాదించింది. ఇప్పటికే మంజూరై నిర్మాణంలో ఉన్న వాటికి మరో రూ.3,650 కోట్లు ఇస్తామని చెప్పింది. సొంత స్థలం ఉంటే ఒక్కో ఇంటికి రూ. మూడు లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు ప్రతిపాదించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షల మందికి కొత్త పథకం ద్వారా ఆర్థిక సాయం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకే నిర్ణయాధికారం ఇచ్చింది. ఒక్కో నియోజకవర్గానికి మూడు వేల చొప్పున 3.57 లక్షల ఇళ్లు ఎమ్మెల్యేల కోటా కింది, మిగిలిన 43 వేలు ముఖ్యమంత్రి

**బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)**

| అంశం | 2021-22 బడ్జెట్ అంచనా | 2021-22 సవరించిన అంచన | 2022-23 బడ్జెట్ అంచనా |
|---|---|---|---|
| రెవెన్యూ రాబడులు | 1,76,126 | 1,56,126 | 1,93,029 |
| కేంద్ర పన్నుల వాటా | 13,990 | 13,990 | 18,394 |
| పన్ను ఆదాయం | 92,910 | 92,910 | 1,08,211 |
| పన్నేతర ఆదాయం | 30,557 | 20,557 | 25,421 |
| గ్రాంట్లు | 38,669 | 28,669 | 41,001 |
| పెట్టుబడులపై రాబడులు | 53,750 | 53,750 | 63,832 |
| మార్కెట్ రుణాలు | 47,500 | 47,500 | 53,970 |
| కేంద్ర రుణాలు | 200 | 200 | 4,102 |
| ఇతర రుణాలు | 1500 | 1500 | 1500 |
| డిపాజిట్లు తదితం | 4,500 | 4,500 | 4,200 |
| రుణాలు, అడ్వాన్సులు | 50 | 50 | 60 |
| మొత్తం రాబడుల | 2,29,876 | 2,09,876 | 2,56,961 |
| రెవెన్యూ వ్యయం | 1,69,383 | 1,51,731 | 1,89,274 |
| ఇందులో వడ్డీ చెల్లింపులు | 17,584 | 17,584 | 18,911 |
| పెట్టుబడి వ్యయం | 29,046 | 25,954 | 29,728 |
| రుణాలు | 23,256 | 23,256 | 26,253 |
| రుణాల తిరిగి చెల్లింపులు | 9,039 | 9,039 | 11,061 |
| మొత్తం వ్యయం | 2,30,725 | 2,09,982 | 2,56,958 |
| రెవెన్యూ మిగులు | 6,743 | 4,395 | 3,754 |
| ద్రవ్యలోటు | 45,509 | 44,766 | 52,167 |
| ప్రాథమిక లోటు | 27,925 | 27,181 | 33,255 |

## జీతాలు, పింఛన్లు, వడ్డీలు వగైరాలకే 54%.. విద్య, వైద్యంపై కేటాయింపులు పెంచాలి: కాగ్

తెలంగాణ ప్రభుత్వం శాసనసభ ఆమోదం లేకుండానే భారీ మొత్తంలో నిధుల వ్యయం చేస్తోందని, ఇది సభ అధికారాలను తగ్గించటమేనని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆక్షేపించింది. మానవాభివృద్ధి స్థాయిలను పెంచటానికి విద్య, వైద్యం వంటి సామాజిక సేవల మీద రాష్ట్రం ఖర్చు పెంచాలని, ఈ అంశాల్లో సాధారణ హోదా గల రాష్ట్రాల సగటు కన్నా తెలంగాణ వెనుకబడే ఉంటోందని తెలిపింది (2015-16లో సాధారణ కేటగిరి రాష్ట్రాల విద్య వ్యయం సగటు 15.68 అయితే, తెలంగాణ సగటు 11.15 శాతంగా, వైద్యంలో 4.79 శాతమయితే, తెలంగాణలో 3.95 శాతంగా ఉంది. 2019-20లో ఈ శాతాలు 15.91, 9.33 .. 5.21, 5.14గా ఉన్నాయి). వేతనాలు, పింఛన్లపై వ్యయం, వడ్డీ చెల్లింపులు 2015-16 నుండి ఎక్కువవుతున్నాయని, 2020-21లో రెవెన్యూ వ్యయంలో దాదాపు 54 శాతం తప్పనిసరి ఖర్చులు ఉన్నాయని కాగ్ తెలియచెప్పింది.

పరిధిలో ఉంటాయి. ప్రమాద బాధితులు, నిర్వాసితులకు కేటాయించేందుకు వీలుగా వీటిని ముఖ్యమంత్రి కోటాలో ఉంచారు.

- ఒకవైపు రాష్ట్ర ఆదాయం, వృద్ధి రేటు పెరుగుతుండగా.. మరోవైపు ప్రజలపై అప్పుల భారమూ పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.2,85,120 కోట్ల రుణాన్ని ప్రతిపాదించింది. తాజాగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ పరిధిలో మరో రూ.59,672 కోట్లు సమీకరించుకోనుంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రుణం రూ.3,29,980 కోట్లు అవుతుంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వ పూచీకత్తు రుణాలు ఈ ఏడాది రూ.40,449 కోట్లు కలుపుకుని జనవరి నాటికి రూ.1,45,456 కోట్లకు చేరాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర రుణం మొత్తం రూ.4,75,444

కోట్లవుతుంది. అంటే ఒక్కొక్కరిపై రూ.1,25,116. ఈ ఏడాది ప్రతిపాదించిన అప్పుల్లో నీటిపారుదల శాఖకు రూ.8,940 కోట్లు, నీటి సరఫరా, పారిశుద్ధ్యానికి రూ.7,267 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.1528 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ.1472 కోట్లు, రోడ్డు రవాణాకు రూ.1221 కోట్లు, పశుసంవర్ధక శాఖకు 797 కోట్లు, వైద్య ఆరోగ్యానికి 720 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులకు రూ.374 కోట్లు, ఇతర పరిశ్రమలకు 274 కోట్లు, పంటల సందర్శనకు 221 కోట్లు, మత్స్య రంగానికి 127 కోట్లు, వివిధ సాధారణ సేవలకు 103 కోట్లు, ప్రభుత్వ ఉద్యోగుల రుణాలకు 97 కోట్లు, పాడి అభివృద్ధికి 83 కోట్లు ఉన్నాయి. అంతర్గత రుణాలు రూ.8,700 కోట్లు, యూనియన్ ప్రభుత్వం నుండి తీసుకున్నవి రూ.438 కోట్లుగా నమోదైంది (బడ్జెట్ ప్రకటన ముగిశాక రాష్ట్ర ప్రభుత్వం రుణ సమీకరణ అంచనాలను సవరించటం, మార్చి 29న మరోసారి బాండ్ల విక్రయం ద్వారా రుణ సమీకరణ చేయటంతో 2021-22 ఆర్థిక సంవత్సరంలో రుణాల మొత్తం కొంత పెరిగే అవకాశముంది).

- సమీకృత చిన్నారుల అభివృద్ధి పథకం, జాతీయ పౌష్టికాహార మిషన్, ఆరోగ్యలక్ష్మి పథకాల కింద పౌష్టికాహారం అందించేందుకు రూ.690 కోట్లు కేటాయించారు.
- వైద్య ఆరోగ్య శాఖకు ఈ బడ్జెట్‌లో రూ.11,237.33 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో 3.3 శాతం నిధులుండగా, ఈ ఏడాది 1 శాతం పెరిగాయి. అయితే వీటిలో కూడా కీలకమైన ప్రాథమిక వైద్యానికి మాత్రం కేటాయింపులు తక్కువగా ఉన్నాయి.
- విద్యాశాఖకు ఈసారి రూ.16,043 కోట్లు ప్రతిపాదించారు. గతేడాది కంటే ఇది రూ.2,479 కోట్లు ఎక్కువే అయినా, ఈ పెంపు నిర్వహణ పద్దుకే సరిపోతుంది. మన ఊరు-మన బడికి కేటాయింపుల గురించి స్పష్టత లేదు. మొత్తం బడ్జెట్‌లో విద్యాశాఖకు కేటాయింపు 6.2 శాతంగా ఉంది.
- రాష్ట్ర బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రాజెక్టులకు రూ.2,377 కోట్లు ప్రతిపాదించారు.
- పారిశ్రామిక రంగానికి రూ.3,496 కోట్లు కేటాయించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు రూ.2,142 కోట్లు, విద్యుత్ రాయితీకి రూ.190 కోట్లు ఇందులో ఉన్నాయి.
- సాగునీటి రంగానికి రూ.22,675 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కేటాయింపుల్లో 50 శాతానికి పైగా నిధులను కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కిందనే ఖర్చు చేయనుంది. చిన్న నీటి వసతులకు రూ.1245 కోట్లు, మధ్యతరహా ప్రాజెక్టులకు రూ.283 కోట్లు ఇవ్వనున్నారు.
- రోడ్లు భవనాలకు మొత్తం 8,327 కోట్లు కేటాయించారు.
- 2018 డిసెంబర్ నాటికి బ్యాంకులకు రూ.75 వేల లోపు కట్టాల్సిన రైతుల రుణాల మాఫీకి వచ్చే ఏడాదిలో నిధులు విడుదల చేస్తామని తెలిపింది.
- జీహెచ్ఎంసీలో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామంటూ ప్రభుత్వం పద్దు ప్రసంగంలో ప్రస్తావించింది గానీ, ఆయా కార్యక్రమాలను చేపట్టేందుకు జీహెచ్ఎంసీకి మాత్రం ఆర్థిక దన్ను ఇవ్వలేదు. జీహెచ్ఎంసీ రూ.2,500 కోట్లు కావాలని ప్రతిపాదన పంపగా.. కేవలం ఉద్యోగుల జీతాలు, ప్రభుత్వ భవనాల పన్ను బకాయిల రూపంలో రూ.83 కోట్లు కేటాయించారు.
- రాష్ట్రంలో నగరాలు, పట్టణాలకు గతేడాదితో పోలిస్తే తాజా బడ్జెట్‌లో నిధులు గణనీయంగా తగ్గాయి. గత బడ్జెట్‌లో రూ.15,030 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈసారి రూ.10,903 కోట్లు మాత్రమే కేటాయించింది.
- రాష్ట్ర విపత్తు నిర్వహణ అగ్నిమాపక శాఖకు గత బడ్జెట్ కంటే ఎక్కువగా రూ.16.12 కోట్లు ఇచ్చినా, అత్యాధునిక శకటాలు కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనలకు అది ఏమాత్రం సరిపోయే అవకాశం లేదు. ✦

## ఇట్లుంటే దేశానికి తెలంగాణ నమూనా ఎట్లయితది?



రాష్ట్ర బడ్జెట్‌లో ఈసారి కూడా ప్రాథమ్యాలు సరిగా లేవని, విద్య, ఆరోగ్యాలకు తగిన కేటాయింపులు లేవని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. కేవలం ఆరోగ్య సమస్యల వల్ల తెలంగాణలో ఏటా 19 లక్షల మంది పేదలవుతున్నారని, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో లోక్‌సత్తా అందించిన నమూనాతో కేవలం రూ.1900 కోట్లు అదనంగా ఆరోగ్య రంగానికి కేటాయించి ఉంటే అందరికీ నాణ్యమైన ఆరోగ్యం అందుబాటులోకి వచ్చేదన్నారు. దళితబంధుని రీడిజైన్ చేసి దళితుల విద్య, ఆరోగ్యాలకు పెద్దపీట వేసి ఉంటే వారికి శాశ్వత మేలు జరిగేదన్నారు. లోక్‌సత్తా ఆరోగ్య విధానాన్ని తెలంగాణలో అమలు చేసి యావత్ దేశానికే కేసీఆర్ నమూనాగా మారాలని శ్రీనివాసు విజ్ఞప్తి చేశారు.

# మద్యనిషేధంపై నిషేధం

## -రూ.2,56,256.56 కోట్లతో ఆంధ్రప్రదేశ్ 2022-23 బడ్జెట్-



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి రూ. 2,56,256.56 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అప్పుల మయమై, ఆదాయ వనరుల కొరతను ఎదుర్కొంటున్న రాష్ట్రానికి ఇది భారీ బడ్జెట్ అనిపించటమే కాదు, బడ్జెట్ మొత్తం అంకెను చూస్తే ఫ్యాన్సీ నంబర్‌లాగా కూడా అనిపిస్తుంది. నవరత్నాలకు, ఉచితాలకు కేటాయింపులు చేస్తూ, అభివృద్ధి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు వంటి కీలక అంశాలకు మాత్రం బాగా తగ్గించి ప్రతిపాదనలు చేశారు. దశలవారీగా మద్యనిషేధం చేస్తామని చెప్పినా, మద్యాన్నే ఆదాయ మార్గం చేసుకున్నట్లు విశదమవుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఎక్సయిజ్ ఆదాయాన్ని రూ. 16,500 కోట్లుగా అంచనా వేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు వివరాల్ని సశేషమన్నట్లు వదిలేశారు. అమరావతి నిర్మాణానికి మొక్కుబడి కేటాయింపులు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న బడ్జెట్, ఇతర నిధుల వ్యయంపై యూనియన్ ప్రభుత్వం కూడా ఆక్షేపణలు తెలియచేస్తున్నా, ప్రభుత్వ బడ్జెట్ అంచనాలకు, వ్యయానికి పొంతన ఉండటం లేదని గణాంకాలు సూచిస్తున్నా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎక్కడా తగ్గలేదు (2020-21 బడ్జెట్ అంచనాల్లో 83 శాతమే ఖర్చు చేయగా, 2021-22 బడ్జెట్ అంచనాల్నీ ప్రభుత్వం కుదించింది. రూ. 2.29 లక్షల కోట్ల అంచనాల్ని రూ. 2.09 లక్షల కోట్లకు తగ్గించింది).

మూలధన వ్యయం అంచనాల్లోనూ ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. ఏకంగా రూ. 30,679 కోట్లను మూలధన వ్యయంగా ప్రతిపాదించారు. సవరించిన అంచనా ప్రకారం చేసిన ఖర్చు రూ. 18,529 కోట్లు మాత్రమే. అలాగే ఆదాయం అంచనాలకు, వాస్తవ రాబడికి పొంతన లేకపోయినా, అంకెలను ఘనంగా చూపారు. 2020-21లో రెవెన్యూ ఆదాయం రూ. 1,61,958 కోట్లు వస్తుందనుకుంటే, రూ. 1,17,136.18 కోట్లే వచ్చింది. 2021-22లో రూ. 1,77,196 కోట్లు వస్తుందనుకుంటే జనవరి వరకు రూ. 1.11 లక్షల కోట్లు మాత్రమే వచ్చింది. అయినా రెవెన్యూ ఆదాయాన్ని బడ్జెట్‌లో రూ. 1,91,225 కోట్లుగా చూపించారు.

**బడ్జెట్‌లోని మరికొన్ని అంశాలు:**

- 2022-23లో రూ. 55 వేలు బహిరంగ మార్కెట్ రుణాలుగా పేర్కొన్నారు.
- విద్యుత్ వినియోగం ఏటా 8% పెరుగుతుందని అంచనా. కానీ గత బడ్జెట్‌లాగే రూ. 5 వేల కోట్లే సబ్సిడీల చెల్లింపు కేటాయించారు.
- మైనారిటీల సంక్షేమానికి తొలిసారిగా ఉప ప్రణాళికను ప్రవేశపెట్టారు. గతేడాది బడ్జెట్‌లోనే రూ. 3,077 కోట్లతో పొందుపరిచినా, తీసుకురాలేదు. తాజా బడ్జెట్‌లో రూ. 3,532 కోట్లు కేటాయించారు. మైనారిటీల జనాభాలో ముస్లింలు 36.18 లక్షలు (7.32%), క్రైస్తవులు 6.83 లక్షలు (1.38%), సిక్కులు 0.10 లక్షలు, బౌద్ధులు 0.04 లక్షలు, జైనులు 0.27 లక్షలు, పార్శీలు 0.04 లక్షలు ఉన్నట్లు గుర్తించారు.

## బడ్జెట్‌లో వివిధ రంగాలవారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)

| రంగం | సవరించిన అంచనాలు (2021-22) | కేటాయింపులు (2022-23) |
|---|---|---|
| ఆర్థిక సేవలు | 57,132.82 | 69,306.74 |
| వ్యవసాయ, అనుబంధ సేవలు | 11,942.26 | 13,630.10 |
| గ్రామీణాభివృద్ధి | 13,187.45 | 17,109.06 |
| నీటి పారుదల, వరదల నియంత్రణ | 8,428.23 | 11,482.37 |
| ఇంధన | 12,768.30 | 10,281.04 |
| పరిశ్రమలు, ఖనిజాలు | 1906.08 | 2,755.17 |
| రవాణా | 6,246.33 | 9,617.15 |
| శాస్త్ర సాంకేతికత, పర్యావరణం | 8.50 | 11.78 |
| జనరల్ ఎకో సర్వీసెస్ | 2,645.67 | 4,420.07 |
| సామాజిక సేవలు | 84,119.28 | 1,13,340.19 |
| సాధారణ విద్య | 25,594.30 | 30,077.20 |
| క్రీడలు, యువజన సర్వీసులు | 103.01 | 140.48 |
| సాంకేతిక విద్య | 370.46 | 413.50 |
| కళలు, సాంస్కృతిక | 19.07 | 20.67 |
| వైద్యం | 13,702.82 | 15,384.26 |
| నీటి సరఫరా, పారిశుద్ధ్యం | 2,539.34 | 2,133.63 |
| గృహనిర్మాణం | 3,786.47 | 4,791.69 |
| పట్టణాభివృద్ధి | 8,055.25 | 8,796.33 |
| సమాచార, పౌర సంబంధాలు | 239.95 | 261.65 |
| సంక్షేమం | 25,613.44 | 45,955.07 |
| కార్మిక, ఉపాధి కల్పన | 832.36 | 1033.86 |
| సామాజిక భద్రత, సంక్షేమం | 3,262.81 | 4,331.85 |
| సాధారణ సేవలు | 66,854.47 | 73,609.63 |
| మొత్తం | 2,08,106.57 | 2,56,256.56 |

## కొన్ని పథకాలు, ఉప ప్రణాళికలకు కేటాయింపులు (రూ. కోట్లలో)

| పథకం | నిధుల కేటాయింపు |
|---|---|
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 18,000 |
| వైఎస్సార్ ఆసరా | 6,400 |
| వైఎస్సార్ చేయూత | 4,235.95 |
| అమ్మ ఒడి | 6,500 |
| ఎస్సీ ఉప ప్రణాళిక | 8,518 |
| ఎస్టీ ఉప ప్రణాళిక | 6,145 |
| బీసీ ఉప ప్రణాళిక | 29,143 |
| మైనారిటీ ఉప ప్రణాళిక | 3,662 |
| స్కూళ్లలో నాడు-నేడు | 3,500 |
| ఆస్పత్రుల్లో నాడు-నేడు | 2,848 |
| స్వయం సహాయక బృందాలకు | 800 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాలు | |
| రైతులకు సున్నా వడ్డీ రుణాలు | 500 |
| రైతుభరోసా | 3,900 |
| జగనన్న విద్యాదీవెన | 2,500 |
| వైఎస్సార్ కాపునేస్తం | 500 |
| వైఎస్సార్ జగనన్న చేదోడు | 300 |
| వైఎస్సార్ వాహనమిత్ర | 260 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 199.99 |
| వైఎస్సార్ మత్స్యకార భరోసా | 120.49 |
| ఈబీసీ నేస్తం | 590 |

## వ్యవసాయ బడ్జెట్ రూ.43,053 కోట్లు

2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ.43,052.78 కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో వ్యవసాయ మంత్రి కురసాల కన్నబాబు ప్రవేశపెట్టారు. "ఉపాధి హామీతో వ్యవసాయాన్ని అనుసంధానం చేయటానికి రూ.8,329 కోట్లు ప్రతిపాదించాం. రాష్ట్రంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలకు దశలవారీగా 10 వేల డ్రోన్లను రాయితీపై సరఫరా చేస్తాం. వాటి నిర్వహణకు 20 వేల మంది గ్రామీణ యువతకు శిక్షణనిస్తాం. ఆర్గానిక్, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రూ.200 కోట్లు వెచ్చిస్తాం. 41,304 యూనిట్ల గొర్రెలు, మేకల కొనుగోలుకు రూ.309.78 కోట్లు ప్రతిపాదించాం. రూ.26.25 కోట్లతో 5,000 మినీ గోకులం షెడ్లను నిర్మిస్తాం. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఏర్పాటు చేయనున్న మత్స్య విశ్వవిద్యాలయంలో 2022-23 నుండి బోధన ప్రారంభిస్తాం. కొత్తగా 334 సహకార బ్యాంకులను ప్రారంభిస్తాం" అని మంత్రి తెలిపారు.

## ప్రధాన పథకాలకు కేటాయింపులు (రూ. కోట్లలో):

| పథకం | కేటాయింపు |
|---|---|
| రైతు భరోసా - పీఎం కిసాన్ | 7,020 |
| ఉపాధి హామీతో వ్యవసాయం సంధానం | 8,329 |
| వ్యవసాయ విద్యుత్తు రాయితీ | 5,000 |
| ప్రకృతి విపత్తుల సహాయ నిది | 2,000 |
| పంటల బీమా | 1802 |
| సున్నా వడ్డీ పంట రుణాలు | 500 |
| రాయితీ విత్తనాల సరఫరా | 200 |
| పొలంబడులు | 30 |
| సమగ్ర వ్యవసాయ పరీక్షా కేంద్రాలు | 50 |
| ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు | 20 |
| వైఎస్సార్ జలకళ | 50 |

## ఏపీ బడ్జెట్ 2022-23

**సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)**

**మొత్తం బడ్జెట్ - 2,56,256.56**

**రెవెన్యూ వ్యయం - 2,08,261.26**

**రెవెన్యూ ఆదాయం - 1,91,225.11**

**కేంద్ర పన్నుల్లో వాటా - 33,050**

**కేంద్ర గ్రాంట్లు - 56,033.00**

**రెవెన్యూ లోటు - 17,036.15**

**ద్రవ్య లోటు - 48,724.11**

## ఏడాదిలో 103 రోజులు ఓవర్ డ్రాఫ్టులోనే రాష్ట్రం: కాగ్

ఏపీ ప్రభుత్వం 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,10,509.12 కోట్లను చట్టసభల ఆమోదం లేకుండానే కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి ఖర్చు చేసిందని, ఇది రాజ్యాంగ ఉల్లంఘన అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) స్పష్టం చేసింది. 2014-15 నుండి 2019-20 మధ్య ఇలా చేసిన ఖర్చుకు ఇంకా శాసనసభ ఆమోదం పొందాల్సి ఉందనీ ప్రస్తావించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 48,284.31 కోట్లు ట్రెజరీ కోడ్, ట్రెజరీ విధానాలు పాటించకుండా సీఎఫ్ఎంఎస్‌లో ప్రత్యేక బిల్లుల ద్వారా చెల్లింపులు జరిపారని వెల్లడించింది. గత ఏడాదిలో 103 రోజులపాటు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం వినియోగించుకుంటే తప్ప రాష్ట్రం రోజు గడవని పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. రాష్ట్ర ఖజానాలో ఏ ఇతర ఆసరా లేకుండా కనీస నిల్వ నిధులున్నది ఏడాదిలో 34 రోజులు మాత్రమేనని స్పష్టం చేసింది. 2020-21లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కాగ్ రూపొందించిన లెక్కలను ప్రభుత్వం శాసనసభ ముందుంచింది.

- భారీ, మెగా పరిశ్రమలకు చెల్లించాల్సిన ప్రోత్సాహకాల బకాయిలకు రూ. 411.62 కోట్లు కేటాయించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాల బకాయిలకు రూ. 450 కోట్లు ప్రతిపాదించారు. గతేడాది రాష్ట్రంలో 7,107 ఎంఎస్ఎంఈల ఏర్పాటు ద్వారా రూ. 2,099 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు ఆర్థిక సంఘం గ్రాంట్ రూపంలో రూ. 2,233 కోట్లు ప్రతిపాదించారు.
- పోలవరం ప్రాజెక్టును 2023 నాటికి పూర్తి చేస్తామని చెబుతున్న ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 4,163 కోట్లు ప్రతిపాదించింది. వెలిగొండకు రూ. 856.15 కోట్లు, గాలేరు నగరికి రూ. 438.05 కోట్లు, తెలుగుగంగకు రూ. 540.23 కోట్లు కేటాయించింది.
- కొత్త రైల్వే ప్రాజెక్టు పనులకు రాష్ట్ర వాటా కింద రూ. 50 కోట్లు కేటాయించారు (రైల్వే శాఖ రూ. 1998 కోట్లు కోరింది).
- మచిలీపట్నం ఓడరేవుకి రూ. 150 కోట్లు, భావనపాడు, రామాయపట్నం ఓడరేవులకు ఒక్కోదానికి రూ. 100 కోట్ల వంతున కేటాయించారు. ఇంతే మొత్తాల్ని గత బడ్జెట్‌లోనూ కేటాయించినా ఖర్చు చేయలేదు.
- విజయవాడ విమానాశ్రయం అభివృద్ధి పనులకు రూ. 5 కోట్లు, భూ వివాదాల పరిష్కారానికి రూ. 45 కోట్లు, తిరుపతి విమానాశ్రయం అభివృద్ధికి రూ. 2 కోట్లు, ప్రాంతీయ విమానాశ్రయాల్లో అభివృద్ధి పనులకు రూ. 30 కోట్లు, వాటిలో భూ సంబంధ వివాదాల పరిష్కారానికి రూ. 50 కోట్ల చొప్పున ప్రతిపాదించారు.
- నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించే పథకం మళ్లీ మొదలుకానుంది. ప్రతి ఎమ్మెల్యేకు రూ. 2 కోట్ల చొప్పున ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించారు. ✦

## సంక్షేమం పేరుతో సంక్షోభం

రాష్ట్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకి దూరంగా ఉందని, కీలక రంగాలను విస్మరించిందని, సంక్షేమం పేరుతో సంక్షోభాన్ని సృష్టించే బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ప్రవేశపెట్టారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. నవరత్నాలకు తప్ప ఎంతో అవసరమైన మౌలిక వసతుల్ని కూడా వదిలేశారన్నారు. విద్య, ఆరోగ్యాలలో ప్రమాణాల ఊసే లేదన్నారు. ప్రజలు పూటుగా తాగితే తప్ప రాష్ట్ర పరిపాలన నడిచే పరిస్థితి లేదన్నారు. లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానాన్ని అమలు చేస్తే నవరత్నాలన్నిటి కంటే మిన్నగా రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి ఉత్పాదకతను పెంచుతుందని బాబ్జీ అన్నారు.



# ICADR vs IAMC

**- పి.వి గోపాలకృష్ణ-**

ఏ రాయి అయితేనేం పళ్ళూడగొట్టుకుందుకు- అన్న సామెత నిజజీవితానికి అన్వయించుకుంటే- International Centre for Alternative Dispute Resolution (ICADR) - 1995లో సొసైటీ చట్టం కింద న్యూఢిల్లీ కేంద్రంగా ప్రారంభించబడిన సంస్థ. కోర్టులలో అపరిమితంగా పెరిగిపోతున్న అపరిష్కృత దావాలు న్యాయప్రక్రియ మీద అసాధారణ భారాన్ని మోపడం వల్ల, సత్వర న్యాయం దుస్సాధ్యమై పోతుండడం వల్ల, వివాద పరిష్కారాలకి ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించవలసిన బాధ్యత భారత ప్రభుత్వం మీద పడింది. ఆ అవసరాన్ని తగిన రీతిలో ఎదుర్కొనే నిమిత్తం ఈ స్వయంపాలిత (autonomous) సంస్థ కేంద్ర ప్రభుత్వ లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ప్రారంభించబడింది. ఈ సంస్థ రెండు ప్రాంతీయ శాఖలలో ఒకటి హైదరాబాద్‌లో 1998లో ప్రారంభమైంది. మరో శాఖ బెంగళూరులో ఉంది. ఆ శాఖలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో, సహాయంతో నిర్వహింపబడుతున్నాయి.

వ్యాపార సంబంధమైన, కుటుంబ సంబంధమైన విషయాలలో వ్యక్తుల మధ్య ఏర్పడే వివాదాల పరిష్కారానికి ఆర్బిట్రేషన్, మధ్యవర్తిత్వం విధానాలని అవలంబించే వీలు కల్పిస్తున్న చట్టాలు 1940 నుంచి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియలను సామాన్య జనానికి అందుబాటులోకి తెచ్చే వ్యవస్థలను ఏర్పాటు చెయ్యడంలో ప్రభుత్వాలు ఆసక్తి చూపించలేదు. అటువంటి అవసరం ఉందన్నది గుర్తించినా, చట్టం చేయడంతో తమ బాధ్యత తీరిపోయిందన్నట్టు మీనమేషాలు లెక్కబెడుతూ తాత్సారం చేస్తూ వచ్చేయి.

ఎవరి అవసరానికి తగిన విధంగా వారు మధ్యవర్తులను నియమించుకుని వివాదాలని పరిష్కరించుకునే సావకాశం చట్టాలలో కల్పించేం ఇక మీరు మీరు చూసుకోండి - తాంబూలాలిచ్చేసేం తన్నుకు చావండి - అన్నట్టు ప్రభుత్వాలు వ్యవహరించేయి. నిజానికి చట్టాన్ని దాని పని అది చేసుకోనిస్తే ప్రభుత్వాల ప్రమేయం నిజంగానే అనవసరం. కానీ మన దేశంలో రూల్ ఆఫ్ లా కి అవరోధాలు కలిగించే రీతిలో రకరకాల అనూహ్య పరిస్థితులు తలెత్తగలవు. అటువంటి పరిస్థితులు అడ్డం పడడంతో మధ్యవర్తిత్వ ప్రక్రియ అనుకున్న విధంగా పుంజుకోలేదు. తద్వార సాధించాలనుకున్న లక్ష్యం నెరవేరలేదు. మధ్యవర్తిత్వం ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థగా మనం అంగీకరించి అనుసరించి ఉంటే న్యాయస్థానాలలో అపరిష్కృత వ్యాజ్యాలు కోట్ల సంఖ్యలో పేరుకుపోయుండేవి కావు.

ఆర్బిట్రేషన్, మీడియేషన్, కన్సిలియేషన్ విధానాలు వివాద పరిష్కారాలకనువైన ప్రత్యామ్నాయాలుగా జనం ఎందువల్ల అంగీకరించడం లేదు? అనుసరించడం లేదు?

సత్యం, ధర్మం, న్యాయం సమాజాన్ని సన్మార్గంలో నడిపిన రోజుల్లో, ప్రజలు మాట మీద నిలబడినంత కాలం, మన దేశంలో వివాదాలు ఉన్న ఊళ్లో కుటుంబ పెద్దల, ఊరి పెద్దల మధ్యవర్తిత్వంతో రెండు వర్గాల ఆమోదంతో సమసిపోయేవి. కానీ బ్రిటీషువారి రాకతో ప్రజా జీవితంలో వివాద పరిష్కారాలకి కొత్తగా పుట్టుకొచ్చిన కోర్ట్ వ్యవస్థలో నీతి, నిజాయితీ స్థానంలో చట్టబద్ధత ప్రముఖంగా మారడంతో న్యాయ, ధర్మ నిరూపణలో చట్టబద్ధతే కొలబద్దగా మారింది. జనం ఉన్న ఊరొదిలి పై ఊళ్లలో న్యాయం కోసం, ధర్మం కోసం వెదుక్కోవలసి వచ్చింది. ఈ వ్యవస్థ వివాదాల మీద బతికే పరాన్నభుక్కులైన లిటిగెంట్లని తయారుచేసింది.

క్రమంగా వర్తక, వ్యాపార, వాణిజ్య వర్గాలు మధ్యవర్తిత్వాన్ని వివాద పరిష్కార ప్రత్యామ్నాయ మార్గంగా ఇప్పటికైనా తెలుసుకున్నాయి. ఆర్బిట్రేషన్ చట్టం పుట్టిన ఎనభై ఏళ్ళకి. శ్రీ కోర్ట్ వారు కూడా గత నలభై ఏళ్ళలో భారత ప్రధాన న్యాయమూర్తులుగా మారిన అందరూ, అనుభవపూర్వకంగా తత్వం బోధపడి, కోర్టులకు రావడం ఆపండి మహాప్రభో అని ఉద్బోధించడం అలవాటు చేసుకున్నారు. కోర్టులకన్నా, ADR- ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాల - వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో జనం త్వరగా, ఎంత బాగా తెలుసుకుంటే తమ పని అంత సులువవుతుందన్న గ్రహింపుకొచ్చేరు. ఆ దృష్ట్యా వివాద పరిష్కారాల కోసం మధ్యేమార్గంగా లోక్ అదాలత్‌లని సృష్టించేరు. అందుకోసం శాసన వ్యవస్థ అనువైన లీగల్ సర్వీసెస్ చట్టాన్ని చెయ్యడం మాత్రమే కాక, ఆర్బిట్రేషన్ చట్టంలో కూడా మార్పులు తెచ్చింది. కమర్షియల్ కోర్టుల చట్టాన్ని రూపొందించింది. కాలం చెల్లిన తరవాత అందిన న్యాయం అన్యాయంతో సమానమౌతుందన్న జ్ఞానం అనుభవంతో తెలుసుకున్న వర్తక, వ్యాపార, వాణిజ్య వర్గాలు, అనంతంగా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలలో వృథా అయ్యే సమయం, డబ్బు ఆదా చేసుకోవలసిన అగత్యాన్ని కూడా గుర్తించడం వల్ల మధ్యవర్తిత్వాన్ని ప్రత్యామ్నాయ మార్గంగా ఒప్పుకోవలసి వచ్చింది. దానికి అనుగుణంగా వ్యాపార మండళ్ళు, సమాఖ్యలు మధ్యవర్తిత్వ వ్యవస్థని తయారు చేసుకున్నాయి.

కుటుంబ వివాదాల పరిష్కారాల విషయంలోనే ప్రత్యామ్నాయ విధానం అవసరం ఎక్కువగా ఉన్నా, దాని సద్వినియోగం మీద ఎవరికీ దృష్టి లేదు. త్వరితగతిని, తక్కువ ఖర్చుతో వివాదాలు పరిష్కరించుకునే అవకాశమే ప్రత్నామ్నాయ విధానం గొప్పతనంగా ఆ విధానానికి అనుకూలంగా ఉన్నవాళ్ళందరూ చెబుతున్నా, ఆ విధానాన్ని కార్యరూపంలో అమలు చేయలేకపోడానికి ప్రధాన కారణం ఏమిటి?

కోర్టు విధానానికి ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వానికి న్యాయవాద వృత్తి తగిన సహకారం అందించకపోవడం ఒకటి. సామాన్య ప్రజానీకంలో పాతుకుని ఉన్న భ్రమలు పోగొట్టడం న్యాయవాదుల కనీస బాధ్యత. కానీ ఆ భ్రమలు పోగొట్టకపోగ మరింతగా కోర్టుల మీదే ఆధారపడే మనస్తత్వానికి దోహదం చేసే విధంగా న్యాయవాదుల ప్రవర్తన కూడా ఒక కారణం అన్నది న్యాయవాదులే గుర్తించుకోపోడం మరోటి. సమస్యల పరిష్కారానికి, వివాదాల పరిష్కారానికి కోర్టులు తప్ప గత్యంతరం లేదనుకోడానికి, ఎంత జాప్యం జరిగినా కోర్టుల చుట్టూ తిరగడం తప్ప మరో దారి లేదని సామాన్య ప్రజానీకం భావించడానికి కారణం న్యాయవాద వృత్తి. న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాన్ని, సత్వర పరిష్కారాల మీద కన్నా, ప్రస్తుత పరిస్థితుల్లో అనివార్యమైన జాప్యాన్ని అలుసుగా తీసుకుని, కక్షిదారులకు తాత్కాలిక ఉపశమనం కల్పించడానికి వినియోగించడం ప్రధాన కారణం. కోర్టులు న్యాయాలయాలుగా కాక, వివాదాల్లో ఉన్న ఇద్దరు బలాబలాలు తేల్చుకునే వేదికలయ్యాయి. Approach the court to seek justice. Seek

not vengeance అన్న ఆలోచనాధోరణి సామాన్య ప్రజలలో పెంచడంలో న్యాయవాద వృత్తి విఫలం చెందింది.

వ్యాపార, వాణిజ్య, వర్తక వర్గాల్లో కోర్టు విధానానికి విరుద్ధమైన అవగాహన అలవడింది. లాభకరమైన వ్యాపార నిర్వహణ అన్న వారి లక్ష్యానికి అనుగుణ్యమైన విధానాలను వారు సహజంగానే అనుసరించడం అలవాటు చేసుకుంటున్నారు. సమయం, డబ్బు రెంటినీ ఆదా చేస్తూ వివాదాలను ప్రత్యామ్నాయ విధానాలతో పరిష్కరించుకోవలసిన అవసరం లాభాపేక్షతో కూడిన వ్యాపార సంబంధాలలోనే కాక అన్ని రకాల వివాదాల పరిష్కారాలలోను అనుసరించవలసిన సూత్రం అన్నది అందరూ గుర్తించాలి. భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భగవతి పదవీ స్వీకారం చేసిన నాటి నుంచి ఈనాటి వరకూ, అత్యున్నత న్యాయస్థానం ఆ అవగాహన కలిగించడానికి కృషి చేస్తున్నా ఆశించిన లక్ష్యాన్ని చేరుకునేంతగా లేదన్నది నిజం.



International Centre for Alternate Dispute Resolution అన్న సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ వనరులతో స్వయంపాలిత సంస్థ ఇంకా చేయవలసినది, చేయగలిగినది అలాగే ఉండగా, ఈనాటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి రమణ గారి కలల పంటగా మరో సంస్థ International Arbitration and Mediation Centre కి నేనంటే నేనంటూ పునాదులు వేయడానికి ప్రభుత్వాలు తోసుకురావటం చూశాం. ప్రస్తుతం కోర్టులు, ప్రభుత్వం కూడా వ్యాపార వివాదాల సత్వర పరిష్కారమే ముఖ్యమైన విషయంగా భావిస్తుండడం దానికి తగిన ప్రత్యామ్నాయాలనే అన్వేషిస్తున్నట్టు మనం గమనించగలం.

ICADRఅయినా IAMCఅయినా సామాన్య ప్రజానీకానికి పళ్ళూడగొట్టుకునే సాధనాలే. కుటుంబ వివాదాలైనా, వర్తక వాణిజ్య వివాదాలైనా, ICADR వసూలు చేసే ఫీజు రెండు రకాలుగా ఉంటుంది. వివాదంలో ఉన్న విషయం, అది ఆస్తి గాని లేదా హక్కు గానీ, డబ్బు రూపంలో విలువ కట్టగలిగినప్పుడు, కట్టలేనప్పుడు. ఆ ఫీజు రెండు రకాల సేవల కోసం. ఒకటి ఆర్బిట్రేషన్ ఫీజు. మరోటి అడ్మినిస్ట్రేటివ్ ఫీజు. ఉదాహరణకి 20 లక్షల విలువగలిగిన వివాదానికి ఆర్బిట్రేషన్ ఫీజు 97,500. అడ్మినిస్ట్రేటివ్ ఫీజు 48,750. అంటే రమారమి లక్షన్నర. సామాన్యుడు కోర్టు తప్ప గత్యంతరం లేదు అనుకోడానికి ఇది కూడా కారణమే. ఒక్కసారిగా అంత డబ్బు ఖర్చు పెట్టగలిగే స్తోమత లేక. ఏళ్ళ తరబడి కోర్టులలో నానేక తడిసి మోపిడై అంతకన్నా ఎక్కువే ఖర్చుపెట్టవలసి వచ్చినా అలా ఖర్చు పెట్టలేనివారు కొట్టుకుంటూ కాలక్షేపం చేయడానికే మొగ్గు చూపుతుంటారు. కింది కోర్టు నుంచి పై కోర్టు ఇంకా పై కోర్టులలో సంపాదించుకున్న (అ)న్యాయాన్ని తలచుకుంటూ ఇంటికొచ్చేక ఏడుస్తూ ఉండలేక.

అంతేకాక, మధ్యవర్తిత్వం ద్వారా వివాదం పరిష్కరించండి మహాప్రభో అని వివాదంలో ఉన్న రెండు పక్షాలు కలిసి కోరుకుంటే తప్ప, ఒక్కరు కోరుకున్నంత మాత్రాన ఆర్బిట్రేషన్‌కి గాని, మీడియేషన్‌కి గాని అవకాశం లేదు చట్టంలో. అంటే రెండు పార్టీలు ముందుగా మన సమస్యని మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుందాం అని ఒక అంగీకారానికి రావాలి. ఇద్దరి మధ్య రాజుకున్న వివాదంలో సహజంగానే అన్యాయం జరిగిందనుకున్న వాళ్ళే మధ్యవర్తిత్వానికి అనుకూలంగా ఉంటారు. రెండోవారు ఆ వివాదం మంటలో చలికాగుతూ ఆనందంగా ఉంటారు.

కుటుంబ వివాదాల పరిష్కారాల విషయంలో సంస్థాగతమైన సహాయ సహకారాలు అందించే కార్యక్రమం క్రియాశీలంగా మారేవరకూ వాటి ఉనికి వల్ల వివాదాల్లో కూరుకుపోయి ఉన్న జనసామాన్యానికి జరగగలిగే మంచి ఏదీ ఉండదు. ప్రత్యామ్నాయ మార్గంలో వివాదం, ముఖ్యంగా కుటుంబం విషయాలలో, పరిష్కారం కాలేదన్నది నిశ్చయం అయిన తరవాతే శ్రీ కోర్టు వారు ఏ వ్యాజ్యాన్నైనా పరిశీలించే విధంగా, అంటే ఫైల్ మీదకి తీసుకొనుట, నెంబర్ చేయుట లాంటి కోర్టు ప్రక్రియ ప్రారంభమవడానికి తగిన విధంగా సిపిసి లోను, న్యాయవాద వృత్తికి సంబంధించిన చట్టాలలోను మార్పులు చేసి, మధ్యవర్తిత్వం చట్టబద్ధంగా తప్పనిసరి చేస్తే తప్ప కోర్టులలో ప్రస్తుతం పీకలలోతున్న అపరిష్కృత కేసుల సంఖ్య నుంచి విముక్తి దొరకదు. న్యాయవాద వృత్తి క్రియాశీలంగా వ్యవహరించే దిశగా చట్టపరమైన మార్పులు వస్తే తప్ప ప్రత్యామ్నాయ విధానాల సత్ఫలితాలు సామాన్యులకి అందని మ్రానిపండే.

ముళ్ళపూడి వెంకటరమణగారి సంకలనం 'నవ్వితే నవ్వండి'లో ఓ జోక్– డాక్టర్ గారి అబ్బాయి డాక్టరీ చదివి ప్రాక్టీసు ఆరంభించాడు. ఒకసారి తండ్రి వూరికెళ్ళి తిరిగి రాగానే విశేషాలు చెబుతూ, "నాన్నా, ఆ శాస్త్రిగారి కడుపునొప్పి కేసు లేదూ... నువ్వు ఏడేళ్ళ నుంచి ట్రీట్ చేస్తున్నావు, అది మొన్న ఒక్క ఆపరేషన్‌తో పూర్తిగా నయం చేసి పారేశాను" అన్నాడు ఉత్సాహంగా. తండ్రి గాఢంగా నిట్టూర్చాడు. "ఎంత పనిచేశావు. నిన్ను డాక్టర్ చదివించింది ఆ కేసుతోనే, డిస్పెన్సరీ బిల్డింగు కూడా కట్టించాలని ఆశ పెట్టుకున్నా దాని మీద" అన్నాడు. వాస్తు పేరుతో కట్టిన కట్టడాలన్నీ తిరగదోసి కట్టడానికి తగిన ఇంజినీర్లు, అక్కర్లేని టాక్సులు టాక్స్ ప్లానింగంటూ 'కట్టించుకునే' 'మూర్తి' లాంటి ఆడిటర్లు 'రెడీ'గా ఉండొచ్చు. కానీ ఇవన్నీ నవ్వులాట కోసం. నిజజీవితాలను ఇబ్బందిపెట్టని, ఒకసారి నవ్వుకుని పట్టించుకోనక్కర్లేని విషయాలు.

నిజజీవితంలో ఏళ్ళ తరబడి వాయిదాలకి కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడం, కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాల్లో న్యాయం కోసం ఒక తరం గడచిపోయి మరో తరం కూడా వేచి చూస్తూండడం నవ్వులాట వ్యవహారం కాదు. పట్టించుకోకుండా వదిలేయగలిగినదీ కాదు. న్యాయప్రక్రియలో ప్రస్తుతం అనివార్యమైన జాప్యాన్ని ఆసరా చేసుకొని సత్వర న్యాయం అందకుండా చేయడమే పరమధ్యేయంగా కొందరు వ్యవహరిస్తే, కాలం చెల్లిన న్యాయం అన్యాయంగా మిగులుతుంది. అటువంటి (అ)న్యాయం పొందినవారికి గడచిపోయిన కాలం, కోర్టులలో ఆ వ్యాజ్యాన్ని పెంచిపోషించడానికైన ఖర్చూ, తడిసిమోపెడైన అప్పులే కళ్ళ ముందు కదులుతూ ఉంటాయి. గుదిబండలుగా మిగులుతాయి. న్యాయప్రక్రియ వల్లే జాప్యం అయినా, మా తప్పేం లేదు, చట్టబద్ధంగానే వ్యవహరించామని న్యాయవాదులు భావించినా, క్లయింట్లకి అందని మ్రాని పండు అందిన ఆనందం మిగలదు.

ఇంతకీ ICADR కి Ex Officio Chairperson ఎవరంటే, IAMC కోసం కలలుగన్న ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ నూతలపాటి వెంకట రమణగారే.

# రష్యా యుద్ధం - ప్రజాస్వామ్యం - మనం



కలలు కనండి.. మాజీ రాష్ట్రపతి డా॥ ఏపీజే అబ్దుల్ కలాం ఇచ్చిన ఈ పిలుపు చాలామందిని కదిలించింది. ఈవేళ్టికి కూడా పలు పాఠశాలల్లో ఈ పిలుపు ఓ కొటేషన్‌లా రాసి ఉంటుంది. అయితే కలలు కనేటప్పుడు కూడా వాస్తవ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకోవటం మేలని ఆమధ్య ఓ ఆంగ్ల రచయిత విశ్లేషించారు. భ్రమాజనిత కలలు ప్రమాదకరమని హెచ్చరించారు. నేల విడిచి సాము చేయవద్దు, కీడెంచి మేలెంచాలి వంటి మన పెద్దల సుద్దులు ఆ రచయిత సూచనలో కనిపిస్తాయి. కలలు కనటమే కాదు, కార్యాచరణకు ఉపక్రమించే ముందు వాటి సాధ్యాసాధ్యాలను కూడా పరిగణలోకి తీసుకోవాలన్న సూచన ఎంత విలువైనదో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని చూస్తే బాగా అర్థమవుతుంది.

పూర్వపు సోవియెట్ యూనియన్‌లో ఉన్న దేశాలన్నిటినీ ఇప్పుడున్న రష్యాలో కలుపుకోవాలని, అఖండ రష్యాని నిర్మించాలని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కంటున్న కల పర్యవసానాలేమిటో స్పష్టంగా తెలియటానికి కొంతకాలం పట్టవచ్చు. కానీ అమెరికా, ఐరోపా సమాఖ్య, నాటో కూటమి దేశాల అండతో రష్యాను ఎదుర్కోగలనని, ఉక్రెయిన్‌ను సర్వసత్తాక దేశంగా శక్తిమంతం చేయటంలో అన్ని రకాలుగా అది పెద్ద వ్యూహాత్మక విజయమవుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కన్న కల మాత్రం దారుణ పర్యవసానాలకు దారితీసిందని ఇప్పటికే పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఏ యుద్ధమైనా భయంకరమైనదే. అందులో ఆధునిక కాలంలో. ఐన్‌స్టీన్ మహాశయుడు అన్నట్లు, నాలుగో ప్రపంచ యుద్ధమంటూ వస్తే మనుషులు కర్రలతోనే కొట్టుకుంటారు. ఒకప్పుడు సోవియెట్ యూనియన్‌లో భాగంగా ఉన్న కొన్ని ఇతర దేశాల్లాగా ఉక్రెయిన్ కూడా నాటో సభ్యత్వం తీసుకుంటే తమ ఉనికికే ప్రమాదమని రష్యా అధ్యక్షుడు పుతిన్ వాదిస్తున్నారు. రష్యా తమను ఆక్రమించుకుంటుందన్న భయం వల్లే తాము నాటో సభ్యత్వం కోరుతున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు వాదిస్తున్నారు. వాస్తవం సుస్పష్టం. క్రిమియాను రష్యా ఆక్రమించుకున్నప్పుడే ఉక్రెయిన్ భయం కరెక్టని తేలిపోయింది. అందువల్ల ఉక్రెయిన్‌పై రష్యా ప్రకటించిన తాజా సైనిక చర్యను దురాక్రమణ అని చెప్పటానికి ఏ మాత్రం సంకోచించనక్కర్లేదు. అలాగని రష్యా అభ్యంతరాలనూ గంపగుత్తగా తోసిపుచ్చనక్కర్లేదు. నాటో తన పక్కనే తిష్టవేస్తుందన్న రష్యా అనుమానం ఊహాజనితమైనా సరే. అయితే ఆ సమస్యను ఉక్రెయిన్ సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ పరిష్కరించుకోవాలి తప్ప దురాక్రమణకు పాల్పడటం సహించరానిది. ఈ యుద్ధం వల్ల కొన్ని వారాల్లోనే ఉక్రెయిన్ జనాభాలో నాలుగో వంతుకు పైగా శరణార్థులయ్యారని, పొరుగు దేశాలకు వలస వెళ్లారని, వారిలో పిల్లలు నలభై లక్షల దాకా ఉంటారని అంచనా. ఈ సంఖ్య పెరుగుతోంది. వీరి భవిష్యత్తు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నెమ్మదిగా యుద్ధ వాతావరణం చల్లారినా, యుద్ధం చేసిన గాయాలు మానటం అంత సులభం కాదు. వేల మంది సైనికులు, పలువురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అత్యాచారాలు, పెద్దఎత్తున మౌలిక వసతుల విధ్వంసం చోటుచేసుకున్నాయి. అటు రష్యాలోనూ సామాన్య ప్రజలు కడగండ్ల పాలయ్యారు. రష్యాతో యుద్ధం చేసి దీటుగా నిలబడటంలోని మజా, ప్రయోజనాల గురించి కల కన్నప్పుడే జెలెన్‌స్కీ భ్రమలు, తెంపరితనం లేకుండా ఆలోచించి ఉంటే, కీడెంచి మేలెంచి ఉంటే కచ్చితంగా ఆయన అడుగులు భిన్నంగా ఉండేవి. పర్యవసానాల గురించిన వాస్తవాలకు ప్రాధాన్యం ఇచ్చి ఉంటే, ఆయన తన కలకన్నా భయాందోళనకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. ఎంతో నష్టాన్ని నివారించి ఉండేవారు. పుతిన్ కూడా అఖండ రష్యా సాధన కోసం కన్న కల గురించి పలు ఎత్తుగడలు, సమీకరణాలు వేసుకున్నప్పటికీ ఆచరణసాధ్యతను బేరీజు వేసుకుని ఉంటే, తాత్కాలికంగా తాను నెగ్గినా చరిత్రహీనుడినవుతానని భయపడి ఉంటే.. రష్యాకు, ఇతర ప్రపంచానికి జరిగిన అపార నష్టాన్ని నివారించి ఉండేవారు. భ్రమాజనిత కలలో తేలియాడకుండా కీడెంచి మేలెంచి ఉంటే, పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ అమెరికా, చైనా మధ్య పవర్‌గేమ్‌లో అలా చిక్కుకుపోయేవారు కాదు.

సోషల్ మీడియా వచ్చాక మనందరం కూడా కలల్లో మునిగితేలుతున్నాం. వీటిలో చాలావరకు మంచివి, నిరపాయకరమైనవి కావచ్చు. కానీ కొన్ని ప్రమాదకరమైనవి కూడా ఉంటున్నాయి. ముఖ్యంగా సమాజంతో మనకుండే సంబంధాల విషయంలో. ప్రజాస్వామ్యం కంటే నియంతృత్వం మేలు, నియంత నాయకుడయితేనే చైనాలాగా మన దేశం బాగుపడుతుంది వంటి అపోహల చుట్టూ కలల్ని ప్రచారం చేస్తున్నాము. చట్టబద్ధపాలన పాటించేవారి కంటే గూండాగిరి చేసేవాళ్లు హీరోలు, ఎంత భౌతిక హింసకు పాల్పడితే అంత హీరోయిజం, యుద్ధం ఒక వినోద క్రీడ, యుద్ధం ఒక పవిత్ర కార్యం వంటి ధోరణుల్ని ఆమోదిస్తున్నాం, నమ్ముతున్నాం, విలువలుగా మార్చుకుంటున్నాం. పుతిన్ అనే ఒక నియంత ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతతో, గతం పట్ల పిచ్చితో ఎంత ప్రమాదకరంగా వ్యవహరించాడో, అణ్వస్త్రాలతో ఎంతకు బరితెగించాడో ఇప్పుడు కళ్లారా చూశాం. పర్యవసానాల్ని అనుభవిస్తున్నాం. అంతర్జాతీయ కట్టుబాట్లను, సంయమన పద్ధతుల్ని పుతిన్ కుదిపేశారు. దీని పరిణామాలు దీర్ఘకాలం ఉండబోతున్నాయి. పలు ప్రజాస్వామ్య దేశాల మనుగడను సవాలు చేయనున్నాయి.

యుద్ధ బాధితుల కష్టాల్ని చూశాక, మన చుట్టూ కూడా సెగ తాకాక ఈ పరిణామాల్ని ఎంతో కొంత అర్థం చేసుకున్నామని సోషల్ మీడియాలో స్పందనలు సంకేతమిస్తున్నాయి. భ్రమాజనిత, తెంపరి కలల్ని అదుపు చేసుకుంటూ యుద్ధ వ్యతిరేకత బలంగా వినిపిస్తుండటం మంచి పరిణామం. ఇది తాత్కాలిక ఉద్వేగం కాకుండా, దీర్ఘకాలిక అవగాహనగా మారాలి. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ మన దేశాభివృద్ధిని సాధించటానికి ఎలా అడుగులు వేయాలో, ఎలాంటి వ్యవస్థల్ని నిర్మాణం చేసుకోవాలో స్పష్టతతో వ్యవహరించాలి. రాజ్యం మానవ నిర్మితం. ప్రకృతిపరంగా వచ్చే సహజాతంలా రాజ్య వ్యవస్థ నిర్మాణం, కార్యకలాపాలు ఉండటం కష్టం. ప్రజాస్వామ్యం దానంటదే మనుగడ సాగించదు. అందుకు మానవ ప్రయత్నం కూడా కావాలి. మనలో ప్రతి ఒక్కరూ మన వంతు బాధ్యత తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకోవాలి. ప్రకృతి సహజమైన ఆనందమయ జీవితాన్ని గడపటానికి ఒక సామాజిక, రాజకీయ వ్యవస్థను ప్రజాస్వామ్యయుతంగా నిర్మించుకునే తెలివితేటల్ని కూడా ప్రకృతి మనకు ఇచ్చింది. హేతుబద్ధంగా, తర్కబద్ధంగా, ఇతర దేశాల, మన సొంత అనుభవాలను పరిగణలోకి తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసుకోవాలి, మన అభివృద్ధికి, మెరుగైన భవిష్యత్ భారతానికీ తగిన నిర్మాణం చేసుకోవాలి.

## కావలసింది కొత్త మెడికల్ కాలేజీలు కాదు..

# ప్రజలందరికీ 'జేబుఖర్చులేని నాణ్యమైన వైద్యం'




ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించటానికి కావలసిన పట్టభద్రులైన వైద్యులు మనకు అవసరానికి మించి ఉన్నా ఇంకా డాక్టర్లు కావాలని ప్రభుత్వాలు మూర్ఖపు వాదన, హడావుడి చేస్తున్నాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కావలసింది కొత్త వైద్య కళాశాలలు కాదు, ప్రజలందరికీ జేబుఖర్చులేని వైద్యం అని స్పష్టం చేశారు. తెలంగాణ వైద్యులు, వైద్య విద్యార్థులు, డాక్టర్ల సంఘాలు, నర్సింగ్ తదితర అసోసియేషన్లు హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజారోగ్య పరిరక్షణ సభలో జేపీ మాట్లాడారు. మన దేశంలో వైద్యానికి చేస్తున్న ఖర్చు మిగిలిన దేశాలతో పోలిస్తే అతి తక్కువని, ఈ డబ్బును కూడా సరైన రీతిలో ఖర్చు చేయటం లేదని ఆయన అన్నారు. వైద్య ఆరోగ్య విధానంలో ప్రభుత్వం విఫలమవటం వల్లే డాక్టర్ల మీద దాడులు జరుగుతున్నాయని, నకిలీ వైద్యులు పెద్దసంఖ్యలో కొనసాగుతున్నారన్నారు. ప్రభుత్వాలు కొద్దిపాటి అదనపు మొత్తాన్ని ఆరోగ్య రంగానికి కేటాయిస్తే ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని భారం లేకుండా అందుబాటులోకి తేవచ్చన్నారు. ప్రాథమిక స్థాయిలో ప్రజలకు మొట్టమొదటి సంప్రదింపు కేంద్రంగా ఫ్యామిలీ డాక్టర్ ఉండే వ్యవస్థను లోక్‌సత్తా ప్రతిపాదించిందని, వైద్య పరీక్షలు, మందులు, అవసరమైతే పైస్థాయిలో ఆస్పత్రికి సిఫార్సు వంటివన్నీ ఆ ఫ్యామిలీ డాక్టరే చూసుకుంటారన్నారు. ఎంతమంది రోగులు నమోదు చేసుకుంటే అంత ఆదాయం ఆ డాక్టర్‌కు లభిస్తుందని, దీనివల్ల ప్రజలకు తొలిదశలోనే మంచి వైద్యంతోపాటు డాక్టర్లకు కూడా ఆకర్షణీయ ఆదాయం సమకూరుతుందన్నారు. ఇలా అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు, వైద్యులకు ఉపయోగపడే వ్యవస్థను నిర్మించకుండా ప్రభుత్వమే పేదరికాన్ని, ప్రజలకు కష్టాన్ని పెంచుతోందని, ఇలాంటి రాజకీయానికి చాలా తెలివితేటలు కావాలన్నారు. డాక్టర్లు వెళ్లటానికి, పనిచేయటానికి ఇష్టపడని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనే అన్ని సేవలకూ వినియోగించాలంటే ఆరోగ్య రంగంలో సంక్షోభం పెరగటం తప్ప తగ్గదని, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ అవసరమన్నారు. మధ్యస్థాయి వైద్యంలో ఆరోగ్యశ్రీని, చిన్న నర్సింగ్ హోంలను ఉపయోగించుకోవచ్చన్నారు. తృతీయ స్థాయిలో ప్రయివేటు నిపుణులు కూడా కన్సల్టెంట్లుగా వచ్చి సేవలందించేలా ప్రభుత్వాసుపత్రులను మెరుగుపరచాలన్నారు. ప్రయివేటు వైద్యానికి లోక్‌సత్తా విధానం వ్యతిరేకం కాదని, అది యధాతథంగానే కొనసాగుతుందన్నారు. విదేశాల నుండి వచ్చే రోగుల నుండి మన దేశానికి వచ్చే ఆదాయం వేగంగా పెరుగుతూ లక్షల కోట్లకు చేరుతోందని, మనం ఆలోచించాల్సింది మన దేశంలో కోట్లాది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని ఆర్థిక భారం లేకుండా అందించటమన్నారు. లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం నూరుశాతం ఆ లక్ష్యాన్ని సాధించగలదన్నారు. ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆరోగ్య విధానం అమలుకు అందరూ సహకరించాలని, ప్రజారోగ్యం అమలుని వైద్యులు పట్టించుకుంటేనే ప్రజల మద్దతు పొందగలరని జేపీ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఆరోగ్యమంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఐఎంఏ అధ్యక్షుడు సంపత్‌రావు, డాక్టర్స్ ఫోరం, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అశోక్ రెడ్డి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జులై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



పోటీ వల్ల నాణ్యమైన సేవలు అందుతున్నా అర్థం లేని కారణాలతో వైద్య సంప్రదింపుల కోసం రావటాన్ని నిలువరించేందుకు, మరోవైపు ఎక్కువ పారితోషికం కోసం అంకెలను పెంచి చూపటాన్ని నిరోధించేందుకు అదనపు చర్యలు కావాలి. రోగి కూడా ఓ రూ.25 కన్సల్టేషన్ ఫీజు చెల్లించే పద్ధతిని ఏర్పాటు చేస్తే అనవసర సంప్రదింపుల్ని నియంత్రించవచ్చు. దీనివల్ల రోగికి కూడా నాణ్యమైన సేవలను డిమాండ్ చేసే అవకాశం, అందుకు ప్రోత్సాహకం లభిస్తుంది. అయితే, మన సమాజంలో ఇప్పటికీ కొనసాగుతున్న దుర్భర పేదరికం దృష్ట్యా, దబ్బులేనంత మాత్రాన ఏ రోగికీ డాక్టర్ సంప్రదింపును లేదా చికిత్సను నిరాకరించకూడదు. కాబట్టి, రోగి చెల్లించాల్సిన నామమాత్రపు మొత్తాన్ని కూడా మాఫీ చేసే విచక్షణాధికారం నిరుపేద రోగుల విషయంలో ఎఫ్.పికి ఉండాలి. మొత్తం రోగుల్లో 10 శాతం మేర వరకూ ఇలా మాఫీ చేయవచ్చు. అవకాశాలు అందని, పేదరికం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇంకా ఎక్కువమంది రోగులకు సహ చెల్లింపుల్ని మాఫీ చేయవచ్చు.

వీటితోపాటు, స్పష్టంగా నిర్వచించిన ప్రాతిపదికలతో ఎఫ్.పిలపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలి. సగటు సంప్రదింపు సమయం, రోగి సంతృప్తి, ఫలితాల సర్వేలు మొదలైనవి ప్రాతిపదికలు కావాలి. పర్యవేక్షణ స్థానికంగా కమ్యూనిటీ స్థాయిలో, ఉప-జిల్లా, జిల్లా స్థాయిల్లో ఉండాలి. ఇందుకోసం స్థానిక ప్రభుత్వాలు, ప్రజారోగ్య అధికారులు, ఆరోగ్య రంగంలో పేరుగాంచిన స్వచ్ఛంద సంస్థలు, మొదటి రెఫరల్ కేంద్రాల్లోని స్పెషలిస్టు వైద్యులు (ద్వితీయ స్థాయి వైద్యం), సంబంధిత ఇతరులు భాగస్వాములయ్యేలా సంస్థాగత ఏర్పాట్లు ఉండాలి.

ప్రభుత్వం ద్వారా పారితోషికం అందుకునే ప్రయివేటు ప్రాక్టీషనర్లుగా ఎఫ్.పిలందరూ సి.హెచ్.సి స్థాయిలో ప్రాంతీయ ఆరోగ్య బోర్డు సాధారణ పర్యవేక్షణలో ఉంటారు. జిల్లా ఆరోగ్య బోర్డు ఎఫ్.పితో ఒప్పందం కుదుర్చుకుని, నిధుల పంపిణీ బాధ్యతల్ని నిర్వర్తిస్తుంది. ప్రాథమిక వైద్యుల కూర్పులో భాగంగా 'సెంటర్'లో క్లినిక్‌లను ఏర్పాటు చేసుకోవటంలో ఎఫ్.పిలకు సహాయపడేలా ప్రారంభ పెట్టుబడి ఖర్చుల కోసం సులభ రుణాలనిచ్చే ఒక పథకాన్ని ప్రారంభించవచ్చు.

**4.2.2.5. వైద్యుల మధ్య రెఫరల్ వ్యవస్థ**

సుస్థిర ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ అంటే.. ఒక అనారోగ్యానికి ప్రభావవంతంగా, సమర్థవంతంగా, సకాలంలో, సరైన రీతిలో చికిత్స చేసేది. కాబట్టి, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ - మూడు స్థాయిల్లోని వైద్యుల మధ్య పైస్థాయి చికిత్సకు సిఫార్సు చేసే రెఫరల్ పద్ధతి ఉండటం ఎంతో కీలకం.

రెఫరల్ పద్ధతిని రోగి కచ్చితంగా పాటిస్తూ, ఏ రకమైన అనారోగ్యం లేదా ఆరోగ్య అవసరం కోసమైనా మొదటి అడుగుగా తమ ఎఫ్.పిని సంప్రదించాలి. అనారోగ్యం ఎఫ్.పి నయం చేయలేని రకమైతే, స్పెషలిస్ట్ లేదా శస్త్రచికిత్స అవసరమైతే, అతను/ఆమెను ద్వితీయ స్థాయి స్పెషలిస్ట్‌కో లేదా తృతీయ స్థాయి స్పెషలిస్ట్‌కో, ఆ వ్యాధి లక్షణాన్ని బట్టి ప్రభుత్వాస్పత్రికి ఎఫ్.పి రెఫర్ చేస్తారు. ఎఫ్.పి నుండి సిఫార్సు లేకుండా ఏ రోగి కూడా సాధారణంగా ద్వితీయ లేదా తృతీయ స్థాయి వైద్యాన్ని అందించే ప్రభుత్వాస్పత్రిని నేరుగా సంప్రదించకూడదు. ప్రాణాపాయ అత్యవసరాల్లో మాత్రం సకాలంలో, సరైన చికిత్స కోసం రోగులు రెఫరల్ లేకుండా కూడా సమీప ఆస్పత్రికి వెళ్తారు.

అటువంటి పకడ్బందీ రెఫరల్ వ్యవస్థ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. మొదటిది, ప్రతి అనారోగ్యానికీ తగినన్ని వనరులు, సరైన చికిత్స అందుతాయి. రెండోది, ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయగలిగిన వ్యాధులకు ద్వితీయ, తృతీయ స్థాయిల్లో అవుతున్న అదనపు వ్యయాల్ని తొలగించటం ద్వారా ఆరోగ్య సేవల సౌకర్యాలు ఖర్చుకు తగ్గ ఫలితాలనిస్తాయి. మూడోది, ఆస్పత్రిలో మితిమీరిన రద్దీని ఈ వ్యవస్థ తగ్గిస్తుంది. పడకల మీద ఒత్తిడి లేకుండా చేస్తుంది. తక్షణ చికిత్స అవసరమైన తీవ్ర అనారోగ్యాలపై ఎక్కువ సమయాన్ని వెచ్చించే వెసులుబాటు ఫిజిషియన్‌కి కలుగుతుంది. చివరిగా, స్వల్ప, సాధారణ అనారోగ్యాలకు ప్రస్తుతం ద్వితీయ లేదా తృతీయ స్థాయిల్లో చికిత్సకు చేస్తున్న అనవసర ఓ.ఓ.పి.ఇని తగ్గించటం ద్వారా రోగిపై ఆర్థిక భారాన్ని ఇది తొలగిస్తుంది.

**4.2.2.6. ఆరోగ్య రికార్డుల వ్యవస్థ**

మూడు స్థాయిల ఆరోగ్య సేవల మధ్య సిఫార్సులు, అనుసంధానాల మీద ఆధారపడిన ఆరోగ్య వ్యవస్థలో, వివిధ స్థాయిల మధ్య సమన్వయం తప్పనిసరి. వైద్యుల మధ్య సేవలు సజావుగా సాగటంలో సమగ్ర ఆరోగ్య రికార్డుల వ్యవస్థ ప్రాధాన్యతను జాతీయ ఆరోగ్య విధానం, 2017 కూడా గుర్తించింది. జాతీయస్థాయిలో సమగ్ర డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ లక్ష్య సాధనకు జాతీయ డిజిటల్ హెల్త్ మిషన్‌ని 2020లో ప్రారంభించారు. ఇది అందరికీ సురక్షితంగా, సకాలంలో, సమర్థవంతంగా, చౌకగా ఆరోగ్య సేవల్ని అందించేందుకు తోడ్పాటునిస్తుంది. ఈ మిషన్ కింద, ప్రతి వ్యక్తికీ ఒక ఆరోగ్య ఐ.డిని కేటాయిస్తారు. వారిని ప్రత్యేకంగా గుర్తించటం, వారి ఆరోగ్య రికార్డులను సంధానం చేసి, ఏకీకృతం చేయటానికి ఇది ఉపయోగపడుతుంది.

ఒక రోగి గత వైద్య చరిత్ర, ఆరోగ్య రికార్డులు వెంటనే ఫిజిషియన్‌కి అందుబాటులో ఉంటే, పొరపాట్లు దొర్లకుండా నివారించటానికి, త్వరితంగా, కచ్చితంగా రోగ నిర్ధారణ చేయటానికి, సకాలంలో సరైన చికిత్సకు అవకాశముంటుంది. ఆరోగ్య రికార్డుల వ్యవస్థ నిర్మాణానికి ఎఫ్.పి ఆధారిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ మంచి పునాదిగా ఉపయోగపడుతుంది. ఒక సమగ్రమయిన ఆరోగ్య సమాచార వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆవిష్కరించాలంటే, అనేక ఏళ్లు పడుతుంది, రాత్రికి రాత్రి అయ్యే పని కాదు. అమలుకు దశలవారీ పద్ధతిని అనుసరిస్తే, మౌలిక వసతులు క్రమంగా అభివృద్ధి చెందుతాయి.

దీంతోపాటు, ఒక ఫెడరల్ ఆరోగ్య పర్యవేక్షణ యంత్రాంగాన్ని (ఎఫ్.హెచ్.ఎం.ఎ)ను కూడా ఏర్పాటు చేయవచ్చు. ఇది ఐ.టి మౌలిక వసతులతో పనిచేసే అత్యున్నతస్థాయి పర్యవేక్షణ, నియంత్రణ అథారిటీ. అన్ని ఎఫ్.పి క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్ కేంద్రాలు, ఔషధ కేంద్రాలు, మందుల సరఫరా ఏజెన్సీల్ని ఈ కేంద్ర డేటాబేస్‌కి సంధానం చేయవచ్చు. ఎఫ్.హెచ్.ఎం.ఎ ఈ దిగువ బాధ్యతల్ని నిర్వర్తించవచ్చు:

1. వివిధ వర్గాల ప్రజల ఆరోగ్య స్థితిని మదింపు చేయటం.
2. మహమ్మారులపై డిజిటల్‌గా హెచ్చరికలు జారీ చేయటం.

3. క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్‌లు, మందుల డిస్పెన్సరీల్లో అసాధారణ ధోరణులు, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న అనుమానాలపై హెచ్చరికలు జారీ చేయవచ్చు.

4. విస్తృత స్థాయిలో అమలుకు ఉపయోగపడే వినూత్న, అత్యుత్తమ మార్గదర్శక పద్ధతులను డాక్యుమెంట్ చేయవచ్చు.

ఒక వ్యక్తి వైద్య చరిత్రకు సంబంధించిన డిజిటల్ సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశముంది కాబట్టి అటువంటి సమాచారాన్ని సురక్షితం చేసేందుకు, డేటా రక్షణకు, క్లినిక్‌ల మధ్య రోగి సమాచారాన్ని సురక్షితంగా బదిలీ చేసేందుకు జాతీయస్థాయి ప్రభుత్వం ఇప్పటికే ఒక చట్టాన్ని తెచ్చే ప్రక్రియను ప్రారంభించింది. సేకరించిన ఆరోగ్య సమాచారాన్ని పరిరక్షించేందుకు ఒక పటిష్ఠ ఏర్పాటుని అమల్లోకి తేవటం అత్యంత ప్రాధాన్యాంశం కావాలి.

**4.2.2.7. ప్రజారోగ్య సేవలను అనుసంధానం చేయటం**

కొన్ని నిర్దిష్ట ప్రజారోగ్య అవసరాలను మాత్రమే గుర్తించి వాటి మీద దృష్టి పెట్టే పద్ధతికి బదులుగా.. రోగికి సమగ్ర సేవల్ని అందించటంపై ప్రజారోగ్య సేవల వ్యవస్థ దృష్టి కేంద్రీకరించాలి. అదే విధంగా, ఇప్పుడున్న, భవిష్యత్తులో రానున్న ప్రజారోగ్య సేవలను ప్రాథమిక సంరక్షణ వ్యవస్థ, వైద్య చికిత్సల విభాగాలతో సమన్వయం చేయటం సమర్థవంతమైన ప్రజారోగ్య వ్యవస్థకు ఉండాల్సిన ప్రధాన లక్షణం. అది టీకాల కార్యక్రమం కావచ్చు, మాతా శిశు ఆరోగ్యం కావచ్చు, పౌష్టికాహారం కావచ్చు, నవజాత శిశువులకు పరీక్షలు చేయటం కావచ్చు. ఇలాంటివన్నిటినీ ఆ రకంగా సమన్వయపరచాలి. ఎఫ్.పి వ్యవస్థ ద్వారా రోగి కేంద్రిత సంరక్షణకు మళ్లటం వల్ల ప్రాథమిక ఆరోగ్యంలోని రెండు ప్రధాన అంశాలు – ప్రజారోగ్య సేవలు, ఔట్‌పేషెంట్ సేవలు – వీటిని సంధానం చేయటానికి అత్యుత్తమ వేదిక రూపొందుతుంది.

ఒక సమగ్ర విధానం వల్ల మొత్తం ప్రజానీకానికి మెరుగైన ఆరోగ్య ఫలితాలు అందుతాయి, ప్రతి రోగి నిర్దిష్ట వ్యక్తిగత అవసరాలు, పరిస్థితులకు కూడా తగినట్లు సేవలు అందుతాయి. కేవలం కొన్ని సవాళ్ల మీదే దృష్టి పెట్టి, ఒక మూసలో పనిచేయటం వల్ల రోగి ప్రతి అవసరాన్నీ పరిగణలోకి తీసుకునే అవకాశం లేకపోవటంతో, అది ఆరోగ్య సేవల్లో లోటుపాట్లకు దారితీస్తుంది. ఆ రకమైన ప్రయత్నాల కోసం పెద్దఎత్తున వనరుల్ని వినియోగించినా, తగిన ఫలితాలు రావు. మరోవైపు, ఎఫ్.పి నమూనాలో అన్ని ప్రజారోగ్య చర్యలనూ అనుసంధానం చేయటం వల్ల చేసిందే మళ్లీ వృధాగా చేయాల్సిన అవసరం లేకుండానే మెరుగైన ఫలితాలు లభిస్తాయి.

ఎఫ్.పి క్లినిక్‌లు స్థానిక ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రంతో, సమీపంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంతో సమన్వయంతో పనిచేస్తాయి. ప్రతి ఆరోగ్య కేంద్రం బాధ్యతలూ స్పష్టంగా విభజించబడి ఉంటాయి. ఎఫ్.పి రికార్డులను నిర్వహిస్తూ ఔట్‌పేషెంట్ సేవలను అందిస్తారు, ప్రజారోగ్య కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తారు. టీకాలు, గర్భిణుల పరీక్షలు, పౌష్టికాహార లోపాన్ని అంచనా వేయటం, అంటువ్యాధుల చికిత్స, దీర్ఘకాల వ్యాధుల నియంత్రణ చికిత్స వంటి ప్రాథమిక, నివారణ వైద్యాలను ఎఫ్.పి క్లినిక్‌ల వద్ద అందిస్తారు. పి.హెచ్.సి.. వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ సేవలు, క్షేత్రస్థాయి పర్యటనలు, వ్యాధులపై సర్వేలకు బాధ్యత వహిస్తుంది. పి.హెచ్.సిలలో శీతల నిల్వ కేంద్రాల గొలుసు, ఇతర మౌలిక సదుపాయాలు ఉంటాయి. వ్యాక్సిన్లను, కేంద్రీకృతంగా సేకరించిన ఔషధాలు, స్వల్పకాల పరిమితిలో వినియోగించాల్సిన వైద్య సరకులను ప్రాథమిక సంరక్షణ వ్యవస్థలో భాగమైన ఎఫ్‌పి వ్యవస్థకు, స్థానిక క్లినికల్ ల్యాబొరేటరీలకు, ఔషధ డిస్పెన్సరీలకు సరఫరా చేస్తాయి.

**4.2.2.8. రోగ నిర్ధారణ పరీక్షల (డయాగ్నోస్టిక్) సేవలు**

**4.2.2.8.1. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ-ప్రయివేటు-భాగస్వామ్య నమూనా**

అందరికీ ఆరోగ్యాన్ని అందించే ఏ ప్రయత్నమైనా నాణ్యమైన డయాగ్నోస్టిక్ సేవల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వాస్తవ ఫలితాల ఆధారంగా చికిత్సకు అవసరమైన హేతుబద్ధ నిర్ణయాలకు వైద్య సేవలు, డయాగ్నొస్టిక్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. తద్వారా, మొత్తంగా ఆరోగ్య సేవల ఫలితాల్ని పెంచుతాయి.

ప్రజారోగ్య వ్యవస్థలో రోగ నిర్ధారణ సేవల ప్రాధాన్యతని గుర్తించి జాతీయ స్థాయి ప్రభుత్వం 2015లో ఉచిత డయాగ్నోస్టిక్‌ల పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ సౌకర్యాల్లో వివిధ స్థాయిల్లో కొన్ని అత్యవసర డయాగ్నోస్టిక్‌లను ఉచితంగా అందించటం ఈ పథకం లక్ష్యం.

ఈ సేవల్ని మరింత మందికి అందుబాటులోకి తెచ్చేందుకు అనేక రాష్ట్రాలు యూనియన్ ప్రభుత్వ స్కీమ్ పరిధిలోనే భిన్నమైన నమూనాలను అనుసరించాయి. ఈ పథకం కింద ప్రభుత్వ వైద్య సదుపాయాల్లోని అన్ని స్థాయిల్లో ఉచిత డయాగ్నొస్టిక్‌లను అందించేందుకు దేశంలోనే మొదటగా ఒక హైబ్రిడ్ నమూనాను అమలు చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ప్రజలకు నాణ్యమైన డయాగ్నొస్టిక్ సేవలను సరమైన ధరలకు అందించేందుకు పి.పి.పి పద్ధతి నమూనాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు రంగ నైపుణ్యాలు, పెట్టుబడులను విజయవంతంగా వినియోగించుకోగలిగింది (బాక్స్ 4.4).

**బాక్స్ 4.4: ఉచిత డయాగ్నొస్టిక్‌లకు ప్రభుత్వ ప్రయివేటు నమూనా అమలు - ఆంధ్రప్రదేశ్**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పి.హెచ్.సిలు) నుండి జిల్లా ఆస్పత్రుల వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాలలో ఉచిత డయాగ్నొస్టిక్ సేవలను అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ఒక హైబ్రిడ్ నమూనాను అనుసరించింది. సేవల్ని రెండు స్థాయిల్లో అందిస్తున్నారు – వైద్య సదుపాయం

ప్రాంగణంలోనే ఉండే ల్యాబొరేటరీలు, ఆంధ్రప్రదేశ్ వైద్య పరీక్షల పథకం (ఎ.పి.వి.పి). ప్రతి సదుపాయంలో ప్రాథమికమైన మొదటి స్థాయి (లెవెల్ 1) డయాగ్నొస్టిక్‌లను ప్రాంగణంలోనే ఉండే ల్యాబొరేటరీలలో నిర్వహిస్తారు. ఈ పథకం కింద పి.హెచ్.సిలలో నిర్వహించిన పరీక్షల సంఖ్య మొత్తం ఔట్‌పేషెంట్ సందర్శనల్లో దాదాపు 25 శాతంగా ఉన్నాయి. అటువంటి సేవల మొత్తం వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది.

ఔట్‌పేషెంట్లలో దాదాపు 10 శాతం మందికి రెండో స్థాయి (లెవెల్ 2) పరీక్షలు అవసరమవుతాయి. వీటి శాంపిల్స్‌ను కేంద్రీకృత ల్యాబొరేటరీ సదుపాయానికి పంపాలి. మరింత అత్యాధునిక సేవలను అందించే డయాగ్నోస్టిక్ కేంద్రాలను పి.పి.పి పద్ధతిలో ఏర్పాటు చేశారు. ఒక ప్రయివేటు సేవల సంస్థ (మెదాల్ హెల్త్‌కేర్ ప్రయివేట్ లిమిటెడ్) ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అటువంటి 104 ల్యాబొరేటరీలను నడుపుతోంది. ఇవి మూడు విభాగాలుగా ఉన్నాయి (పట్టిక 1 చూడండి).

**(పట్టిక 1: ఎ.పి.వి.పి ల్యాబొరేటరీల్లో విభాగాలు, సేవల కవరేజీ)**

ఏడాదిలో దాదాపు 55-60 లక్షల మంది రోగులు ఎ.పి.వి.పి కింద పరీక్షల సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. జనవరి 2016, జూన్ 2017 మధ్య మొత్తం పరీక్షల్లో, పి.హెచ్.సి స్థాయిలో సేకరించిన శాంపిళ్లు అత్యధికంగా (52%) ఉన్నాయి. ఆ తర్వాత కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (30%), ఏరియా ఆస్పత్రులు (12%), జిల్లా ఆస్పత్రులు (6%) ఉన్నాయి. టెస్టుల్లో ఔట్‌పేషెంట్లు 97% ఉండగా, మిగిలినవి ఇన్‌పేషెంట్లకు చేసినవి.

'ఒక్కో రోగికి అయ్యే వ్యయం' పద్ధతిలో.. రోగికి రూ.235 చొప్పున ప్రభుత్వం సేవలదారునికి భర్తీ చేస్తోంది. 2016-17, 2017-18లో ఈ కార్యక్రమానికి రూ.105.75 కోట్లను కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం చెల్లిస్తుండగా, మిగిలినది యూనియన్ ప్రభుత్వం భరిస్తోంది.

అవసరమైన డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులోకి రావటంతో రోగికి అందే సేవలు మెరుగయ్యాయి. ప్రజలకు రోగ నిర్ధారణలపై ఓ.ఓ.పి.ఇ తగ్గింది (ప్రభుత్వ రంగంలో ఓ.ఓ.పి.ఇ లో 81% తగ్గింది). రాష్ట్రంలోని ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల పట్ల రోగుల్లో, వైద్యుల్లో సంతృప్తి భావన పెరిగింది.

మరింత సమాచారానికి అనుబంధం 4.3ను పరిశీలించగలరు.

**మూలం:**

1. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల పథకంపై మదింపు, ప్రపంచ ఆరోగ్య సంస్థ, భారత ప్రభుత్వం, 2018

2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ విభాగం జూన్ 4, 2021 నాటి అంచనాలతో రూపొందించిన నివేదికలు.

**4.2.2.8.2. రెండు స్థాయిల (లెవెల్ 1, లెవెల్ 2) డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీలు**

ప్రతిపాదిత నమూనాలో డయాగ్నోస్టిక్ సేవలను రెండు విభాగాలుగా విభజించవచ్చు - లెవెల్ 1, లెవెల్ 2 సేవలు. ప్రాథమిక ఆరోగ్య సెంటర్‌గా చిన్న పట్టణంలో ఉండే ప్రతి 10 ఎఫ్.పి క్లినిక్‌ల సముదాయంలో లెవెల్ 1 విభాగంలో సేవలందించే ఒక ల్యాబొరేటరీ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ నమూనాలో ప్రాంగణ ల్యాబొరేటరీల్లో అందించే సేవల తరహాలో, లెవెల్ 1 ల్యాబొరేటరీలు (పట్టణంలోని ఎఫ్.పి సముదాయంలో) ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షల సేవలను అందిస్తాయి (అనుబంధం 4.3). లెవెల్ 1 ల్యాబొరేటరీలు ప్రయివేటు నిర్వహణలో పనిచేస్తాయి, నిర్వహించిన ప్రతి పరీక్షకు నిర్దేశిత ఫీజును తీసుకుంటాయి. ఆంధ్రప్రదేశ్ పి.హెచ్.సిల్లో ఔట్‌పేషెంట్ సందర్శనలు, నిర్వహించిన పరీక్షల విశ్లేషణను బట్టి.. ఔట్‌పేషెంట్లలో దాదాపు 25 శాతానికి ప్రాంగణ ల్యాబొరేటరీల్లో ల్యాబ్ పరీక్షలు అవసరం (అనుబంధం 4.3).

లెవెల్ 2 డయాగ్నొస్టిక్ సేవలను అందించే ల్యాబొరేటరీలను ఆంధ్రప్రదేశ్‌లోని పి.పి.పి నమూనా తరహాలోనే ఏర్పాటు చేయాలి. ల్యాబొరేటరీలను ఏ స్థాయిలో ఏర్పాటు చేయాలనేది స్థానిక అవసరాలు, ఆర్థిక స్థాయిలను పరిగణలోకి తీసుకుని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించుకోవచ్చు. ఔట్‌పేషెంట్లలో 10 శాతానికి లెవెల్ 2 డయాగ్నొస్టిక్ సేవలు అవసరమని ఆంధ్రప్రదేశ్ అనుభవం తెలియచేస్తోంది.

రెండు స్థాయిల్లో డయాగ్నొస్టిక్‌ల వ్యయాన్ని ప్రభుత్వం భరించాలి. రూ.100 మించకుండా 25% రోగి సహ చెల్లింపు చేస్తాడు. నిరుపేద రోగులకు ఎఫ్.పి నిర్ణయాన్ని అనుసరించి సహ చెల్లింపు నుండి మినహాయింపు ఉంటుంది. డబ్బు లేకపోవటం వల్ల రోగ నిర్ధారణ పరీక్షల సేవలు ఏ రోగికీ అందకుండా ఉండకూడదు అనే సూత్రాన్ని విధిగా పాటించాలి.

**4.2.2.9. ఔషధాల సేకరణ, సరఫరా**

జనరిక్ ఔషధాలు, మందుల సరఫరా సక్రమంగా జరిగేలా చూడటం ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలోని ఒక కీలకాంశం. ఆస్పత్రేతర ఆరోగ్య సంరక్షణలో ఒక వ్యక్తి వెచ్చిస్తున్న మొత్తం ఓ.ఓ.పి.ఇలో సగటున 60% కంటే ఎక్కువ డబ్బు మందులకే అవుతున్నందున మన సందర్భంలో మరీ ముఖ్యంగా పరిగణలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రజలకు సురక్షితమైన, ప్రభావవంతంగా పనిచేసే మందుల్ని అందించే పని సక్రమంగా చేయకుండా.. ప్రజలకు నామమాత్ర ఖర్చుతో నాణ్యమైన సేవల్ని గ్యారంటీగా అందించేందుకు చేసే ఏ ప్రయత్నం కూడా సక్రమంగా పని చేయదు.

ఔషధాల సరఫరాలో రెండు అంశాలుంటాయి. ఒకటి, ఔషధాల సేకరణ, రెండు, ఔషధాల పంపిణీ. సేకరణ దశలో ప్రభుత్వం అర్థవంతమైన వ్యయంతో మందుల్ని సేకరించగలగటం కీలకం. ప్రజలకు ప్రిస్క్రిప్షన్ ద్వారా ఔషధాల్ని భారీ సబ్సిడీతో సరఫరా చేయటం ఆర్థికంగా ఎంత మేర సాధ్యమన్నది ఈ అంశంపైనే ఆధారపడి ఉంటుంది.

(ఇంకా ఉంది...)

# మీ ఆహారం, మీ దేవుళ్లు తక్కువ..
# ధోరణి భారతీయ సంస్కృతి కాదు



ఇటీవలి కాలంలో ప్రజల ఆహారం, దేవుళ్లు ఎలా ఉండాలి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు అంటే ఏమిటి అనే చర్చ మన దేశంలో జరుగుతోంది. మీరు తినేది తక్కువ స్థాయిలోనిది, మేం తినేది ఎక్కువ స్థాయి కలిగినది.. మీ దేవుళ్లు తక్కువ, మా దేవుళ్లు ఎక్కువ.. ధోరణుల్ని వ్యాపింపచేస్తున్నారు. ప్రజలను ప్రభావితం చేయగలిగినవారే ఇలా మాట్లాడుతుండటంతో, కొన్ని వర్గాలు న్యూనతకు గురవుతున్నారు, ప్రజల మధ్య విభజనలు ప్రబలుతున్నాయి.

సింధు నాగరికత అవశేషాల్లో కనిపించిన దేవుళ్లలో కొందరిని మన దేశంలో ఇప్పటికీ పూజిస్తున్నాం. మనకు చాలా ఊళ్లలో గ్రామదేవతలు ఉంటారు. ఏదోక విశ్వాసంతో ప్రజలు ఆ దేవతల్ని పూజిస్తుంటారు. ఒకే దేవుడు ఉండాలి, ఒకే దేవత ఉండాలి అని భారతీయ సంప్రదాయమేమీ చెప్పలేదు. దేవుడే లేడన్నవారిని, ఉన్నాడో లేడోనని సంశయించినవారిని కూడా గౌరవించింది. కణాదుడు, చార్వాకుడు వంటి వారిని రుషులుగా పూజించింది. సనాతన హైందవంపై తిరుగుబాటు చేసి సమత, అహింస, సౌభ్రాతత్వం, నైతికత, ధర్మాల్ని బోధించిన బుద్ధుడిని అవతార పురుషుడిని చేసింది. అలాగే మహావీర జైనుడు వంటి వారిని కొలుస్తోంది. మీ ఆహారం తక్కువ రకం, మీ దేవుళ్లు తక్కువ అనటం ఏ రకంగానూ భారతీయ సంస్కృతి కాదు, భారతీయ పరంపరలో భాగం కాదు.

మతగురువులు కావచ్చు, పాత్రికేయులు కావచ్చు, తమ మాటకు సమాజంలో విలువ ఉంది అనుకునేవారంతా ప్రజలను విభజించేందుకు కాకుండా.. వారిని కలిపేందుకు తమ పలుకుబడిని ఉపయోగించాలి. వాస్తవాల ఆధారంగా హేతుబద్ధంగా మాట్లాడాలి. మీ గొంతును చౌకబారు విషయాల కోసం కాకుండా, ప్రజలకు ఎదిగే అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి అంశాల కోసం వినియోగించండి.

ఓ బిడ్డకు ప్రకృతో, దేవుడో ఇచ్చిన ప్రతిభను వికసింప చేసుకునే అవకాశం లేకపోవటం, నివారించదగ్గ బాధలు సమాజంలో కొనసాగటం.. ఈ రెండూ భారతదేశంలో కొనసాగుతున్న భయంకరమైన పాపాలు. ఈ పాపాలను నిర్మూలించటానికి, నివారించటానికి మీ శక్తిసామర్థ్యాలను ఉపయోగించండి.



ప్రజలను కలపటంలో, వారి శక్తిసామర్థ్యాలను వికసింప చేయటంలో నాగరికత, నాయకత్వం ఉంటాయి గానీ.. వారిని విభజించటంలో, అజ్ఞానంలో కొనసాగించటంలో కాదని గుర్తించి వ్యవహరించాలని అందరికీ వినమ్రపూర్వక విజ్ఞప్తి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th April, 2022 Posting Date 15 &16th of every month




# ఇంత తక్కువ ఖర్చుతో, ఇన్ని కోట్ల మందికి, ఇంత మేలు చేసే పథకం ప్రపంచంలో ఏ దేశంలోనైనా, ఏ రంగంలోనైనా ఉందా?

ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానం అమలైతే జేబుఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యం అందుతుంది. అది కూడా ప్రభుత్వ ఖజానాపై పెద్ద ఆర్థిక భారం లేకుండా. ఈ విధానం అమలుకు అదనపు ఖర్చు జాతీయాదాయంలో ఏటా కేవలం 0.4%. తెలంగాణకు రూ.1900 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కి రూ.2600 కోట్లు. ఇంత తక్కువ ఖర్చుతో, ఇన్ని కోట్ల మందికి, ఇంత మేలు చేసే కార్యక్రమం ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రంగంలోనూ లేదు. ఈ దేశంలో చేయాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి. కానీ ఈ ఒక్క ఆరోగ్య విధానం మాత్రమే అమల్లోకి వచ్చి ఇంకేమీ జరగలేదనుకోండి.. అయినా కూడా మహాద్భుతాన్ని సాధించినట్లే. ఈ దేశ రూపురేఖలే సమూలంగా మారతాయి. ఎప్పుడో 1948, జులై 5న రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో దేశాలన్నీ భస్మమైపోయాక, కోట్ల మందిని యుద్ధం కబళించాక, ఆర్థిక వ్యవస్థ చితికిపోయాక బ్రిటన్‌లో అందరికీ ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆరోజు బ్రిటన్‌తో పోలిస్తే, ఆర్థికంగా, సాంకేతికంగా మనం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నాం. అది జరిగి ఏడు దశాబ్దాలవుతుంది. కొవిడ్ విలయాన్ని చూశాక, 74 ఏళ్ల తర్వాత కూడా వాళ్లు ఆనాడు చేసింది మనం చేయలేకపోతే ఎలా? నూటికి నూరుపాళ్లూ అమలు సాధించగలం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**